CENTRE FOR DISTANCE EDUCATION

# POETICS AND AESTHETICS (III)

## M.A. SANSKRIT

## Semester-II, Paper -IV



CENTRE FOR DISTANCE EDUCATION
ACHARYA NAGARJUNA UNIVERSITY
NAGARJUNA NAGAR-522510

# POETICS AND AESTHETICS (III)

## M.A. SANSKRIT

## Semester-II, Paper -IV

**Director**

**Dr.Nagaraju Battu**

M.H.R.M., M.B.A., L.L.M., M.A. (Psy), M.A., (Soc), M.Ed., M.Phil., Ph.D.

Centre for Distance Education

Acharya Nagarjuna University

Nagarjuna Nagar-522510

Phone No.0863-2346208, 0863-2346222,

0863-2346259 (Study Material)

Website: www.anucde.info

e-mail: anucdedirector@gmail.com

శ్రీః

## కృతి సమర్పణము

పుట్టినది జమీందారుల కుటుంబములో నైనను నిరాడంబర జీవితము గడుపుచు ఉన్నతపదవులలో ఉన్న పలువురకు మార్గ దర్శకులును, ఆంధ్రప్రదేశ్ సాహిత్యఅకాడమీకి కార్యదర్శిగ ఉండి ఇతర రాష్ట్రములలోని అకాడమీలకు ఒక ఉన్నతాదర్శము నెలకొల్పిన కార్యనిర్వహణదక్షులును, చాలాకాలము ఉస్మానియా విశ్వవిద్యాలయమ్ము సిండికేటులో సభ్యులుగా ఉండి, వివిధ శాఖలలో ఉత్తమ విద్యాప్రమాణములను రూపొందించుటయే విశ్వవిద్యాలయముల ప్రధాన కర్తవ్యమను నమ్మికతో ఉన్నతవిద్యాసేవ చేసిన విద్యావేత్తలును అగు

**శ్రీ దేవులపల్లి రామానుజరావుగారికి**
సాదరముగా సమర్పితము

భవ్యేయం కావ్యమీమాంసా బాలానన్దిన్యుపస్కృతా,
రామానుజాయ సుధియే శ్రీమతే తే సమర్ప్యతే.

27.5.1979

**పుల్లెల శ్రీరామచంద్రుడు**
బాలానన్దినీరచయిత



IX
P.P.-II

ప్రథమ ముద్రణకు

## ప్రస్తావన

సాధారణముగ సంస్కృత గ్రంథరచయితల జీవితవిశేషాదులను గూర్చి తెలిసి కొనుటకు వారి గ్రంథములు అంతగ ఉపకరించవు. కాని రాజశేఖరుడు తన రచనలలో తన జీవితాదులకు సంబంధించిన ఎన్నో విషయములను పేర్కొని యుండుటచే అతని దేశ కాలాదులకు సంబంధించిన విషయములను కొంతవరకు నిశ్చయపూర్వకముగ తెలిసికొనగలుగుచున్నాము.

రాజశేఖరుడు మహారాష్ట్రదేశీయుడు. ఆ రోజులలో వివిధప్రాంతముల రాజుల మధ్య తరచుగ యుద్ధములు జరుగుచుండుటచే దేశముల సరిహద్దులు అతిశీఘ్రముగ మారిపోవుచుండెడివి. కుంతల - విదర్భ - లాట - చేదిదేశములలోని కొన్ని భాగములు కలిసి ఆనాటి మహారాష్ట్రము. రాజశేఖరునకు ఈ నాలుగు ప్రాంతములతో సంబంధ మున్నట్లు ఆతని గ్రంథములవలన తెలియుచున్నది. ఈతడు లాటదేశీయుల ప్రాకృతభాషను, అచటి సుందరాంగుల సౌందర్యాదులను ఎక్కువగా మెచ్చుకొనినాడు. దక్షిణగుజరాతు ప్రాంతమునకును, మహారాష్ట్రములోని కొంత భాగమునకును ఆనాడు లాటదేశ మని పేరు. లాటదేశముపై ఈతడు చూపిన మక్కువను బట్టి ఈతడు కొంతకాలము ఈ ప్రాంతమునందు నివసించి యుండు ననియు, ఈ దేశమునకు సంబంధించిన ప్రభుదేవి యను కవి ఈతనికి ప్రేయసి ఐ ఉండు ననియు విమర్శకుల అభిప్రాయము. మహారాష్ట్రాంతర్గత మైన విదర్భప్రాంతము (నేటి బరార్) ఈతని జన్మస్థానమై యుండు నని కూడ కొందరి అభిప్రాయము. ఈ ప్రాంతమును రాజశేఖరుడు బాలరామాయణాదులలో కుంతలదేశ మని కూడ పేర్కొనినాడు. ఆ రోజులలో కుంతల దేశీయులు (కర్ణాటదేశీయులు) ఈ ప్రాంతమును కూడ పాలించియుందురు.

రాజశేఖరుని వంశాదులు :- తాను యాయావరవంశీయు డని రాజశేఖరుడు కావ్యమీమాంసలో అనేక స్థలములందు చెప్పికొనినాడు. తరువాతి కవులు కొందరు ఈతనిని యాయావరు డనియే పేర్కొన్నారు. ఈతని పూర్వపురుషులను గూర్చిన కొన్ని విషయములు ఆతని నాటకముల ద్వారా తెలియుచున్నవి. ఈతని ముత్తాతయగు అకాలజలదుడు మహాకవి. ఈతని శ్లోకములను అపహరించి, తన నాటకములలో కూర్చుకొని కాదంబరీరాము డను కవి నాటకరచయితగా పేరు పొందినాడట. రాజశేఖరుని వంశములో సురానందుడు, తరలుడు, కవిరాజు అనువారు కూడ గొప్ప ప్రసిద్ధి పొందిన కవులు. సురానందుడు

చేదిరాజాస్థానపండితుడుగా ఉండెనట. కావ్యమీమాంసలో అచ్చటచ్చట ఈతని మతమును ఉదాహరించుటను పట్టి ఈతడు అలంకారశాస్త్రగ్రంథ మేదియో వ్రాసి యుండు నని తెలియుచున్నది. రాజశేఖరుని తండ్రి యైన దుర్దుకుడు లేదా దుహికుడు మహామంత్రిగా ఉండెనట. ఈతని తల్లి పేరు శీలవతి.

రాజశేఖరుడు యాయావరవంశమునకు చెందినవాడే యైనను, ఈతని భార్యయైన అవంతిసుందరి 'చాహువాన' వంశమునకు చెందిన దగుటచే ఈతడు క్షత్రియుడై యుండునా అని కొందరి ఊహ. కాని ధర్మశాస్త్రములను బట్టి చూడగా యాయావరీయులు బ్రాహ్మణులే అని తెలియుచున్నది. (చూ. కావ్యమీమాంస. పు.4). అవంతిసుందరి ఉత్తమవిద్యాసంస్కృతి సంపన్నురాలు. కావ్యమీమాంసలో రాజశేఖరుడు ఈమె మతమును మూడు స్థలములలో ఉదాహరించినాడు. దీనిని పట్టి చూడగా ఈమె ఏదియో అలంకారశాస్త్రగ్రంథమును రచించి యుండవచ్చు నని తోచుచున్నది. రాజశేఖరుని ప్రాకృతభాషారూపక మగు కర్పూరమంజరి మొట్టమొదట ఈమె అభిలాష ననుసరించి ప్రయోగింపబడినది.

రాజశేఖరుని గ్రంథములను పరిశీలింపగా ఈతనికి శివవిష్ణ్వాదుల విషయమున తారతమ్య బుద్ధి లేకపోవుటయే కాక జైనబౌద్ధాదిమతముల విషయమున గూడ ఈతడు ఉదారాశయు డని తెలియుచున్నది.

మహారాష్ట్రములోని బరారుప్రాంతమునకు చెందినవా డగుటచే రాజశేఖరునకు ఆంధ్ర - కర్ణాట - ద్రావిడాది దాక్షిణాత్యదేశములతో ఘనిష్ఠసంబంధ ముండి యుండును. ఈతడు యౌవనమున ఈ దేశములందు సంచరించుచు భోగవిలాసపూర్ణ మైన జీవితమును గడిపినట్లు క్షేమేంద్రుని ఔచిత్యవిచారచర్చలోని ఈ క్రింది శ్లోకమువలన తెలియుచున్నది.

**"కర్ణాటీదశనాఙ్కితః శితమహారాష్ట్రీకటాక్షక్షతః**
**ప్రౌఢాన్ధ్రీస్తనపీడితః ప్రణయినీభ్రూభఙ్గవిత్రాసితః,**
**లాటీబాహువివేష్టితశ్చ మలయస్త్రీతర్జనీతర్జితః**
**సోఽయం సంప్రతి రాజశేఖరకవిర్వారాణసీం వాఞ్ఛతి".**

"కర్ణాటకాంతల దంతక్షతములచే చిహ్నితుడును, మహారాష్ట్రమందయానల తీక్ష్ణ కటాక్షములచే గ్రుచ్చబడిన వాడును, ప్రౌఢ లగు ఆంధ్రమహిళామతల్లుల పయోధరములచే పీడింపబడినవాడును, ప్రేయసుల భ్రూభంగములచే భయపెట్టబడినవాడును, లాటదేశీయ కుటిలాలకల బాహువులచే బంధింపబడినవాడును, మలయపర్వతప్రాంతీయ సుందరీ మణుల తర్జనిచే జడిపింపబడినవాడును అగు ఈ రాజశేఖరకవి ఇపుడు వారణాసిపై ఇచ్ఛ చూపుచున్నాడు".

ఈ విధముగ మహారాష్ట్రమున జన్మించి, దక్షిణాపథమునందలి అనేక ప్రాంతములతో గూడ సంబంధము గల రాజశేఖరుడు తన పాండిత్యాదులచే, ఆనాడు సకలవిద్యాస్థానమై





భారతీయసంస్కృతికి ఆటపట్టైన కాన్యకుబ్జమున రాజాదరము సంపాదించుటయే కాక అపుడు రాజ్యము పాలించుచున్న నిర్భయ మహేంద్రపాలునికి ఉపాధ్యాయుడుగ కూడ ఉండెను. మహేంద్రపాలుని కుమారు డగు మహీపాలుడు కూడ రాజశేఖరుని తన ఆస్థాన విద్వాంసునిగ చేసికొని గౌరవించెను.

కనౌజును రాజధానిగ చేసికొని మధ్యదేశమును పాలించిన ఈ నిర్భయ మహేంద్ర పాల - మహీపాలులు గూర్జరదేశములోని ప్రతీహారవంశమునకు చెందినవారు. మహేంద్ర పాలుడు క్రీ.శ. 890 - 908 సంవత్సరములందును, మహీపాలుడు 910 - 940 సంవత్సరములందును రాజ్యపాలనము చేసిరి. కావున చాలకాలము మహేంద్రపాలుని ఆస్థానమును, తరువాత కొంచెము కాలము మాత్రమే ఆతని కుమారు డగు మహీపాలుని ఆస్థానమును అలంకరించిన రాజశేఖరుని కాలము క్రీ.శ. 880 - 920 అని నిర్ధారణ పూర్వకముగ చెప్పవచ్చును. రాజశేఖరుడు ఈ కాలమునకు చెందినవా డని చెప్పుటకు మరి కొన్ని ఆధారములు కూడ ఉన్నవి. క్రీ.శ. 857 - 884 ప్రాంతమునకు చెందిన ఆనందవర్ధనుని మతమును రాజశేఖరుడు ఉదాహరించినాడు. అట్లే పదవశతాబ్దము ఉత్తరార్ధమునకు చెందిన సోమదేవ - సోడ్ఢల - అభినవగుప్తులు రాజశేఖరుని గ్రంథముల - నుండి ఉదాహరించి యున్నారు.

**"హిమవద్విన్ధ్యయోర్మధ్యం యత్ప్రాగ్వినిశనాదపి,**
**ప్రత్యగేవ ప్రయాగాచ్చ మధ్యదేశః ప్రకీర్తితః"**

అను మనుస్మృతి వాక్యము ననుసరించి, దక్షిణమున విన్ధ్యము, ఉత్తరమున హిమాలయము, పశ్చిమమున వినశనము (సరస్వతీనది భూమిలో హరించిపోయిన చోటు. ఇది నేటి థానేశ్వరము. అంబాలా జిల్లాలోని 'సరహిందు' అను స్థాన మని కొందరు చెప్పుదురు), తూర్పున ప్రయాగ - ఈ నాలిగింటి మధ్య నున్న దేశము మధ్యదేశము. రాజశేఖరుడు కూడ దీనినే మధ్యదేశ మని చెప్పినాడు. ఈ ప్రాంతమువారు సదాచార సంపన్నులు, సభ్యత కలవారు అని కామసూత్రములో చెప్పబడినది. **"మధ్యదేశ్యాః ఆర్యప్రాయాః శుచ్యుపచారాః"** (కా.సూ.) ఈ సూత్రార్థమును వివరించుచు జయమంగళ వ్యాఖ్యానమున, "వసిష్ఠుని మతము ప్రకారము గంగాయమునల మధ్యనున్న దేశము మధ్యదేశము" అని చెప్పబడినది. రాజశేఖరుడు గంగాయమునామధ్య ప్రాంతమును అంతర్వేది యనియు, పాంచాల మనియు పేర్కొనినాడు. కాన్యకుబ్జము మధ్యదేశరాజధాని. కాన్యకుబ్జరాజాదరణము పొందిన రాజశేఖరుడు పాంచాలములోని పండితులు శాస్త్ర కావ్యాదులలో చాల నిష్ణాతు లనియు, ఉత్తమసంస్కృతి కలవారనియు, వీరి అభిరుచులు అగ్రామ్యములుగ నుండు ననియు, కాన్యకుబ్జస్త్రీల సుందరము లగు వేషభూషాదులను ఇతరప్రాంతీయు లందరును, అనుకరించుటకై ప్రయత్నించుచుందు రనియు బాలరామాయణ-కావ్యమీమాంసాదులలో చెప్పియున్నాడు.

"యత్రార్యే ! న తథానురజ్యతి కవిగ్రామీణగీర్గుమ్ఫనే
శాస్త్రీయాసు చ లౌకికీషు చ యథా భవ్యాసు నవ్యోక్తిషు,
పాఞ్చాలాస్తవ పశ్చిమేన త ఇమే వామా గిరాం భాజనా
స్త్వద్దృష్టేరతిథీభవన్తు యమునాం త్రిస్రోతసం చాన్తరా.

(బాలరామాయణము. 10.8)

"యో మార్గః పరిధానకర్మణి, గిరాం యః సూక్తిముద్రాక్రమో
భంగిర్యా కబరీచయేషు, రచనం యద్భూషణాలీషు చ,
దృష్టం సున్దరి కాన్యకుబ్జలలనాలోకైరిహాన్యచ్చ యత్
శిక్షన్తే సకలాసు దిక్షు తరసా తత్ కౌతుకిన్యః స్త్రియః"

(బాలరామాయణము. 10,90)

ఈ కాన్యకుబ్జమునే కేంద్రమునుగా గ్రహించి రాజశేఖరుడు భారతదేశము నందలి వివిధప్రాంతముల సీమావిభజనము చేసి యున్నాడు.

రాజశేఖరుడు తనకు 'కవిరాజు' అను బిరుద మున్నట్లు కర్పూరమంజరిలో చెప్పు కొన్నాడు. కావ్యమీమాంసలో ఈతడు వర్ణించిన పది 'కవి' భేదములలో 'కవిరాజు' అనునది ఏడవది. కవిరాజు మహాకవికంటె గొప్పవాడు. అనేకభాషలలో, విభిన్నరసములతో ఒప్పారు వివిధ సాహిత్య ప్రక్రియలందును చేయితిరిగినవాడు కవిరాజు.

రాజశేఖరుని కృతులు :- "బాలరామాయణ' - 'బాలభారత'(అసంపూర్ణము) 'విద్ధ సాలభంజికలు' ఈతని సంస్కృత రూపకములు. 'కర్పూర మంజరి' ప్రాకృతరూపకము. కావ్యమీమాంస ఈతడు పరిణతబుద్ధియైన పిమ్మట రచించిన అలంకారశాస్త్రీయగ్రంథము. కవిశిక్షాగ్రంథము,కర్పూరమంజరి రచించునాటికే ఈతనికి 'కవిరాజ' బిరుదము లభించినది. మొదటి మూడు రూపకములలోని శ్లోకములను కావ్యమీమాంసలో ఉదాహరించుట జరిగినది. ఈతడు 'హరివిలాస' మను ఒక మహాప్రబంధమును కూడ రచించి యుండునని తరువాతి కవుల రచనల ద్వారా తెలియు చున్నది. ఇది ఇపుడు అలభ్యము. హేమచంద్ర - ఉజ్జ్వలదత్తాదులు దీనినుండి కొన్ని శ్లోకములను ఉదాహరించినారు. ఈ కావ్యము ప్రారంభమున ఈతడు కొందరు పూర్వకవులను స్తుతించి యుండును. అట్టి సంప్రదాయము ఆనాటి ప్రాకృత కావ్యములలో కూడ ఉన్నది. రాజశేఖరుని ఈ విశిష్టకవి ప్రశంసలు జల్హణుని సూక్తిముక్తావళిలో ఉద్ధృతములై ఉన్నవి. ఈ శ్లోకము లాధారముగ చేసికొని కొందరు 'కవివిమర్శము' అను మరి యొక గ్రంథమును కూడ రాజశేఖరుడు రచించి యుండు నని ఊహించు చున్నారు. అట్లూహించుట కంటె హరవిలాస ప్రారంభముననే రాజశేఖరు డా శ్లోకములను కూర్చి యుండునని చెప్పుట యుక్త మని మరి కొందరి అభిప్రాయము. భూగోళమును వర్ణించు 'భువనకోశము' అను గ్రంథమును కూడ





రాజశేఖరుడు రచించినట్లు కావ్యమీమాంస లోని 17వ అధ్యాయమువలన తెలియుచున్నది. అది స్వతంత్రగ్రంథమో లేక కావ్యమీమాంసలోని అలభ్య మగు భాగమో తెలియదు. ఉజ్జ్వలదత్తుడు శివనామపర్యాయములను చెప్పు శ్లోక మొకదానిని రాజశేఖరకృత మని ఉదాహరించినాడు. ఇది హరవిలాసములో ఉన్నదో, రాజశేఖరుడు నిఘంటువు కూడ ఏదైన రచించినాడో తెలియదు. అలంకార శేఖరమునందు మూడు శ్లోకములు రాజశేఖరకృతములుగ ఉదాహరింపబడినవి :-

"సమానమధికం న్యూనం సజాతీయం విరోధి చ,
సకుల్యం సోదరం కల్పమిత్యాద్యాః సామ్యవాచకాః.
అలఙ్కారశిరోరత్నం సర్వస్వం కావ్యసమ్పదామ్,
ఉపమా కవివంశస్య మాతైవ వేతి మతిర్మమ."
"ఉత్పాటితై ర్నభోభీతైః శైలైరామూలబన్ధనాత్,
తాంస్తానర్థాన్సమాలోక్య సమస్యాం పూరయేత్కవిః".

ఇవి నిజముగ రాజశేఖరుని శ్లోకములే యైనచో మొదటి రెండును ఉభయాలంకారి కాధికరణములోనివి, మూడవది వైనోదికాధికరణములోనిది అయి ఉండవలెనని విమర్శకుల అభిప్రాయము.

రాజశేఖరుని కాలమున సంస్కృతభాషతో పాటు ప్రాకృత - అపభ్రంశ - పైశాచీభాషలు కూడ కావ్యభాషలుగా ప్రచారములో ఉండెడివి. నేటి వ్రజభాషకు మూలభాష యైన శౌరసేనీప్రాకృతమును గూర్చి రాజశేఖరుడు "మధుర మధురావాసిభణితిః" అని చెప్పియున్నాడు. ఏ ప్రాంతమున ఏ భాషలు ప్రచారములో ఉండెడివో, ఎవరు ఏ భాషను ఆదరించెడివారో దేనిని ద్వేషించెడివారో, ఎవరు ఏ భాషలో ప్రవీణులో మొదలగు విషయములను కూడ ఈతడు కావ్యమీమాంసలోనే కాక బాలరామాయణాదులలో కూడ సూచించినాడు. అపభ్రంశభాష మార్వాడ్, తూర్పు పంజాబు, స్యాల్‌కోట్ మొదలైన ప్రాంతాలలోను, పైశాచీభాష అవన్తి - పారియాత్ర-దశపురాది ప్రాంతములలోను ప్రచారములో నుండెడివి. ఆయా ప్రాంతీయుల ఉచ్చారణ భేదములను కూడ వర్ణించినాడు. దీనిని బట్టి రాజశేఖరునకు ఆనాటి దేశభాషలలో కూడ మంచి ప్రవేశమున్నట్లు స్పష్ట మగుచున్నది. కావుననే ఈతడు తన కవిరాజత్వమును బాలరామాయణములో ఈ విధముగ సమర్థించుకొనినాడు :-

"గిరః శ్రవ్యా దివ్యాః ప్రకృతిమధురాః ప్రాకృతధురాః
సుభవ్యోఽపభ్రంశః సరసరచనం భూతవచనమ్,
విభిన్నాః పన్థానః కిమపి కథనీయాశ్చ త ఇమే
నిబద్ధా యస్త్వేషాం స ఇహ కవిరాజో విజయతే".

"శ్రవణమధురము లగు సంస్కృతరచనలు, స్వభావ మధురము లగు ప్రాకృత కృతులు, అందమైన అపభ్రంశభాషాకావ్యము; సరసమైన పైశాచభాషారచనము – వీటినన్నింటిని విభిన్నసాహిత్యప్రక్రియలలో నడిపించిన కవిరాజు సర్వోత్కర్షతో ఉన్నాడు".

ప్రాకృతభాష విషయమున రాజశేఖరుడు లాటదేశీయులను అధికముగ ప్రశంసించి నాడు. సంస్కృతభాషాద్వేషు లగు లాటదేశీయులు ప్రాకృతకావ్యములను పఠించునపుడు వారు నాలుకను త్రిప్పెడు విధానము కూడ చూడ ముచ్చటగా నుండునట :

**"పఠన్తి లటభం లాటాః ప్రాకృతం సంస్కృతద్విషః,**
**జిహ్వయా లలితోల్లాపలబ్ధసౌందర్యముద్రయా"** (కా.మీ. 7)

లాటదేశీయుల నోటినుండి ఇంత మధురముగ వినవచ్చు ఈ ప్రాకృతకావ్యమే గౌడ దేశీయులు చదువుచున్నపుడు వినుటకు చాల దుర్భరముగ నుండునట. అందుచేతే సరస్వతి బ్రహ్మవద్దకు వెళ్లి – "నీవు గౌడుడు ప్రాకృతగాథలు చదువకుండు నట్లు చేసెదవా; లేదా నన్ను వాగ్దేవిగా నా ఉద్యోగమునకు రాజీనామా ఈయమందువా" అని అడిగినదట:-

**"బ్రహ్మన్ విజ్ఞాపయామి త్వాం స్వాధికారజిహాసయా,**
**గౌడస్త్యజతు వా గాథామన్యా వాస్తు సరస్వతీ"** (కా.మీ. 7)

బాలరామాయణములోని లాటదేశవర్ణన ప్రకరణమునందు గూడ రాజశేఖరుడు లాటదేశీయుల ప్రాకృతమును ప్రశంసించుచు వారి ప్రాకృతము చెవిలో పడగనే ఇతర భాషలన్నియు కటువుగ ఉండు ననియు, లాటదేశస్త్రీల మధురప్రాకృతోక్తులు, వక్రవీక్షణ ములు, మన్మథుని కూడా ఉత్తేజితుని చేయుననియు చెప్పియున్నాడు :-

**"యద్యోనిః కిల సంస్కృతస్య సుదృశాం జిహ్వాసు యన్మోదతే**
**యత్ర శ్రోత్రపథావతారిణి కటుర్భాషాక్షరాణాం రసః,**
**గద్యం చూర్ణపదం పదం రతిపతే స్తత్ప్రాకృతం యద్వచః**
**తాన్ లాటాన్ లలితాఙ్గి పశ్య నుదతీదృష్టేర్నిమేషవ్రతమ్.**

**లక్ష్యీకర్తుం ప్రవృత్తోఽపి లాటీలడహవీక్షితైః**
**లక్ష్యీభవతి కన్దర్పః స్వేషామేవాత్ర పత్రిణామ్".**

రాజశేఖరునకు సంస్కృతకావ్యములంటె ప్రాకృతకావ్యములందే ఆసక్తి అధికము. సంస్కృతము పరుషమైనదనియు. ప్రాకృతము సుకుమారమైనదనియు కర్పూరమంజరీ ప్రారంభమున చెప్పుచు ప్రాకృత సంస్కృత కావ్యములనడుమ నున్న భేదము స్త్రీ పురుషుల మధ్య నున్న భేదము వంటి దని వర్ణించినాడు :-

**"పరుసా సంక్కిఅబన్ధా పాఉదబన్ధో వి హోఇ సుఉమారో,**
**పురుస మహిలాణం జేత్తిఅ మిహంతరం తేత్తిఅ మిమాణం".**





ప్రాకృతము సంస్కృతమునకు మూల మని కొందరు, సంస్కృతము ప్రాకృతమునకు మూల మని మరికొందరు చెప్పుచుందురు. రాజశేఖరుడు మాత్రము, పైన ఉదహరించిన 'యద్యోనిః కిల' అను శ్లోకములో, ప్రాకృతమునుండి సంస్కృతము పుట్టిన దని చెప్పినాడు.

రాజశేఖరుడు తన పాండిత్యప్రకర్షవిషయమునను, కవితానిర్మాణచాతుర్యము విషయమునను మంచి ఆత్మవిశ్వాసము గల వ్యక్తి. ఆదికవి యైన వాల్మీకియే రెండవ జన్మమున భర్తృమేంఠుడు గాను, తరువాత భవభూతి గాను జనించి, పిదప రాజశేఖరుడుగా అవతరించినా దని ఒక దైవజ్ఞుడు చెప్పినట్లుగా అతడే ఈ క్రింది శ్లోకములో చెప్పుకొన్నాడు.

**"బభూవ వల్మీకభవః కవిః పురా తతః ప్రపేదే భువి భర్తృమేణ్ఠతామ్,**
**స్థితః పునర్యో భవభూతిరేఖయా స వర్తతే సంప్రతి రాజశేఖరః".**

వాల్మీకి – భర్తృమేంఠ – భవభూతులు రాజశేఖరునకు ఆదర్శకవు లను విషయ మును గూడ ఈ శ్లోకము సూచించు చున్నది. మహావీరచరిత – మాలతీమాధవ–ఉత్తర రామచరితముల రచయిత యైన భవభూతి సర్వవిదితుడు. భర్తృమేంఠుడు కాశ్మీరదేశరా జగు మాతృగుప్తుని ఆస్థానములో నుండెడివాడు. ఈతడు రచించిన హయగ్రీవ వధమహాకావ్యము ఇపుడు అలభ్యము. ఈతడు వక్రోక్తినిపుణు డని వర్ణించు శ్లోక మొదటి జల్హణుని సూక్తిముక్తావళిలో ఉన్నది :-

**"వక్రోక్త్యా మేణ్ఠరాజస్య వహన్త్యా సృణిరూపతామ్,**
**ఆవిద్ధా ఇవ ధున్వన్తి మూర్ధానం కవికుఞ్జరాః".**

"అంకుశముగా నైన మేంఠుని వక్రోక్తిచే గ్రుచ్చబడినవారు వలె కవికుంజరులు తల లూపుచున్నారు".

రాజశేఖరుడు విశాలహృదయుడైన కవి; విమర్శకుడు. పురుషుల వలె స్త్రీలు కూడ ఉత్తమకవులు కావలెనని కావ్యమీమాంసానవమాధ్యాయమున చెప్పుచు మంచి సంస్కారమును సంపాదించుకొను విషయములో స్త్రీపురుషాదిభేదము లేదని స్పష్టీ కరించినాడు. ఈతని భార్యయైన అవంతిసుందరి గొప్పవిదుషీమణి అను విషయమును చూచియున్నాము. ఈతడు కొందరు స్త్రీకవులను ప్రశంసించుచు వ్రాసిన కొన్ని శ్లోకములు సూక్తిముక్తావళిలో పొందుపరచబడియున్నవి. మంచి సంస్కారము సంపాదించుకున్నవారు జాతివర్ణాదిభేదములతో పని లేక గౌరవపాత్రులే అని కూడ రెండు శ్లోకములలో చెప్పి యున్నాడు :-

**"కే వైకటనితమ్బేన గిరాం గుమ్ఫేన గుమ్భితాః,**
**నిన్దన్తి నిజకాన్తానాం న మౌగ్ధ్యమధురా గిరః".**

# కావ్యమీమాంసా

## విషయసూచిక


| అధ్యాయము | విషయము | పుట |
|---|---|---|
| 1. | శాస్త్రసఙ్గ్రహః | 1 |
| 2. | శాస్త్రనిర్దేశః | 4 |
| 3. | కావ్యపురుషోత్పత్తిః | 14 |
| 4. | పదవాక్యవివేకః | 28 |
| 5. | వ్యుత్పత్తిః కావ్యపాకశ్చ | 41 |
| 6. | పదవాక్యవివేకః | 57 |
| 7. | వాక్యభేదాః | 77 |
| 8. | కావ్యార్థయోనయః | 95 |
| 9. | అర్థవ్యాప్తిః | 115 |
| 10. | కవిచర్యా - రాజచర్యా చ | 136 |
| 11. | శబ్దహరణమ్ | 153 |
| 12. | శబ్దార్థహరేషు కవిప్రభేదాః ప్రతిబిమ్బకల్పవికల్పస్య చ సమీక్షా | 172 |
| 13. | అర్థహరణే ష్వాలేఖ్యప్రఖ్యాదిభేదాః | 189 |
| 14. | జాతిద్రవ్యక్రియాసమయస్థాపనా | 212 |
| 15. | గుణసమయస్థాపనా | 224 |
| 16. | స్వర్గ్యపాతాలీయకవి రహస్యస్థాపనా | 232 |
| 17. | దేశవిభాగః | 241 |
| 18. | కాలవిభాగః | 267 |




శ్రీః

శ్రీ మహాగణాధిపతయే నమః

# కావ్యమీమాంసా

## ప్రథమోఽధ్యాయః - శాస్త్రసఙ్గ్రహః.

మూ. అథాతః కావ్యం మీమాంసిష్యామహే యథోపదిదేశ శ్రీకణ్ఠః పరమేష్ఠి వైకుణ్ఠాదిభ్యశ్చతుఃషష్టయే శిష్యేభ్యః. సోఽపి భగవాన్ స్వయమ్భూరిచ్ఛాజన్మభ్యః స్వాన్తేవాసిభ్యః. తేషు సారస్వతేయో వృన్దీయసామపి వన్ద్యః కావ్యపురుష ఆసీత్. తం చ సర్వసమయవిదం దివ్యేన చక్షుషా భవిష్యదర్థదర్శినం భూర్భువఃస్వస్త్రితయవర్తినీషు ప్రజాసు హితకామ్యయా ప్రజాపతిః కావ్యవిద్యాప్రవర్తనాయై ప్రాయుఙ్క్త. సోఽష్టాదశాధికరణీం దివ్యేభ్యః కావ్యవిద్యాస్నాతకేభ్యః సప్రపఞ్చం ప్రోవాచ.

## బాలానన్దినీవ్యాఖ్య

శ్లో. నత్వా శ్రీ తాతపాదాద్యాన్ సర్వశాస్త్రార్థసద్గురూన్,
కుర్వేఽహం కావ్యమీమాంసావ్యాఖ్యామాస్త్వాం యథామతి.

శ్రీకంఠుడు బ్రహ్మవిష్ణ్వాదులైన అరవైనలుగురు శిష్యులకు ఉపదేశించిన పద్ధతిలో ఇపుడు కావ్యమును గూర్చిన మీమాంసను చేసెదము. (మీమాంస అనగా పూజనీయమైన విచారము). భగవంతుడగు ఆ బ్రహ్మ కూడ స్వేచ్ఛామాత్రలబ్ధజన్ములైన తన శిష్యులకు ఉపదేశించెను. వీరిలో సరస్వతీపుత్రుడగు కావ్యపురుషుడు ఒకడు. అతడు జగత్పూజ్యులగు ప్రధానదేవతలకు కూడ పూజ్యుడు; సర్వసంప్రదాయములు తెలిసినవాడు; దివ్యదృష్టిచే భవిష్యద్విషయములను కూడ తెలిసికొనకలిగినవాడు. భూర్భువస్స్వర్లోకము లనెడు మూడు లోకములందును నివసించు ప్రజలకు హితము కూర్చవలె ననెడు అభిలాషచే ప్రజాపతి, కావ్యవిద్యాప్రచారమునకై ఆ కావ్యపురుషుని నియమించెను. ఆతడు పద్దెనిమిది అధికరణములలో నున్న ఈ కావ్యవిద్యను కావ్యవిద్యాస్నాతకు లగు దివ్యపురుషులకు సవిస్తరముగ బోధించెను.

వి. రాజశేఖరుడు ఈ గ్రంథమును సూత్రపద్ధతిలో వ్రాయుచున్నాడు. అందుచే "అథాతో ధర్మజిజ్ఞాసా" (జైమినిసూ.) "అథాతో బ్రహ్మజిజ్ఞాసా" (బ్రహ్మసూ.) ఇత్యాదులందు వలె "అథాతః" అను శబ్దములతో ప్రారంభించినాడు. అథ=కావ్యనాటకాదిరచనానంతరము,

ఇది వికటనితంబ యను స్త్రీకవిని ప్రశంసించు శ్లోకము. "వికటనితంబయొక్క వాగ్గుంభనముల రుచి చూచిన తరువాత, మౌగ్ధ్యముచే మధురములైన తమ కాంతల వాక్కులను కూడ నిందింపనివారు ఎవరైన ఉందురా?"

**"శబ్దార్థయోః సమో గుమ్ఫః పాఞ్చాలీరీతిరుచ్యతే,**
**శీలాభట్టారికావాచి బాణోక్తిషు చ సా యది."**

"శబ్దార్థముల సమమైన (అన్యూనానతిరిక్త మైన) కూర్పు పాంచాలీరీతి. అది చూడవలె నన్నచో శీలాభట్టారిక రచనలో చూడవలె; లేదా బాణుని రచనలో చూడవలెను".

**"పార్థస్య మనసి స్థానం లేభే ఖలు సుభద్రయా**
**కవీనాం చ వచోవృత్తిచాతుర్యేణ సుభద్రయా".**

"ఆ సుభద్ర అర్జునుని మనస్సులో స్థానము చేసికొనినది. ఈ సుభద్ర (ఒక స్త్రీకవి) కావ్యరచనాచాతుర్యముచే కవుల మనస్సులో స్థానము చేసికొన్నది".

"సూక్తీనాం స్మరకేలీనాం కలానాం చ విలాసభూః,
ప్రభుదేవీ కవిర్లాటీ గతాపి హృది తిష్ఠతి".

"సూక్తులకును, కామకేళులకును,కళలకును విలాసస్థాన మైన లాటదేశస్త్రీకవియైన ప్రభుదేవి మరణించినను, నా హృదయములోనే ఉన్నది".

**"అహో ప్రభావో వాగ్దేవ్యా యన్మాతఙ్గదివాకరః,**
**శ్రీహర్షస్యాభవత్సభ్యః సమో బాణమయూరయోః".**

"వాగ్దేవి ప్రభావము ఎంత గొప్పది! ఏలననగా అంత్యజాతివాడైన దివాకరుడు కూడ బాణమయూరులతో సమముగ శ్రీహర్షుని ఆస్థానములో సభ్యుడుగ ఉండెను".

**"సరస్వతీపవిత్రాణాం జాతి స్తత్ర న దేహినామ్,**
**వ్యాసస్పర్ధీ కులాలోఽభూత్ యద్ద్రోణో భారతే కవిః".**

"సరస్వతిచే పవిత్రులైన మానవులకు జాతి అనునది లేదు; ఎందుచేతననగా – కుమ్మరియైన ద్రోణకవి భారతరచనవిషయమున వ్యాసునితో పోటీచేయకలిగెను".

ఉత్తమ సాహిత్యవిమర్శకుడుగా, కవిరాజుగా ప్రసిద్ధి పొందిన రాజశేఖరుని, ఆతని సమకాలికులు, తదితరులు కూడ ప్రశంసించినా రన్నచో ఆశ్చర్యము లేదు. రాజశేఖరుని కవిగోష్ఠిలో సదస్యుడును, మృగాంకలేఖాకథారచయితయు అగు అపరాజితుడు ఆతనిని గూర్చి ప్రాకృతములో వ్రాసిన ఒక ప్రశంసాపద్యము కర్పూరమంజరీప్రారంభమున కూర్చబడినది :-





**"బాలకఈ కఇరాఓ ణిబ్భఅ రాఅస్స తహ ఉజజ్ఝాఓ,**
**ఇఇ అస్స పరంపరాఏ అత్తా మాహత్త మారూఢో".**

"మొదట బాలకవియై, తరువాత కవిరాజై, తరువాత నిర్భరరాజుకు ఉపాధ్యాయుడై – ఈ విధముగ రాజశేఖరుడు క్రమక్రమాభివృద్ధి పొందినాడు."

తన కవిగోష్ఠిలో మరియొక సభ్యుడైన కృష్ణశంకరశర్మ తనను గూర్చి చెప్పిన పద్యమును రాజశేఖరుడు విద్ధశాలభంజికాప్రారంభమున చేర్చినాడు :-

**"పాతుం శ్రోత్రరసాయనం రచయితుం వాచః సతాం సమ్మతాః**
**వ్యుత్పత్తిం పరమామవాప్తుమవధిం లబ్ధుం రసస్రోతసః,**
**భోక్తుం స్వాదు ఫలం చ జీవితతరోర్యద్యస్తి తే కౌతుకం**
**తద్ భ్రాతః శృణు రాజశేఖరకవేః సూక్తీః సుధాస్యన్దినీః".**

"శ్రోత్రరసాయనమును పానము చేయుటకును, సత్పురుషులకు సంమతములగు వాక్కులను రచించుటకును, మంచి వ్యుత్పత్తి సంపాదించుకొనుటకును, రసప్రవాహ పరమావధి చేరుటకును, జీవితవృక్షము మధురఫలమును అనుభవించుటకును నీ కేమైన కోరిక ఉన్నచో, ఓ సోదరా ! అమృతము ఒలుకు రాజశేఖరుని సూక్తులను వినుము".

తిలకమంజరి యను గద్యకావ్యమును రచించిన ధనపాలుడు రాజశేఖరుని ఈ విధముగ ప్రశంసించెను :-

**"సమాధిగుణశాలిన్యః ప్రసన్నపరిపక్త్రిమాః,**
**యాయావరకవేర్వాచో మునీనామివ వృత్తయః".**

'యాయావరకవి వాక్కులు, మునుల వృత్తులు వలె, సమాధి యను గుణముతో ప్రకాశించునవి. (ధ్యానముతోడను సద్గుణములతోడను ప్రకాశించునవి అని మునిపక్షమున అర్థము). ప్రసాదగుణము కలవి (నిర్మలమైనవి). ద్రాక్షాపాకాదులతో కూడినవి (పుణ్య పరిపాకమును పొందినవి)."

లాటదేశీయుడైన సోడ్ఢలు డనే ఒక కాయస్థకవి ఉదయసుందరీకథ అనే చంపూకావ్యములో రాజశేఖరుని ప్రశంసించుచు – "పండితసమాజముల మన్ననలు పొందిన రాజశేఖరుని వాక్కులలో సరసపదలక్ష్మి నటి వలె నాట్యమాడినది" అని చెప్పినాడు :-

**"యాయావరః ప్రాజ్ఞవరో గుణజ్ఞైరాశంసితః సూరిసమాజవర్యైః,**
**నృత్యత్యుదారం భణితే రసస్థా నటీవ యస్యోఢరసా పదశ్రీః."**

ఈ విధముగ ఎందరో కవులు రాజశేఖరుని కవితావైదుష్యములను ప్రశంసించి యున్నారు.

**కావ్యమీమాంసా :** ఇది అర్థశాస్త్ర - కామశాస్త్రాదుల వలె సూత్రసదృశము లగు వాక్యములలో వ్రాయబడినది. కావుననే దీని శైలి ఆహ్లాదకరముగను అర్థగంభీరముగను ఉండును. శాస్త్రసంగ్రహ మను మొదటి అధ్యాయమును బట్టి చూడగా రాజశేఖరుడు అతి విస్తృత మైన అలంకారవిజ్ఞానసర్వము వంటి గ్రంథమును రచించుటకు ఉపక్రమించినట్లు తెలియు చున్నది. కాని ఈతడు వ్రాయదలచిన లేదా వ్రాసిన పదునెనిమిది అధికరణములలో కవిరహస్య మను పేరు గల మొదటి అధికరణము మాత్రమే మన కిపుడు లభ్యమగు చున్నది. "మూడు రీతులను గూర్చి ముందు ముందు చెప్పగలము"; 'ఈ విషయమును ఔపనిషదధికరణమున విశదీకరించెదము' - ఈ విధముగ రాజశేఖరుడు వ్రాసిన దానిని బట్టి అతడు ఆ యధికరణములను వ్రాయుటకై ఒక ప్రణాళికను వేసికొనినట్లు తెలియు చున్నది.

కవిరహస్య మను ఈ ప్రథమాధికరణములో పద్దెనిమిది అధ్యాయము లున్నవి. కాని ఈ అధికరణములోని మొదటి మూడు అధ్యాయములను, రాజశేఖరుడు తాను వ్రాయ దలచిన అష్టాదశాధికరణాత్మక మగు మొత్తము కావ్యమీమాంసకు ఉపోద్ఘాతరూపమున వ్రాసినట్లు కనబడుచున్నది. అందుచే 'కవిరహస్యమునకు' సంబంధించిన విషయము నాల్గవ అధ్యాయముతో ప్రారంభమగుచున్నది.

మొదటి అధ్యాయములో సాహిత్యశాస్త్రోత్పత్తి, ఈ శాస్త్రమునకు సంబంధించిన వివిధవిషయములును నిరూపింపబడినవి. రెండవ అధ్యాయములో సాహిత్యశాస్త్ర ప్రాధాన్యము నిరూపింపబడినది. ఇది వేదార్థజ్ఞానమునకు ఉపకరించున దగుటచే ఏడవ వేదాంగము. పదునైదవ విద్యాస్థానము. తృతీయాధ్యాయములో కావ్యపురుషోత్పత్తి, సాహిత్య విద్యతో అతని వివాహము, ఆ యా ప్రాంతములలో నున్న వృత్తి - ప్రవృత్తి - రీత్యాదుల భేదములు కావ్యశైలిలో వర్ణింపబడినవి. ఈ కావ్యపురుష - సాహిత్యవిద్యావృత్తాంతము రాజశేఖరుని అద్భుతప్రతిభకు నిదర్శనము.

ఈ కవిరహస్యములో ప్రధానముగ - (1) కవి కాదలచినవాడు సంపాదించుకొన వలసిన యోగ్యతలు (2) ఆతడు కావ్య నిర్మాణ విషయమున అనుసరింపదగిన నియమ ములు, (3) పరిహరింపదగిన దోషాదులు - ఈ మూడు విషయములును ప్రతిపాదింప బడినవి. 4 - 9 అధ్యాయములలో మొదటి విషయము, 10వ అధ్యాయములో రెండవ విషయము, 11 - 18 అధ్యాయములలో మూడవ విషయము ప్రతిపాదింపబడినవి. పాఠకు లీ విషయములను గ్రంథమునుండియే గ్రహింపగలరను అభిప్రాయముతో ఇచట వివరించుట లేదు.

కావ్యమీమాంసలోని విషయములను తరువాతి ఆలంకారికులు గ్రహించి తమ గ్రంథములలో పొందుపరచిరి. హేమచంద్రుడు ఇందలి విషయములను కావ్యానుశాసన





వివేకములోనికి గ్రహించినాడు. 17,18 అధ్యాయములలోని విషయము యథాతథముగ గ్రహింపబడినది. ఇట్లే నేమికుమారుని కుమారుడగు వాగ్భటుడు, కవిశిక్షలు వ్రాసిన క్షేమేంద్ర - అమర - వినయచంద్ర - దేవేశ్వరాదులు కూడ ఎన్నో విషయములను ఈ గ్రంథమునుండి సంగ్రహించినారు. భోజుడు సరస్వతీకంఠాభరణములో ఉదాహరించిన కొన్ని పద్యములు కావ్యమీమాంసలో మాత్రమే లభ్యమగుచున్నవి. దీనిని బట్టి కావ్యమీమాంసకు గల ప్రసిద్ధి స్పష్టముగ తెలియుచున్నది.

రాజశేఖరుడు కావ్యమీమాంసలో సాహిత్యశాస్త్రమును ఒక నూతనదృక్పథముతో నిరూపించుటయే గాక భారతదేశములోని అనేకప్రాంతములలో నున్న విభిన్న - ఆచార వ్యవహారాదులను, వేషభూషాదులను కూడ చక్కగ వర్ణించి యున్నాడు. ఇతరగ్రంథములలో లభ్యముకాని ఎన్నో మనోహరములగు పద్యములను ఉదాహరించినాడు. ఆనాటి కవితా గోష్ఠుల స్వరూపము, కవులలోని తారతమ్యములు, మొదలగు ఎన్నో విషయములు ఈ గ్రంథము ద్వారా తెలియుచున్నవి. ఏ భాషలో కవిత్వము వ్రాసినను ప్రతి ఒక్క కవియు భావుకుడును తప్పక చదువవలసిన ఉత్తమ గ్రంథము ఈ కావ్యమీమాంస.

దాదాపు 12 సంవత్సరములకు పూర్వము నేను రసగంగాధరముపై థీసిస్ వ్రాయు సందర్భమున ఈ కావ్యమీమాంసాది గ్రంథములను చదువుట జరిగినది. కావ్యమీమాంసను తెలుగులోనికి తీసికొనివచ్చిన బాగుండును అను అభిలాష ఆనాడే కలిగినది. కాని అది ఈనాటికి సఫలమైనది. గ్రంథము వ్రాయుటకంటె కష్టమైన పని తత్ప్రచురణము. దానికి కూడ సాహసించితిని. ఇది ఏ కొందరు సహృదయుల కైనను ఉపకరించినచో శ్రమ సఫల మగును.

మదీయశ్రేయోభిలాషులును. గ్రంథప్రచురణాదికార్యనిర్వహణముచే వివిధరాష్ట్రము లలో నున్న సాహిత్యఅకాడమీలలో ఆంధ్రప్రదేశ్ సాహిత్య అకాడమీకి అందరి మన్ననలు పొందిన అగ్రస్థానమును సంపాదించిన కార్యదక్షులును అగు శ్రీ దేవులపల్లి రామానుజ రావుగారు ఈ సాహిత్యశాస్త్రగ్రంథమును కృతిగా స్వీకరించుటకై అంగీకరించినందులకు వారి కెంతయు కృతజ్ఞుడను. నాగలక్ష్మి ఆర్ట్ ప్రింటర్స్ అధిపతి యగు శ్రీ యన్. చిదంబర రావు గారు అతిశీఘ్రముగ ముద్రణకార్యమును నిర్వహించినందులకు మదీయ కృతజ్ఞతా పాత్రులు.

**డా॥ పుల్లెల శ్రీరామచంద్రుడు**

హైదరాబాదు
27 - 5 - 1979

అతః = వాటి వ్యుత్పత్తికి కావ్యమీమాంస ఆవశ్యకము గాన ఇత్యాదివిధమున అర్థము చెప్పుకొనవలెను. 'అథ' అనునది శ్రవణమాత్రముచేతనే మంగళప్రదముగాన మంగళాచరణము కూడ జరిగినది.

"ఓంకారశ్చాథశబ్దశ్చ ద్వావేతౌ బ్రహ్మణః పురా
కణ్ఠం భిత్త్వా వినిర్యాతౌ తస్మాన్మాఙ్గలికావుభౌ".

అను వాక్య మిచట ప్రమాణము.

మూ. తత్ర కవిరహస్యం సహస్రాక్షః సమామ్నాసీత్; ఔక్తిక ముక్తిగర్భః; రీతి నిర్ణయం సువర్ణనాభః; ఆనుప్రాసికం ప్రచేతాః; యమో యమకాని; చిత్రం చిత్రాఙ్గదః; శబ్దశ్లేషం శేషః; వాస్తవం పులస్త్యః; ఔపమ్యమౌపకాయనః; అతిశయం పారాశరః; అర్థశ్లేషముతథ్యః; ఉభయాలఙ్కారికం కుబేరః; వైనోదికం కామదేవః; రూపక నిరూపణీయం భరతః; రసాధికారికం నన్దికేశ్వరః; దోషాధికరణం ధిషణః; గుణౌపాదానికముపమన్యుః; ఔపనిషదికం కుచమారః – ఇతి. తతస్తే పృథక్ పృథక్ స్వశాస్త్రాణి విరచయాఞ్చక్రుః.

వ్యా. సహస్రాక్షుడు కవిరహస్య మనెడు అధికరణమును రచించెను. ఉక్తిగర్భుడు (ఉక్తులకు సంబంధించిన అనగా శబ్దరచనకు సంబంధించిన) ఔక్తికాధికరణమును రచించెను. ఇట్లే సువర్ణనాభుడు రీతినిర్ణయమును, ప్రచేతసుడు ఆనుప్రాసికమును, యముడు యమకములను, చిత్రాంగదుడు చిత్రమును, శేషుడు శబ్దశ్లేషమును, పులస్త్యుడు వాస్తవమును, ఔపకాయనుడు ఔపమ్యమును, పారాశరుడు అతిశయమును, ఉతథ్యుడు అర్థశ్లేషమును, కుబేరుడు ఉభయాలంకారికమును, కామదేవుడు వైనోదికమును, భరతుడు రూపకనిరూపణీయకమును, నందికేశ్వరుడు రసాధికారికమును, బృహస్పతి దోషాధికరణమును, ఉపమన్యువు గుణౌపాదానికమును, కుచమారుడు ఔపనిషదికమును (ఇది కావ్యతత్త్వవిచారమై లేదా మంత్రోపాసనాదికమై యుండును) రచించిరి. అటు పిమ్మట వారందరును తమ తమ శాస్త్రములను కూడ వేరు వేరుగ రచించిరి.

మూ. ఇత్థఙ్కారం చ ప్రకీర్ణత్వాత్ సా కిఞ్చిదుచ్చిచ్ఛిదే. ఇతీయం ప్రయోజకాఙ్క్షవతీ సఙ్క్షిప్య సర్వమర్థ మల్పగ్రన్థేన అష్టాదశాధికరణీ ప్రణీతా.

వ్యా. ఈ విధముగ ప్రకీర్ణముగ ఉండుటచే, అనగా వేరు వేరు రచయితలు వేరు వేరు విధములలో రచింపగా భిన్న భిన్నముగ ఉండుటచే, ఆ కావ్యవిద్య కొంచెము ఉచ్ఛిన్నమైపోయినది. కావున ఆవశ్యకము లగు అంగములతో గూడిన అష్టాదశాధికరణాత్మకమగు ఈ కావ్యవిద్యలో ఉన్న విషయముల నన్నింటిని సంక్షిప్తముగ ప్రతిపాదించుచు ఈ గ్రంథమును రచించినాను.



మూ. తస్యా అయం ప్రకరణాధికరణసముద్దేశః, శాస్త్రసఙ్గ్రహః, శాస్త్రనిర్దేశః కావ్యపురుషోత్పత్తిః, పదవాక్యవివేకః, పాఠప్రతిష్ఠా, అర్థానుశాసనం, వాక్యవిధయః, కవివిశేషః, కవిచర్యా, రాజచర్యా, కాకుప్రకారాః, శబ్దార్థహరణోపాయాః, కవి సమయః, దేశకాలవిభాగః, భువనకోశః ఇతి కవిరహస్యం ప్రథమమధికరణమిత్యాది.

వ్యా. ఆ కావ్యవిద్యకు సంబంధించిన వివిధప్రకరణసహితము లగు అధికరణముల సముద్దేశము ఈ క్రింది విధముగ ఉండును. (ప్రతిపాదింప నున్న విషయముల పేర్లు మాత్రము చెప్పుటకు 'సముద్దేశము' అని పేరు). ప్రథమాధికరణ మైన కవిరహస్యములో – శాస్త్రసంగ్రహము, శాస్త్రనిర్దేశము, కావ్యపురుషోత్పత్తి, పదవాక్యవివేకము, పాఠప్రతిష్ఠ, అర్థానుశాసనము, వాక్యవిధులు, కవివిశేషము, కవిచర్య, రాజచర్య, కాకుస్వరపద్ధతులు, శబ్దార్థములను కూర్చుటకు ఉపాయములు, కవిసమయము, దేశకాలవిభాగము, భువన కోశము అను ప్రకరణము లుండును.

వి. కవిరహస్యమున 18 ప్రకరణము లుండగా, రాజశేఖరుడు 15 మాత్రమే పేర్కొనినాడు. క్రమము కూడ మార్చి చెప్పినాడు. దీనిని బట్టి మొదట ఆతడు అనుకొనిన పద్ధతిలో కాక వేరే విధమున ఇందలి ప్రకరణక్రమాదులు నడచినట్లు కనబడుచున్నది.

శ్లో॥ ఇతి సూత్రాణ్యథైతేషాం వ్యాఖ్యా భాష్యం భవిష్యతి,
సమాసవ్యాసవిన్యాసః సైష శిష్య హితాయ నః. 1

వ్యా. "ఈ విధముగ విషయసూచకము లగు సూత్రములు చెప్పబడినవి. వీటి విస్తృతవ్యాఖ్యానము మున్ముందు చేయబడును. ఈ రీతిగ సంక్షిప్తరూపముననను (సమాస) విస్తృతరూపముననను (వ్యాస) విషయప్రతిపాదనము శిష్యుల హితముకొరకై చేయబడుచున్నది".

శ్లో॥ చిత్రోదాహరణైర్గుర్వీ గ్రన్థేన తు లఘీయసీ,
ఇయం నః కావ్యమీమాంసా కావ్యవ్యుత్పత్తికారణమ్. 2

వ్యా. "గ్రంథరూపమున లఘువే యైనను, చిత్రము లగు ఉదాహరణములతో గురువైన ఈ మా 'కావ్యమీమాంస' కావ్యములకు సంబంధించిన పరినిష్ఠిత జ్ఞానమును కలిగించును".

శ్లో॥ ఇయం సా కావ్యమీమాంసా మీమాంసా యత్ర వాగ్లవః,
వాగ్లవం న స జానాతి న విజానాతి య స్త్విమామ్. 3

"దేనియందు ఇతరమీమాంస అంతయు వాక్కుయొక్క ఒకలేశ మాత్రముగ కన్పట్టునో అట్టి కావ్యమీమాంస ఇదియే. ఈ కావ్యమీమాంసను తెలిసికొననివాడు వాక్కుయొక్క లేశమును కూడ తెలిసికొనజాలడు."

శ్లో॥ యాయావరీయః సంక్షిప్య మునీనాం మతవిస్తరమ్,
వ్యాకరోత్కావ్యమీమాంసాం కవిభ్యో రాజశేఖరః. 4

ఇతి రాజశేఖరకృతౌ కావ్యమీమాంసాయాం కవిరహస్యే
ప్రథమేఽధికరణే ప్రథమోఽధ్యాయః శాస్త్రసఙ్గ్రహః.

వ్యా. "యాయావరీయు డగు రాజశేఖరుడు అతివిస్తృతము లగు మునుల మతములను సంగ్రహించి, కవుల ఉపయోగముకొరకై కావ్యమీమాంసను రచించెను".

(విశేషాంశములు) వైఖానస ధర్మప్రశ్నము ప్రకారము, గృహస్థులు వార్తావృత్తి, శాలీనవృత్తి, యాయావరుడు, ఘోరాచారికుడు అని నాలుగు విధములు. హవిర్యజ్ఞసోమ యజ్ఞాదులను తాను చేయుచు, ఇతరులచే చేయించుచు, యజన - యాజన - అధ్యయన - అధ్యాపన - దాన - ప్రతిగ్రహరూపము లగు షట్కర్మలను ఆచరించుచు, నిత్యము అగ్నిపరిచర్య చేయుచు, అతిథ్యభ్యాగతాదులకు అన్నాదులను ఇచ్చుచుండు గృహస్థుడు యాయావరుడు. "యాయావరో హవిర్యజ్ఞైః సోమయజ్ఞైశ్చ యజతే యాజయత్యధీతేఽధ్యాపయతి, దదాతి, ప్రతిగృహ్ణాతి, షట్కర్మనిరతో నిత్యమగ్నిపరిచరణ మతిథిభ్యోఽభ్యాగతేభ్యోఽన్నాద్యం చ కురుతే" (వైఖానసధర్మప్రశ్నము 1.5.4). రాజశేఖరుని పూర్వికులు ఇట్టి యాయావరులై యుందురు.

బాలానందినిలో ప్రథమాధ్యాయము సమాప్తము.

## ద్వితీయోఽధ్యాయః - శాస్త్రనిర్దేశః

మూ. ఇహ హి వాఙ్మయముభయథా - శాస్త్రం, కావ్యం చ. శాస్త్రపూర్వకత్వాత్ కావ్యానాం పూర్వం శాస్త్రేష్వభినివిశేత. న హ్యప్రవర్తితప్రదీపాస్తే తత్త్వార్థసార్థమధ్యక్షయన్తి.

వ్యా. శాస్త్రమనియు, కావ్య మనియు వాఙ్మయము రెండు విధములు, కావ్యములు శాస్త్రపూర్వకములు గాన ముందుగా శాస్త్రముల విషయమున శ్రద్ధ చూపవలెను. (అనగా శాస్త్రజ్ఞానము లేనిచో కావ్యజ్ఞానము కలుగదు గాన ముందుగా శాస్త్రాభ్యాసము చేయవలెను) దీపము వెలిగించుకొనకుండా పదార్థములను చూడ జాలరు కదా?

మూ. తచ్చ ద్విధా - అపౌరుషేయం పౌరుషేయం చ. అపౌరుషేయం శ్రుతిః సా చ మన్త్రబ్రాహ్మణే. వివృతక్రియాతన్త్రా మన్త్రాః. మన్త్రాణాం స్తుతినిన్దావ్యాఖ్యానవినియోగగ్రన్థో బ్రాహ్మణమ్.



వ్యా. ఆ శాస్త్రము కూడ అపౌరుషేయము (పురుషనిర్మితము కానిది) పౌరుషేయము అని రెండు విధములు. అపౌరుషేయశాస్త్రము వేదము. అది మంత్రబ్రాహ్మణాత్మకము. యజ్ఞాదిక్రియాకలాపమును వివరించునవి (యజ్ఞాద్యనుష్ఠానముతో ప్రత్యక్షముగ సంబంధించునవి) మంత్రములు, ఆయా విషయముల స్తుతినిందాదుల ద్వారా మంత్రార్థములను వివరించుచు, వాటిని యజ్ఞాదులలో ఏ విధముగ వినియోగించవలెనో బోధించునవి బ్రాహ్మణములు.

మూ. ఋగ్యజుఃసామవేదాస్త్రయీ. అథర్వణశ్చ తురీయః. తత్రార్థవ్యవస్థితపాదా ఋచః తాః సగీతయః సామాని. అచ్ఛన్దాంస్యగీతాని యజూంషి. ఋచో, యజూంషి, సామాని చాథర్వణం త ఇమే చత్వారో వేదాః.

వ్యా. ఋగ్యజుఃసామవేదములకు 'త్రయి' (మూడింటి సముదాయము) అని పేరు. అథర్వణము నాల్గవది. అర్థానుసారముగా నిర్ణీతమైన పాదములు కలవి ఋక్కులు. గానముతో కూడిన ఆ ఋక్కులే సామములు. చందస్సు కాని, గానము కాని లేనివి యజుస్సులు. ఋక్కులు, యజుస్సులు, సామములు, అథర్వణములు - ఈ నాల్గును నాలుగు వేదములు.

మూ. ఇతిహాసధనుర్వేదౌ గాన్ధర్వాయుర్వేదావపి చోపవేదాః. "వేదోపవేదాత్మా సార్వవర్ణికః పఞ్చమో గేయవేదః" ఇతి ద్రౌహిణిః.

వ్యా. ఇతిహాసవేదము, ధనుర్వేదము, గాంధర్వవేదము, ఆయుర్వేదము, ఉపవేదములు, వేదోపవేదరూపము, అన్ని వర్ణములవారికిని ఉపయోగించునదియు అగు గానవేదము పంచమవేద మని ద్రౌహిణి చెప్పియున్నాడు.

వి. గానవేద మనగా గాంధర్వవేదము. ఇది సామవేదముతో సంబంధించినది గాన వేదము; పైన చెప్పినట్లు ఉపవేదము కూడ. దీనిని పంచమవేదముగ గ్రహింపవలెనని అభిప్రాయము.

మూ. "శిక్షా, కల్పో, వ్యాకరణం, నిరుక్తం, ఛన్దోవిచితిః, జ్యోతిషం చ షడఙ్గాని" ఇత్యాచార్యాః. "ఉపకారకత్వాదలఙ్కారః సప్తమమఙ్గమ్" ఇతి యాయావరీయః.

వ్యా. శిక్ష, కల్పము, వ్యాకరణము, నిరుక్తము, ఛందోవిచితి, జ్యోతిషము అనునవి ఆరు అంగములు అని ఆచార్యులు చెప్పియున్నారు. ఉపకారకము గాన, అనగా వేదార్థజ్ఞానము నకు ఉపకరించునది గాన అలంకారశాస్త్రము ఏడవ అంగము అని యాయావరీయుని అభిప్రాయము.

మూ. ఋతే చ తత్స్వరూపపరిజ్ఞానాద్వేదార్థానవగతిః. యథా :-

"ద్వా సుపర్ణా సయుజా సఖాయా సమానం వృక్షం పరిషస్వజాతే,
తయోరన్యః పిప్పలం స్వాద్వత్తి అనశ్న న్నన్యో అభిచాకశీతి". 1

వ్యా. అలంకారశాస్త్రస్వరూపము తెలియనిచో వేదార్థజ్ఞానము కలుగదు. ఉదా :-

"మంచి రెక్కలు కలవి, కలిసి ఉండునవి, మైత్రితో కూడినవి అగు రెండు పక్షులు ఒకే వృక్షమును ఆశ్రయించి యున్నవి. వాటిలో ఒకటి మధురమైన ఫలమును (కర్మ ఫలమును) భుజించుచున్నది. రెండవది తినకుండగ చూచుచున్నది.

వి. ఈ మంత్రము, రూపకవ్యతిరేకాలంకారములను ఉపయోగించి, జీవాత్మ పరమాత్మలు ఒకే దేహమును ఆశ్రయించి యున్న వనియు, వారిలో జీవాత్మ కర్మఫలమును అనుభవించుచుండగా, పరమాత్మ మాత్రము కర్మఫలభోగవిహీనుడై చూచుచున్నా డనియు బోధించుచున్నది. ఈ విధముగ రూపకోపమాదులతో నిండిన వేదముల అర్థము స్పష్టముగ తెలియవలె నన్నచో అలంకారశాస్త్రజ్ఞానము ఆవశ్యక మని అభిప్రాయము.

మూ. సేయం శాస్త్రోక్తిః. ప్రత్యధికరణం చ ఋచం బ్రాహ్మణం యజుః సామా థర్వణం చోదాహృత్య భాషా ముదాహరిష్యామః.

వ్యా. ఇది శాస్త్రోక్తి; అనగా శాస్త్రములను గూర్చిన విషయము. ప్రతి అధికరణము నందును (అపౌరుషేయ శాస్త్రములగు) ఋగ్యజుఃసామాథర్వములను ఉదాహరించి భాషను అనగా పౌరుషేయశాస్త్రములను ఉదాహరించెదము.

మూ. తత్ర వర్ణానాం స్థాన - కరణ - ప్రయత్నాదిభిః నిష్పత్తినిర్ణయినీ శిక్షా ఆపిశలీయాదికా.

వ్యా. కంఠతాల్వాది స్థానములు, కరణములు (ఆభ్యంతరప్రయత్నములు), బాహ్య ప్రయత్నములు మొదలగువాటి ద్వారా వర్ణములు ఏ విధముగ ఉత్పన్నమగునో నిర్ణయించి చెప్పునది ఆపిశలీయాది శిక్ష.

వి. పాణిని, ఆపిశలి, యాజ్ఞవల్క్యుడు మొదలగువారు రచించిన శిక్షలు అనేకములు ఉన్నవి. వర్ణములను ఏ విధముగ ఉచ్చరింపవలెను అను విషయములను ఇవి ప్రతిపాదించును. ఉదాహరణకు - క కారమునకు స్థానము కంఠము. కరణము, అనగా - అభ్యంతర ప్రయత్నము, స్పృష్టప్రయత్నము. బాహ్యప్రయత్నములు శ్వాస - అఘోష - వివార - అల్పప్రాణములు. ఈ విధముగ శిక్షాగ్రంథములలో వర్ణోచ్చారణాదులకు సంబంధించిన అనేకవిషయము లున్నవి.



మూ. నానాశాఖాధీతానాం మన్త్రాణాం వినియోజకం సూత్రం కల్పః. స చ యజుర్విద్యా.

వ్యా. వివిధశాఖలలోని మంత్రములను ఏయే కర్మలలో ఏయే విధముగా ఉపయోగింప వలెనో బోధించు సూత్రము కల్పసూత్రము. (ఒక్కొక్క వేదశాఖకు ఒక్కొక్క కల్పసూత్రము ఉండును. ఇవి కాత్యాయనాద్యనేకఋషినిర్మితములు). ఇది యజుర్విద్య. అనగా యజ్ఞాది కర్మానుష్ఠానమునకు సంబంధించిన విద్య.

మూ. శబ్దానామన్వాఖ్యానం వ్యాకరణమ్.

వ్యా. ప్రయోగములో ఉన్న శబ్దముల స్వరూపమును నిరూపించునది వ్యాకరణము.

వి. శాకటాయన - పాణిన్యాదులు రచించిన వ్యాకరణగ్రంథములు ప్రకృతిప్రత్యయ విభాగమును చూపి వివిధశబ్దముల వ్యుత్పత్తిని బోధించును. 'వ్యాకరణము' అనగా పదములో, ఇది ప్రకృతి, ఇది ప్రత్యయము అని విడదీసి చూపించుట.

మూ. నిర్వచనం నిరుక్తమ్. ఛన్దసాం ప్రతిపాదయిత్రీ ఛందోవిచితిః. గ్రహ గణితం జ్యోతిషమ్. అలఙ్కారవ్యాఖ్యానం తు పురస్తాత్.

వ్యా. నిరుక్త మనగా నిర్వచనము. (అనగా ఒక పదమునకు ఆ అర్థమును చెప్పుటకు కారణ మేమి అను విషయమును బోధించునది నిరుక్తము. ప్రస్తుతము యాస్కరచిత మగు నిరుక్తము ప్రచారములో ఉన్నది.) (అనుష్టుప్, త్రిష్టుప్ మొదలైన) ఛందస్సుల లక్షణ స్వరూపాదులను బోధించునది ఛందోవిచితి. గ్రహములకు సంబంధించిన గణితము జ్యోతిషము. (జ్యోతిఃస్వరూపము లైన గ్రహముల గమనము ననుసరించి కాలాదుల నిర్ణయము చేయు శాస్త్రము గాన దీనికి జ్యోతిఃశాస్త్రమని పేరు). అలంకారశాస్త్రస్వరూపము మున్ముందు చెప్పగలము. (కావ్యమీమాంసలోని అలంకార ప్రతిపాదకాధికరణము లభ్యము కాదు).

మూ. పౌరుషేయం తు:- పురాణమ్, ఆన్వీక్షకీ, మీమాంసా, స్మృతితన్త్రమితి చత్వారి శాస్త్రాణి.

వ్యా. పురాణము, ఆన్వీక్షకి, మీమాంస, స్మృతితంత్రము (ధర్మశాస్త్రగ్రంథములు) అనునవి పౌరుషేయశాస్త్రములు.

మూ. తత్ర వేదాఖ్యానోపనిబన్ధనప్రాయం పురాణమష్టాదశధా; యదాహుః:-

శ్లో॥ "సర్గః ప్రతిసంహారః కల్పో మన్వన్తరాణి వంశవిధిః,
జగతో యత్ర నిబద్ధం తద్విజ్ఞేయం పురాణమితి." 2

వ్యా. చాలవరకు వేదములలోని ఉపాఖ్యానములను కూర్చుటకు ఉద్దిష్టమైన పురాణము పద్దెనిమిది విధములు. పురాణలక్షణమును ఈ విధముగ చెప్పియున్నారు:- "జగత్తుయొక్క సృష్టి, సంహారము, శ్వేతవరాహకల్పాదికల్పములు, మన్వంతరములు, వివిధ రాజవంశవర్ణనము ఏ గ్రంథమునందు చేయబడునో అది పురాణమని గ్రహింపవలెను".

వి. కొన్నిచోట్ల-

**"సర్గశ్చ ప్రతిసర్గశ్చ వంశో మన్వన్తరాణి చ,**
**వంశానుచరితం చేతి పురాణం పఞ్చలక్షణమ్"**

అను శ్లోక మున్నది. దానిలో 'సర్గః' అనుదానికి పంచమహా భూతాది మూలపదార్థసృష్టి యనియు, 'ప్రతిసర్గః' అనుదానికి మనుష్యవృక్షాదిసృష్టిరూప మగు అవాంతరసృష్టి యనియు అర్థము చెప్పుదురు. కొందరు ప్రలయ మని అర్థము చెప్పుదురు.

మూ. "పురాణప్రవిభేద ఏవేతిహాసః" ఇత్యేకే. స చ ద్విధా.- పరక్రియా పురాకల్పాభ్యామ్. యదాహుః -

శ్లో॥ **"పరక్రియా పురాకల్ప ఇతిహాసగతిర్ద్విధా,**
**స్యాదేకనాయకా పూర్వా ద్వితీయా బహునాయకా".** 3

మూ. తత్ర రామాయణం భారతం చోదాహరణే.

వ్యా. ఇతిహాసము కూడ పురాణములలో ఒక భేదమే అని కొందరు చెప్పుదురు. 'పరక్రియ' 'పురాకల్పము' అని అది రెండు విధములు. కావుననే ఈ విధముగ చెప్పబడినది:- పరక్రియయనియు, పురాకల్పమనియు ఇతిహాసముల పద్ధతి రెండు విధములు. ఒక్క నాయకుడు మాత్రము ఉన్నది మొదటిది (పరక్రియ). బహునాయకులు కలది రెండవది (పురాకల్పము). వీటికి వరుసగ రామాయణభారతములు ఉదాహరణములు.

మూ. ఆన్వీక్షకీం తు విద్యావసరే వక్ష్యామః.

వ్యా. ఆన్వీక్షికిని గూర్చి విద్యాస్వరూపము చెప్పునపుడు వివరించెదము.

మూ. నిగమవాక్యానాం న్యాయైః సహస్రేణ వివేక్త్రీ మీమాంసా. సా చ ద్వివిధా - విధివివేచనీ బ్రహ్మనిదర్శనీ చ.

వ్యా. సహస్రన్యాయములతో వేదవాక్యముల అర్థమును వివరించునది మీమాంసాశాస్త్రము. విధివాక్యములను గూర్చి వివేచనము చేయు పూర్వమీమాంస యనియు, బ్రహ్మను గూర్చి వివేచనము చేయు ఉత్తరమీమాంస యనియు అది రెండు విధములు.



వి. వేదవాక్యములకు అర్థనిర్ణయ మెట్లు చేయవలెనో తెలుపుచు మీమాంసాశాస్త్రమున కొన్ని నియమములు ఏర్పరుపబడినవి. దానిలో దాదాపు వేయి అధికరణములు ఉన్నవి. ఒక్కొక్క అధికరణము ఒక్కొక్క న్యాయమును, అనగా విషయమును, ప్రతిపాదించును. ఆ న్యాయమును వినియోగించుచు వేదవాక్యముల అర్థనిర్ణయము చేయవలెను. అందు కర్మ కాండను బోధించు వేదభాగమునకు సంబంధించిన మీమాంసకు పూర్వమీమాంస అనియు, జ్ఞానప్రతిపాదికమగు ఉపనిషద్భాగమునకు సంబంధించిన భాగమునకు ఉత్తరమీమాంస అనియు పేర్లు.

మూ. అష్టాదశైవ శ్రుత్యర్థస్మరణాత్ స్మృతయః. తానీమాని చతుర్దశ విద్యాస్థానాని, యదుత వేదాశ్చత్వారః, షడఙ్గాని, చత్వారి శాస్త్రాణి" ఇత్యాచార్యాః.

వ్యా. వేదముల అర్థమును స్మరించుచు వ్రాసినవి స్మృతులు. అవి కూడ పదునెనిమిది మాత్రమే. "నాలుగు వేదములు, ఆరు వేదాంగములు, నాలుగు శాస్త్రములు - ఇవన్నియు కలిసి చతుర్దశవిద్యాస్థానములు" అని ఆచార్యులు చెప్పుదురు.

శ్లో॥ **పురాణన్యాయమీమాంసా ధర్మశాస్త్రాఙ్గమిశ్రితాః**
**వేదాః స్థానాని విద్యానాం ధర్మస్య చ చతుర్దశ."**

మూ. తాన్యేతాని కృత్స్నాని భూర్భువఃస్వస్త్రయీం వ్యాసజ్య వర్తన్తే. తదాహుః-

శ్లో॥ **"విద్యాస్థానానాం గన్తుమన్తం న శక్తో**
**జీవేద్వర్షాణాం యోఽపి సాగ్రం సహస్రమ్,**
**తస్మాత్సంక్షేపాదర్థసన్దోహ ఉక్తో**
**వ్యాసః సంత్యక్తో గ్రన్థభీరుప్రియార్థమ్".** 4

వ్యా. ఈ పదునాలుగు విద్యాస్థానములు భూలోక - భువర్లోక - స్వర్లోకము లనెడు మూడు లోకములందును వ్యాపించి ఉన్నవి. (అనగా ఈ మూడు లోకములకును సంబంధించిన విషయములు వీటిలో ఉన్నవి). కావుననే ఇట్లు చెప్పి యున్నారు. "వేయి సంవత్సరముల పాటు జీవించ కలిగిన వాడు కూడ విద్యాస్థానముల అంతమును చూడ జాలడు. అనగా సంపూర్ణముగా తెలిసికొనజాలడు. అందువలన విషయముల నన్నింటిని సంక్షేపముగ ప్రతిపాదించి ఉన్నాము. గ్రంథగౌరవమును చూచి భయపడువారు సంతోషించుటకు విస్తృతవివరణమును విడిచిపెట్టినాము".

మూ. "సకలవిద్యాస్థానైకాయతనం పఞ్చదశం కావ్యం విద్యాస్థానమ్" ఇతి యాయావరీయః. గద్యపద్యమయత్వాత్, కవిధర్మత్వాత్, హితోపదేశకత్వాచ్చ తద్ధి శాస్త్రాణ్యనుధావతి.

వ్యా. సమస్త విద్యాస్థానములకును ఏకైకస్థానమైన (అనగా సకలవిద్యలకును ప్రధానాధారమైన) కావ్యము పదిహేనవ విద్యాస్థాన మని యాయావరీయుడ నైన నేను చెప్పుచున్నాను. కావ్యము గద్యపద్యమయము. కవిధర్మము (కర్మ); హితమును ఉపదేశించునది. అందుచే అది శాస్త్రముల నన్నింటిని అనుసరించి నడచుచుండును.

మూ. "వార్తా, కామసూత్రం, శిల్పశాస్త్రం, దణ్డనీతిరితి పూర్వైః సహాష్టాదశ విద్యాస్థానాని" ఇత్యపరే.

వ్యా. "వెనుక చెప్పిన చతుర్దశవిద్యాస్థానములతో వార్త, కామసూత్రము, దండనీతి అనువాటిని కూడ చేర్చగా అష్టాదశవిద్యాస్థానములు" అని కొందరు చెప్పుదురు.

మూ. ఆన్వీక్షకీ, త్రయీ, వార్తా, దణ్డనీతిశ్చేతి విద్యాః. 'దణ్డనీతిరేవైకా విద్యా' ఇత్యౌశనసాః. దణ్డభయార్ద్ధి కృత్స్నో లోకః స్వేషు స్వేషు కర్మస్వవతిష్ఠతే. "వార్తా దణ్డనీతిర్ద్వే విద్యే" ఇతి బార్హస్పత్యాః. వృత్తిర్వినయగ్రహణం చ స్థితిహేతుర్లోకయాత్రాయాః. త్రయీ - వార్తా - దణ్డనీతయస్తిస్రో విద్యాః" ఇతి మానవాః. త్రయీ హి వార్తాదణ్డనీత్యోరుపదేష్ట్రీ, "ఆన్వీక్షకీ-త్రయీ-వార్తా-దణ్డనీతయశ్చతస్రో విద్యాః" ఇతి కౌటిల్యః. ఆన్వీక్షక్యా హి వివేచితా త్రయీ వార్తాదణ్డనీత్యోః ప్రభవతి.

వ్యా. ఆన్వీక్షకి (న్యాయశాస్త్రాదికము), వేదత్రయము, వార్త (వాణిజ్యపాశుపాల్యాదికము), దండనీతి అనునవి విద్యలు. "విద్య అనగా దండనీతి ఒక్కటియే" అని శుక్రాచార్యమతానుయాయులు చెప్పుదురు. సమస్తజనులును దండభయమువలననే కదా తమ తమ కర్తవ్యములను చేయుచున్నారు? "వార్త, దండనీతి అనునవి రెండును విద్యలు" అని బృహస్పతిమతానుయాయులు చెప్పుదురు. (వార్తవలన కలుగు) ఆ యా వృత్తులకు సంబంధించిన జ్ఞానముచేతను,(దండనీతివలన కలుగు) వినయగ్రహణముచేతను, అనగా నియమబద్ధజీవనవిధానమును అలవరచుకొనుటచేతను, లోకయాత్ర నడుచుచున్నది. "వేదత్రయము, వార్త, దండనీతి అనునవి మూడు విద్యలు" అని మనుమతానుయాయులు చెప్పుచున్నారు. వార్తాదండనీతులను ఉపదేశించునది వేదత్రయమే కదా? "ఆన్వీక్షకి, త్రయి, వార్త, దండనీతి అను నాలుగు విద్యలని కౌటిల్యుని అభిప్రాయము. ఆన్వీక్షికిచే బాగుగ వివేచనము చేసిన వేదత్రయమే వార్తాదండనీతులను ఉపదేశింప సమర్థ మగును కదా?

మూ. "పఞ్చమీ సాహిత్యవిద్యా" ఇతి యాయావరీయః. సా హి చతసృణామపి విద్యానాం నిష్యన్దః. ఆభిర్ధర్మార్థౌ యద్విద్యాత్తద్విద్యానాం విద్యాత్వమ్.

వ్యా. "సాహిత్యవిద్య, ఐదవ విద్య" యని యాయావరీయుని అభిప్రాయము. ఇది నాలుగు విద్యల సారము కదా? వీటి సహాయముతో ధర్మార్థములను తెలిసికొందురు



లేదా సంపాదింతురు; అందువలన వీటికి "వేద్యేతే ధర్మార్థౌ ఆభిరితి విద్యాః" అను విగ్రహముచే విద్యలు అని పేరు.

మూ. తత్ర త్రయీ వ్యాఖ్యాతా. ద్విధా చాన్వీక్షికీ పూర్వోత్తరపక్షాభ్యామ్. అర్హద్భదన్తదర్శనే లోకాయతం చ పూర్వః పక్షః. సాఙ్ఖ్యం న్యాయవైశేషికౌ చోత్తరః. త ఇమే షట్ తర్కాః. తత్ర చ తిస్రః కథా భవన్తి - వాదో జల్పో, వితణ్డా చ.

వ్యా. వీటిలో 'త్రయి' అనుదాని అర్థము వెనుక వివరించబడినది. పూర్వపక్ష మనియు, ఉత్తరపక్ష మనియు ఆన్వీక్షకి రెండు విధములు. జైన - బౌద్ధ - లోకాయత దర్శనములు పూర్వపక్షము. సాంఖ్య - న్యాయ - వైశేషిక దర్శనములు, ఉత్తరపక్షము. ఈ ఆరును తర్కములు. వీటిలో వాదము, జల్పము, వితండ అను మూడు విధము లగు కథలు (వాగ్వాదపద్ధతులు) ఉండును.

మూ. మధ్యస్థయో స్తత్త్వావబోధాయ వస్తుతత్త్వపరామర్శో వాదః. విజిగీషోః స్వపక్షసిద్ధయే ఛల - జాతి - నిగ్రహాది - పరిగ్రహో జల్పః. స్వపక్షస్యాపరిగ్రహీత్రీ, పరపక్షస్య దూషయిత్రీ వితణ్డా.

వ్యా. తత్త్వమును తెలుసుకొనుటకై, మధ్యస్థులు, (అనగా ముందుగానే ఏదో ఒక నిర్ణయమునకు వచ్చి ఒక పక్షమును స్వీకరించినవారు) చేయు వస్తుతత్త్వవిమర్శము వాదము. ప్రతివాదిని జయింపవలె నని అభిలషించువాడు, తన పక్షమును ఏదియో విధముగ స్థాపించుటకై ఛలము, జాతి, నిగ్రహస్థానము మొదలగువాటిని స్వీకరించి వాదించుట జల్పము. స్వపక్షమును స్థాపించుటకై ప్రయత్నించక, పరపక్షదూషణము మాత్రమే చేయు కథ వితండ.

వి. ఛల-జాత్యాదులను గూర్చి న్యాయశాస్త్రమున అతివిపుల మగు చర్చ చేయబడినది. వాది ఒక అర్థమున ప్రయోగించిన మాటకు మరొక అర్థము కల్పించి ఆతనిని ఆక్షేపించుట ఛలము. ఉదా : "నవకమ్బలోఽయం బాలః" "ఈ బాలుని దగ్గర క్రొత్త కంబళీ ఉన్నది" అని వాది చెప్పినపుడు 'నవ' అను దానికి తొమ్మిది అను అర్థము గ్రహించి, "ఏవీ! ఇతని దగ్గర ఒక్క కంబళీయే ఉన్నది కదా" అని ఆక్షేపించవచ్చును. Doctors should serve the weak' అని ఎవరైన అన్నప్పుడు, "Why! they always serve the weak only" అని అన్నచో ఛల మగును. ఇట్టి పద్ధతులు స్వపక్షీకులు అధికసంఖ్యలో ఉన్నచోట మాత్రమే ఉపయోగించును.

వాది ఒక విషయమును స్థాపించుటకై కొన్ని యుక్తులు చూపును. ప్రతివాది కొన్ని ప్రతియుక్తులు చూపి వాటి నాక్షేపించును. అప్పుడు వాది సరియైన యుక్తి తోచక సామ్యమును బట్టి కాని, వైషమ్యమును బట్టి కాని ఏవో యుక్తులను చూపి ప్రదివాదియుక్తులను ఖండించుటకు ప్రయత్నించును. అది జాతి. ఉదా :- "ఆత్మ అనిత్యము" అని వాది చెప్పగా ప్రతివాది "ఆకాశమువలె సర్వవ్యాపి గాన ఆత్మ నిత్యము" అని చెప్పును. అపుడు మొదటివాడు

– "సర్వవ్యాపిత్వ మనెడు ఆకాశసామ్యమును బట్టి నీవు ఆత్మ నిత్య మనుచున్నావు. కాని చైతన్యరూపత్వ మనెడు వైషమ్యమును బట్టి, (అనగా ఆత్మ చైతన్యవంతము, ఆకాశము కాదు అనెడు తేడాను బట్టి) ఆత్మ అనిత్యమే అని నేనందును"అని పలుకును. ఇట్టి దూషణా భాసమే జాతి.

విప్రతిపత్తి, అప్రతిపత్తి అని నిగ్రహస్థానము రెండు విధములు. విషయమును సరిగా గ్రహింపజాలకపోవుట విప్రతిపత్తి. ప్రతివాది యుక్తులను ఖండించలేకపోవుట లేదా అతడు చూపిన దూషణములకు సమాధానము చెప్పలేకపోవుట అప్రతిపత్తి. ఈ రెండింటిలో ఏది ఏర్పడినను ఆ వ్యక్తి పరాజితు డైనట్లు పరిగణింపబడును.

మూ. కృషిపాశుపాల్యే వాణిజ్యా చ వార్తా. ఆన్వీక్షికీ త్రయీ వార్తానాం యోగక్షేమసాధనో దణ్డః; తస్య నీతిర్దణ్డనీతిః. తస్యామాయత్తా లోకయాత్రా. ఇతి శాస్త్రాణి.

వ్యా. వ్యవసాయము, పశుపాలనము, వర్తకము – వీటికి వార్త అని పేరు. ఆన్వీక్షికీ – త్రయీ – వార్తల యోగక్షేమములకు సాధనమైనది దండము. దండమునకు సంబంధించిన నీతి దండనీతి. లోకయాత్ర అంతయు ఈ దండనీతిపైననే ఆధారపడి యున్నది. ఈ విధముగ శాస్త్రస్వరూపము చెప్పబడినది.

మూ. సామాన్యలక్షణం చైషామ్ :-

శ్లో॥ "సరితామివ ప్రవాహాస్తుచ్ఛాః ప్రథమం యథోత్తరం విపులాః,
యే శాస్త్రసమారమ్భా భవన్తి లోకస్య తే వన్ద్యాః". 5

వ్యా. శాస్త్రముల సామాన్యలక్షణము ఈ విధముగ నుండును:- "ఏ శాస్త్రముల ప్రారంభములు, నదీప్రవాహముల వలె మొదట స్వల్పముగ నుండునో, క్రమక్రమముగ విపులముగ ఉండునో అట్టి శాస్త్రములు లోకముల ఆదరమునకు పాత్ర మైనవి".

మూ. సూత్రాదిభిశ్చైషాం ప్రణయనమ్. తత్ర సూత్రణాత్ సూత్రమ్. యథాహుః:-

శ్లో॥ "అల్పాక్షరమసన్దిగ్ధం సారవద్విశ్వతోముఖమ్,
అస్తోభమనవద్యం చ సూత్రం సూత్రవిదో విదుః". 6

వ్యా. ఈ శాస్త్రముల రచన సూత్రాదుల ద్వారా జరిగినది. సూత్ర మనగా విస్తృతమైన అర్థమును సంక్షిప్తరూపమున ప్రతిపాదించునది. దీని లక్షణము నిట్లు చెప్పుదురు:-

"అల్ప మైన అక్షరములు కలది, సందేహము కలిగించనిది, సారము కలది, వ్యాపకమగు అర్థమును బోధించునది, వ్యర్థపదములు లేనిది, దోషరహితమైనది అగు వాక్యము సూత్రము అని సూత్రలక్షణము తెలిసినవారు చెప్పుదురు".



మూ. సూత్రాణాం సకలసారవివరణం వృత్తిః. సూత్రవృత్తివివేచనం పద్ధతిః. ఆక్షిప్య భాషణాద్భాష్యమ్. అన్తర్భాష్యం సమీక్షా. అవాన్తరార్థవిచ్ఛేదశ్చ సా. యథాసమ్భవమర్థస్య టీకనం టీకా. విషమపదభఞ్జికా పఞ్జికా. అర్థప్రదర్శనకారికా కారికా, ఉక్తానుక్తదురుక్తచిన్తా వార్తికమితి శాస్త్రభేదాః.

వ్యా. సూత్రముల సారము నంతను వివరించునది 'వృత్తి'. ఆ వృత్తిని విశదీకరించునది 'పద్ధతి'. ఎన్నియో ఆక్షేపములు చేయుచు, అనగా అనుపపత్తులు చూపుచు, వాటికి తగు సమాధానములను చెప్పునది "భాష్యము". భాష్యోక్తవిషయములను వివరించునది సమీక్ష. భాష్యములో ప్రసక్తానుప్రసక్తముగా వచ్చిన విషయములను వివరించుటకు గూడ 'సమీక్ష' అని పేరు. వీలైనంతవరకు అర్థములను సూచించునది 'టీక'. విషమపదములను విరుగగొట్టి అర్థమును చెప్పునది 'పంజిక'. ఒక పరినిష్ఠితార్థమును ప్రదర్శించునది కారిక. (శ్లోకరూపమున ఉండును). చెప్పిన విషయములను గూర్చియు, చెప్పని విషయములను గూర్చియు, తప్పుగా చెప్పిన విషయములను గూర్చియు చేయు చింతకు, అనగా పర్యాలోచనమునకు, 'వార్తికము' అని పేరు. ఇవన్నియు శాస్త్రరచనారీతులలోని భేదములు.

శ్లో॥ "భవతి ప్రథయన్నర్థం లీనం సమభిష్టుతం స్ఫుటీకుర్వన్,
అల్పమనల్పం రచయన్ననల్పమల్పం చ శాస్త్రకవిః". 5

వ్యా. నిగూఢమైన అర్థమును ప్రకటింపచేయుచు, అస్పష్టముగాను, సందిగ్ధముగాను ఉన్న అర్థమును స్పష్టీకరించుచు, సంక్షిప్తముగా ఉన్న విషయమును విస్తరించుచు, విస్తృతముగా ఉన్న దానిని సంక్షిప్తముచేయుచు రచన చేయువాడు శాస్త్రకవి యగును.

మూ. శాస్త్రైకదేశస్య ప్రక్రియా ప్రకరణమ్. అధ్యాయాదయస్త్వవాన్తరవిచ్ఛేదాః కృతిభిః స్వతన్త్రతయా ప్రణీతా ఇత్యసఙ్ఖ్యేయా అనాఖ్యేయాశ్చ.

వ్యా. శాస్త్రముయొక్క ఒక భాగమునకు సంబంధించిన ప్రక్రియ ప్రకరణము. శాస్త్రగ్రంథములలో చేయు అవాంతరవిభాగములు అధ్యాయాదులు. 'అధ్యాయము' మొదలైన ఈ విభాగములు శాస్త్రరచయితలు స్వతంత్రరూపమున చేయుచుందురు. కావున ఇవి అసంఖ్యాకములు. చెప్ప శక్యము కానివి.

మూ. శబ్దార్థయోర్యథావత్సహభావేన విద్యా సాహిత్యవిద్యా. ఉపవిద్యాస్తు చతుఃషష్టిః. తాశ్చ కలా ఇతి విదగ్ధవాదః. స ఆజీవః కావ్యస్య. తమౌపనిషదికే వక్ష్యామః.

వ్యా. శబ్దార్థములు రెండును పరస్పరానుకూలముగ కలిసి యుండు విద్య సాహిత్యవిద్య. ఉపవిద్యలు అరువదినాలుగు. వాటిని కళ లని విద్వాంసులు చెప్పుదురు. ఉపవిద్యలు

కావ్యమునకు జీవనాధార మైనవి. ఆ విషయమును గూర్చి 'ఔపనిషదిక' ప్రకరణమునందు చెప్పగలము.

శ్లో॥ ఇత్యనన్తోఽభియుక్తానామత్ర సంరమ్భవిస్తరః,
తృక్తో నిపుణధీగమ్యో గ్రన్థగౌరవకారణాత్. 6

ఇతి రాజశేఖరకృతౌ కావ్యమీమాంసాయాం కవిరహస్యే
ప్రథమేఽధికరణే ద్వితీయోఽధ్యాయః శాస్త్రనిర్దేశః.

వ్యా. ఈ విధముగ గ్రంథరచనావిషయమున పండితుల ప్రవృత్తి బహుముఖముల అనంతముగ ఉన్నది. దీనిని గూర్చి బుద్ధిమంతులు ఊహించి తెలుసుకొనగలరు. గ్రంథగౌరవ భయముచే దాని విస్తృతవివేచనమును విడిచినాను.

బాలానందినియందు ద్వితీయాధ్యాయము సమాప్తము.

## అథ తృతీయోఽధ్యాయః - కావ్యపురుషోత్పత్తిః

మూ. ఏవం గురుభ్యో గిరః పుణ్యాః పురాణీః శృణుమః స్మ; యత్కిల ధిషణం శిష్యాః కథాప్రసఙ్గే పప్రచ్ఛుః - కీదృశః పునరసౌ సారస్వతేయః కావ్యపురుషో వో గురుః? ఇతి. స తాన్ బృహతాం పతిరూచే.

వ్యా. గురువులనుండి ఈ విధముగ ప్రాచీనము లగు కొన్ని వాక్కులు వినవచ్చు చున్నవి. "మీ గురువైన ఆ సరస్వతీపుత్రు డగు కావ్యపురుషుడు ఎవరు? ఎట్టివాడు?" అని మాటల సందర్భమున బృహస్పతిని ఆతని శిష్యులు ప్రశ్నించినారట. బృహస్పతి వారి కిట్లు చెప్పెను. (బృహస్పతి యనగా 'బృహతాం పతిః'. అనగా వాక్కులకు పతి).

మూ. పురా పుత్రీయన్తీ సరస్వతీ తుషారగిరౌ తపస్యామాస. ప్రీతేన మనసా తాం విరిఞ్చః ప్రోవాచ - "పుత్రం తే సృజామి". అథైషా కావ్యపురుషం సుషువే. సోఽభ్యుత్థాయ సపాదోపగ్రహం ఛన్దస్వతీం వాచ ముదచీచరత్.

శ్లో॥ "యదేతద్వాఙ్మయం విశ్వమర్థమూర్త్యా వివర్తతే,
సోఽస్మి కావ్యపుమానమ్బ పాదౌ వన్దేయ తావకౌ". 1

వ్యా. పూర్వము సరస్వతి పుత్రాభిలాషతో హిమాచలముపై తపస్సు చేసెను. బ్రహ్మ సంతుష్టాంతరంగుడై "నీకు పుత్రుని సృజించెదను" అని పలికెను. అపు డామె కావ్యపురుషుని కనెను. ఆతడు లేచి, తల్లి పాదములకు నమస్కరించుచు ఛందోమయ మగు వాక్కును పలికెను :-



"తల్లీ ! ఎవని ద్వారా ఈ వాఙ్మయప్రపంచ మంతయు అర్థరూపమున పరిణతి చెందుచుండునో అట్టి కావ్యపురుషుడ నగు నేను నీ పాదములను నమస్కరించుచున్నాను".

మూ. తామామ్నాయదృష్టచరీముపలభ్య భాషావిషయే ఛన్దోముద్రాం దేవీ ససమ్మదమఙ్కపర్యఙ్కేనాదాయ తముదలాపయత్ - "వత్స ! సచ్ఛన్దస్కాయా గిరః ప్రణేతర్వాఙ్మయమాతరమపి మాతరం మాం విజయసే. ప్రశస్యతమం చేదముదా హరన్తి - 'యదుత పుత్రాత్పరాజయో ద్వితీయం పుత్రజన్మ' ఇతి. త్వత్తః పూర్వే హి విద్వాంసో గద్యం దదృశుర్న పద్యమ్. త్వదుపజ్ఞమథాతః ఛన్దస్వద్వచః ప్రవర్త్స్యతి. అహో శ్లాఘనీయోఽసి. శబ్దార్థౌ తే శరీరమ్. సంస్కృతం ముఖమ్. ప్రాకృతం బాహుః. జఘనమపభ్రంశః. పైశాచం పాదౌ. ఉరో మిశ్రమ్. సమః, ప్రసన్నో, మధుర, ఉదార ఓజస్వీ చాసి. ఉక్తిచణం తే వచో; రస ఆత్మా; రోమాణి ఛన్దాంసి. ప్రశ్నోత్తర ప్రహేలికాదికం చ వాక్కేలిః. అనుప్రాసోపమాదయశ్చ త్వామలఙ్కుర్వన్తి, భవిష్యతోఽర్థస్యాభిధాత్రీ శ్రుతిరపి భవన్తమభిస్తౌతి :-

శ్లో॥ "చత్వారి శృఙ్గాస్త్రయోఽస్య పాదా ద్వే శీర్షే సప్తహస్తాసోఽస్య,
త్రిధా బద్ధో వృషభో రోరవీతి మహో దేవో మర్త్యాం ఆవివేశ". 2

తథాపి సంవృణు ప్రగల్భస్య పుంసః కర్మ. బాలోచితం చేష్టస్వ" ఇతి నిగద్య నివేశ్య చైనమనోకహాశ్రయిణి గణ్డశైలతల్పే స్నాతుమభ్రగఙ్గాం జగామ.

వ్యా. పూర్వము వేదమునందు మాత్రమే కనబడుచుండెడి ఆ ఛందోముద్ర (లౌకిక) భాషావిషయమున గూడ ప్రవర్తించుటను చూచి సరస్వతీదేవి సంతోషముతో ఆతనిని ఒడిలోకి తీసికొని, బుజ్జగించుచు ఇట్లనెను - "ఛందోమయ మగు వాక్కును రచించిన ఓ వత్సా ! వాఙ్మయమున కంతకును తల్లియు, నీ జననియు అగు నన్ను కూడ జయించు చున్నావు. 'పుత్రుని చేతిలో ఓటమి ద్వితీయపుత్రజన్మతుల్యము' అని ఒక ప్రశస్త మగు లోకోక్తి చెప్పుచుందురు. నీకు పూర్వమునందున్న విద్వాంసులు గద్యను మాత్రమే చూచిరి కాని పద్యమును చూడలేదు. అందుచే త్వదుపజ్ఞమైన, అనగా ప్రప్రథమమున నీచేతనే ప్రయుక్తమైన, ఛందోమయ మగు వాక్కు లోకములో ప్రసిద్ధి పొందగలదు.

శబ్దార్థములు నీ శరీరము. సంస్కృతభాష ముఖము. ప్రాకృతభాషలు నీ బాహువులు. అపభ్రంశభాష జఘనము (నడుము). పైశాచభాష పాదములు. మిశ్రభాషలు వక్షస్థలము. నీవు సముడవు; ప్రసన్నుడవు; మధురస్వభావుడవు; ఉదారుడవు; ఓజశ్శాలివి. (సమత, ప్రసాదము, మాధుర్యము, ఔదార్యము, ఓజస్సు అనునవి కావ్యగుణములు). నీ వాక్కు ఉక్తిచణము, అనగా సదుక్తులచే ప్రసిద్ధము. రసము ఆత్మ. ఛందస్సులు రోమములు.

ప్రశ్నోత్తరములు, ప్రహేలికాదులు నీ వాగ్విలాసము. అనుప్రాసోపమాదులు నిన్ను అలంకరించును. రాబోవు విషయములను చెప్పు సామర్థ్యము గల శ్రుతి కూడ నిన్ను స్తుతించుచున్నది :-

"ఈ వృషభమునకు కొమ్ములు నాలుగు; పాదములు మూడు; శిరస్సులు రెండు; హస్తములు ఏడు; మూడు విధముల బంధింపబడినదై ధ్వని చేయుచు ఈ మహాదేవుడు మనుష్యులలో ప్రవేశించెను"

"సప్త స్వరాః, త్రీణి స్థానాని, చత్వారో వర్ణాః, ద్వివిధా కాకుః. షడలంకారాః, షడఙ్గాని" అని భరతనాట్యశాస్త్రము (17అ). వీటిని యథాసంభవముగ శృంగాదిరూపమున అన్వయించుకొనవలెను.

వి. ఈ మంత్రమును రాజశేఖరుడు తన శాస్త్రమునకు అన్వయించు నట్లు వ్యాఖ్యానించినాడు. సాయణాచార్యులు (ఋగ్వేదభాష్యభూమికలో) దీనిని ఈ క్రింది విధముగ వ్యాఖ్యానించి యున్నారు. "ఈ యజ్ఞ - వృషభమునకు హోత, అధ్వర్యువు, ఉద్గాత, బ్రహ్మ అను వారు నలుగురును శృంగములు, ప్రాతఃసవనాదులు మూడునూ పాదములు. పత్నీ-యజమాను లిరువురును రెండు శిరస్సులు. గాయత్ర్యాదిఛందస్సులు ఏడును హస్తములు. ఋగ్వేదాది వేదత్రయముచే మూడు విధముల బంధింపబడినది. కామములను వర్షించును గాన వృషభము. మాటి మాటికి స్తోత్రశస్త్రాదిధ్వనులు చేయును. యజ్ఞరూపుడగు ఈ ప్రౌఢుడైన దేవుడు మర్త్యులలో ప్రవేశించెను. అనగా మర్త్యులే ఇందుకు అధికారులు." కొంచెము మార్పుతో నిరుక్తము కూడ ఈ మంత్రమును యజ్ఞపురుషార్థమున సమన్వయించెను. (13.6).

పతంజలి తన మహాభాష్యమున ఈ మంత్రమునే వ్యాకరణశాస్త్రపరముగ వ్యాఖ్యానించినారు, "మహాదేవుడు మానవులలో ప్రవేశించెను. ఈ శబ్దము కామములను వర్షించునది గాన వృషభము. ఈ వృషభమునకు నామములు, ఆఖ్యాతములు, ఉపసర్గలు, నిపాతములు అనునవి నాలుగు శృంగములు. భూత - భవిష్యద్ - వర్తమానకాలములు మూడును మూడు పాదములు. నిత్యశబ్ద - కార్యశబ్దములు రెండు రెండు శిరస్సులు. ఏడు విభక్తులు ఏడు హస్తములు, మూడు విధములుగ వక్షస్థలము, కంఠము, శిరస్సు అను మూడు స్థానము లందు - బంధింపబడినది. ఇది ధ్వనిచేయుచుండును (రోరవీతి)".

వ్యా. ఐనను ప్రగల్భుడగు పురుషుని కర్మను కప్పిపుచ్చుము. (ప్రగల్భపురుషుని వలె ప్రవర్తింపకుము). బాలురకు తగు విధముగ ప్రవర్తించుము", ఇట్లు పలికి ఆతనిని వృక్షముల కాశ్రయ మగు (వృక్షములతో గూడిన) పర్వతశిలాతల్పముపై పరుండ బెట్టి, స్నానము చేయుటకై ఆకాశగంగకు వెళ్లెను.



మూ. తావచ్చ కుశాన్ సమిధశ్చ సమాహర్తుం నిఃసృతో మహామునిరుశనాః పరివృత్తే పూషణ్యోష్మోపప్లుతం తమద్రాక్షీత్. కస్యాయమనాథో బాల ఇతి చిన్తయన్ స్వమాశ్రమపదమనైషీత్.

వ్యా. ఇంతలో మహాముని యగు ఉశనస్సు (శుక్రాచార్యుడు) దర్భలను సమిధలను ప్రోగుచేసికొనుటకై బయలుదేరెను. సూర్యుడు పైకి లేచుటచే వేడికి బాధపడుచున్న ఆ పిల్లవానిని చూచెను. అనాథుడగు ఈ బాలుడు ఎవరి పిల్లవాడా అని అనుకొనుచు తన ఆశ్రమమునకు తీసికొని వెళ్లెను.

మూ. క్షణాదాశ్వస్తశ్చ స సారస్వతేయస్తస్మై ఛందస్వతీం వాచం సమాచారయత్. అకస్మాద్విస్మాపయన్ స చాభ్యువాచ :-

శ్లో॥ "యా దుగ్ధాపి న దుగ్ధేవ కవిదోగ్ధృభిరన్వహమ్,
హృది నః సన్నిధత్తాం సా సూక్తిధేనుః సరస్వతీ" ఇతి. 3

వ్యా. క్షణకాలములో సేదదేరిన ఆ సరస్వతీకుమారుడు ఆ శుక్రాచార్యునకు, ఛందోమయ మగు వాక్కు ప్రసరించునట్లు చేసెను. ఆశ్చర్యమును కలిగించు విధమున ఆతడు అకస్మాత్తుగ ఇట్లు పలికెను :-

"కవులనెడు దోగ్ధలు (పాలు పితుకువారు) ప్రతిదినము పితుకుచున్నను ఏది పితకనట్లే ఉన్నదో అట్టి సూక్తికామధేను వగు సరస్వతి మా హృదయమునందు నివసించుగాక".

మూ. తత్పూర్వకమధ్యేతౄణాం చ సుమేధస్త్వమాదిదేశ. తతః ప్రభృతి తముశనసం సన్తః కవిరిత్యాచక్షతే. తదుపచారాచ్చ కవయః కవయ ఇతి లోకయాత్రా. కవిశబ్దశ్చ "కబృ వర్ణే" ఇత్యస్య ధాతోః కావ్యకర్మణో రూపమ్. కావ్యైకరూపత్వాచ్చ సారస్వతేయోఽపి కావ్యపురుష ఇతి భక్త్యా ప్రయుజ్యతే.

వ్యా. (ఆ సారస్వతేయు డా విధముగ శుక్రునియందు ఛందోమయవాక్కు ప్రసరించునట్లు చేసి) ఈ శ్లోకముతో (శుక్రుని నోటినుండి వెలువడిన 'యా దుగ్ధాపి' ఇత్యాదిశ్లోకముతో) ప్రారంభించి అధ్యయనము చేయువారికి సుమేధస్త్వము కలుగు నని (వారు మేధాసంపన్నులగుదు రని) ఆజ్ఞాపించెను. (అనుగ్రహించెను). అంతవరకును ఉశనసుడను పేరుతో నున్న ఆతనిని (శుక్రుని) అప్పటినుండి కవి యని చెప్పుచున్నారు. ఈ పేరునే ఆరోపించి ఇతరులను గూడ 'కవులు' 'కవులు' అను లోక ప్రసిద్ధి ఏర్పడినది. 'కవి' శబ్దము కావ్యము అను అర్థము గల 'కబృ వర్ణే' అను ధాతువుయొక్క (ధాతువునుండి నిష్పన్న మైన) రూపము. సారస్వతేయుడు కావ్యైకరూపుడు గాన- ఆతని విషయమున 'కావ్యపురుషుడు' (అనగా కావ్యాభిన్ను డైన పురుషుడు) అని ఔపచారికప్రయోగము చేయుచున్నారు.

మూ. తతశ్చ వినివృత్తా వాగ్దేవీ తత్ర పుత్రమపశ్యన్తీ మధ్యేహృదయం చక్రన్ద. ప్రసఙ్గాగతశ్చ వాల్మీకిర్మునివృషా సప్రశ్రయం తముదన్తముదాహృత్య భగవత్యై భృగుసూతేరాశ్రమపదమదర్శయత్.

వ్యా. అంతట తిరిగి వచ్చిన వాగ్దేవత, అచట పుత్రుడు కనబడకపోవుటతో మనస్సులో ఆక్రందించెను. ప్రసంగవశముచే అచటకు వచ్చిన మునిశ్రేష్ఠుడైన వాల్మీకి, సవినయముగ భగవతి యగు వాగ్దేవికి ఆ వృత్తాంతమును తెలిపి, శుక్రుని ఆశ్రమమును చూపించెను.

మూ. సాపి ప్రస్నుతపయోధరా పుత్రాయాఙ్కపాలీం దదానా, శిరసి చ చుమ్బన్తీ స్వస్తిమతా చేతసా ప్రాచేతసాయాపి మహర్షయే నిభృతం సచ్ఛన్దాంసి వచాంసి ప్రాయచ్ఛత్.

వ్యా. ఆమె కూడ చనుబాలు స్రవింప కుమారుని ఒడిలోకి తీసికొని, శిరమున ముద్దిడుచు శుభచిన్తాభరిత మగు చిత్తముతో ఆ వాల్మీకికి కూడ, రహస్యముగ, ఛందో గ్రథితము లగు వాక్కులను అనుగ్రహించెను.

మూ. అను ప్రేషితశ్చ స తయా నిషాదనిహతసహచరీకం క్రౌఞ్చయువానం కరుణక్రేఙ్కారయా గిరా క్రన్దన్తం ఉదీక్ష్య శోకవాన్ శ్లోకముజ్జగాద :-

శ్లో॥ "మా నిషాద ప్రతిష్ఠాం త్వమగమః శాశ్వతీః సమాః,
యత్క్రౌఞ్చమిథునాదేకమవధీః కామమోహితమ్". 4

వ్యా. స్వాశ్రమమునకు వెళ్లుటకై ఆమెచే అనుమతింపబడిన ఆతడు, నిషాదు డొకడు తన సహచరిని సంహరింపగా కరుణాభరితక్రేంకారరూప మగు (కొన్ని పక్షుల కూతలకు క్రేంకార మని పేరు) ధ్వనితో ఆక్రందించుచున్న ఒక యువక్రౌంచపక్షిని చూచి, శోకవంతుడై, ఈ శ్లోకమును పలికెను :-

"ఓ నిషాదుడా! క్రౌంచమిథునమునుండి కామమోహితమై యున్న ఒక పక్షిని చంపినావు! అందుచే చిరకాలము భూమిపై మనకుందువు గాక!

వి. ఇచట రాజశేఖరుడు, ఆడ పక్షిని చంపినట్లు వ్రాసినాడు. ఆనందవర్ధనుడు కూడ అట్టి అర్థమే వచ్చునట్లు వ్రాసినాడు కాని అభినవగుప్తుడు శ్రమపడి దానికి అర్థము కుదిర్చినాడు. అట్లు కుదుర్చుట ఈ వాక్యములో శక్యము కాదు. కావున ఇది రామాయణములో ఇప్పుడు ప్రసిద్ధిలో నున్న పాఠమునకు విరుద్ధము.

మూ. తతో దివ్యదృష్టిర్దేవీ తస్మా అపి శ్లోకాయ వరమదాత్; యదుతాన్యదన ధీయానో యః ప్రథమమేనమధ్యేష్యతే స సారస్వతః కవిః సమ్పత్స్యతే ఇతి. స తు



మహామునిః ప్రవృత్తవచనో రామాయణమితిహాసం సమదృభత్; ద్వైపాయనస్తు శ్లోక ప్రథమాధ్యాయీ తత్ప్రాభావేన శతసాహస్రీం సంహితాం భారతమ్.

వ్యా. దివ్యదృష్టిచే ఈ శ్లోకనిర్మాణమును తెలిసికొనిన సరస్వతీదేవి "అంతవరకును ఏమియు అధ్యయనము చేయనివాడు మొట్టమొదటగ ఈ శ్లోకమును పఠించినచో సారస్వత కవి (సరస్వతీప్రసాదపాత్ర మగు కవి) యగును" అని ఈ శ్లోకమునకు కూడ వర మిచ్చెను. ఈ విధముగ అనాయాసముగ వెడలిన శ్లోకము గల ఆ ముని రామాయణ మనెడి ఇతిహాసమును రచించెను. ప్రప్రథమముగ ఈ శ్లోకమునే చదివిన ద్వైపాయనుడు, దీని ప్రభావముచే, శతసాహస్రసంహితారూప మైన (నూరువేల శ్లోకములు గల) భారతమును రచించెను.

మూ. ఏకదా తు బ్రహ్మర్షివృన్దారకయోః శ్రుతివివాదే దాక్షిణ్యవాన్ దేవః స్వయమ్భూః తామిమాం నిర్ణేత్రీముద్దిదేశ. ఉపశ్రుతవృత్తాన్తశ్చ మాతరం వ్రజన్తీం సోऽనువవ్రాజ. "వత్స ! పరమేష్ఠినాననుమతస్య తే న బ్రహ్మలోకయాత్రా నిఃశ్రేయ సాయ" ఇత్యభిదధానా హఠాన్న్యవర్తయదేనమ్, ఆత్మనా తు ప్రవవృతే.

వ్యా. ఒకనాడు బ్రహ్మర్షులకును దేవతలకును మధ్య ఏదియో వైదికవిషయమును గూర్చి వివాద మేర్పడినది. అపుడు దాక్షిణ్యవంతు డగు బ్రహ్మ (రెండు పక్షములవారి యందును తుల్య మగు ప్రేమ కలవాడు దాక్షిణ్యవంతుడు. అందుచే బ్రహ్మ తాను ఏ నిర్ణయము చేయలేదు). ఆమెను (సరస్వతిని) వివాదనిర్ణేత్రినిగా ఆజ్ఞాపించెను. కావ్యపురు షుడు ఈ విషయము తెలిసి బ్రహ్మలోకమునకు వెళ్ళుచున్న తల్లిని అనుసరించెను. "వత్సా! బ్రహ్మ అనుమతి లేనిదే నీవు బ్రహ్మలోకమునకు వచ్చుట క్షేమకరము కాదు" అని పలికి ఆమె ఆతనిని బలాత్కారముగ వెనుకకు పంపెను. తాను మాత్రము ముందుకు సాగెను.

మూ. తతః స కావ్యపురుషో రుషా నిశ్చక్రామ. ప్రియం మిత్రమస్య చ కుమారః సాక్రన్దం రుదన్నభ్యధీయత గౌర్యా – "తాత తూష్ణీమాస్స్వ; సాహమేషా నిషేధామి" ఇతి నిగదన్తీ సమచిన్తయత్ – "ప్రాయః ప్రాణభృతాం ప్రేమాణమన్తరేణ నాన్యద్ బన్ధనమస్తి. తదేతస్య వశీకరణం కామపి స్త్రియం సృజామి" ఇతి విచిన్తయన్తీ సాహిత్య విద్యావధూముదపాదయదాదిశచ్చైనామ్ – "ఏష తే రుషా ధర్మపతిః పురః ప్రతిష్ఠతే. తదనువర్తస్వైనం, నివర్తయ చ. భవన్తోऽపి హన్త మునయః కావ్యవిద్యాస్నాతకాశ్చరి తమేతయోః స్తుధ్వమ్. ఏతద్ధి వః కావ్యసర్వస్వం భవిష్యతి"' ఇత్యభిధాయ భవానీ జోషమాసిష్ట. తేऽపి తథా కర్తుమవతస్థిరే.

వ్యా. అంతట ఆ కావ్యపురుషుడు కోపముతో ఎచటికో పోవుటకు బయలుదేరెను. అతని ప్రియమిత్రు డగు కుమారస్వామి బిగ్గరగ ఏడ్వ మొదలిడెను. అపుడు పార్వతి ఇట్లు చెప్పెను – "తండ్రీ ! ఊరుకొనుము, వీనిని నేను వెళ్ళకుండ చేసెదను." ఇట్లు పలికి ఆమె మనస్సులో ఈ విధముగ ఆలోచించెను. "సాధారణముగ ప్రాణులకు ప్రేమను మించిన బంధము మరి యొకటి లేదు. అందుచే ఈతనిని వశము చేసికొనెడు స్త్రీని ఒకతెను సృజించెదను." ఇట్లు ఆలోచించి సాహిత్యవిద్యా వధువును సృజించి, ఆమెను ఇట్లు ఆజ్ఞాపించెను – "ఇదుగో నీ ధర్మపతి కోపముతో (ఎచటికో) వెడలిపోవుచున్నాడు. అందుచే ఇతనిని అనువర్తించుము; వెనుకకు మరల్చుము." "ఓమునులారా! కావ్యవిద్యాస్నాతకు లగు మీరుకూడ వీరి (సాహిత్యవిద్యావధూ – కావ్యపురుషుల) చరితమును స్తుతింపుడు. ఇది (వీరి చరితము) మీ కావ్యసర్వస్వము కాగలదు" అని (మునులుతో) పలికి భగవతి యగు పార్వతి మౌనము వహించెను. వారు కూడ ఆ విధముగ చేయ నుద్యుక్తులై యుండిరి.

మూ. అథ సర్వే ప్రథమం ప్రాచీం దిశం శిశ్రియుః. యత్రాఙ్గ – వఙ్గ – సుహ్మ – బ్రహ్మ – పుణ్డ్రాద్యా జనపదాః. తత్రాభియుఞ్జానా తమౌమేయీ యం వేషం యథేష్టమసేవిష్ట స తత్రత్యాభిః స్త్రీభిరన్వక్రియత. సా ప్రవృత్తీ రౌద్రమాగధీ. తం తే మునయోఽభితుష్టువుః –

శ్లో॥ "ఆర్ద్రార్ద్రచన్దనకుచార్పితసూత్రహారః
సీమన్తచుమ్బిసిచయః స్ఫుటబాహుమూలః,
దూర్వాప్రకాణ్డరుచిరాస్వగురూపభోగాద్-
గౌడాఙ్గనాసు చిరమేష చకాస్తు వేషః". 5

వ్యా. అంత వారందరును మొదట తూర్పు దిక్కు వైపు వెళ్లిరి. అంగ – వంగ – సుహ్మ – బ్రహ్మ – పుంద్రాదిదేశములు ఈ దిక్కుననే ఉన్నవి.

వి. భాగలపుర్‌నుండి ముంగేర్ వరకు ఉన్న ప్రదేశము అంగదేశము. చంపాపురి దీని రాజధానిగా ఉండెడిది. ఇది నేటి భాగల్పుర్‌కు మూడు కిలోమీటర్ల దూరములో గంగాతీరమున ఉన్నది. వంగదేశ మనగా నేటి బంగాలాదేశము. దీనికి సమతటము అని కూడ పేరు. ఒక కాలమున ఈ దేశము టిపరా–గారో పర్వతములవరకు వ్యాపించి యుండెడిది. సుహ్మదేశము : నేటి మిదినాపుర్, హుగలీ, వర్ధమాన మండలాలకు ప్రాచీన కాలమున సుహ్మదేశ మని పేరు. తామ్రలిప్తి దాని రాజధానిగా ఉండెడిది. బ్రహ్మదేశము : నేటి బర్మాదేశము. పుంద్రదేశము : నేటి బంగాలదేశమునందలి మాలధా – బోగరా మండలములలోని కొన్ని భాగములకు పూర్వము పుంద్రదేశ మని పేరు.



వ్యా. అచట ఆతనిని (కావ్యపురుషుని) వశము చేసికొనుటకై అనుసరించుచున్న ఆ ఉమాపుత్రి (సాహిత్యవిద్యావధువు) యథేష్టముగ (ప్రయత్నపూర్వకముగ) ఏ వేషమును ధరించెనో ఆ వేషమును అచట నున్న స్త్రీలు అనుకరించిరి. ఆ వేషరచనకు "రౌద్రమాగధప్రవృత్తి" యని పేరు. ఆ ప్రవృత్తిని (కావ్యవిద్యాస్నాతకు లగు ఆ మునులు ఈ విధముగ స్తుతించిరి :- "అగురుధూపమును సేవించుటచే (వర్ణము కొంచెము మారి) దూర్వాతృణములో మధ్యనున్న కాండము వలె సుందర మైన శరీరకాంతి గల గౌడాంగనలలో తడి తడిగా ఉన్న చందనము గల కుచములపై ఉంచబడిన హారసూత్రము కలదియు సీమంతమును చుంబించుచున్న (పాపటను అంటుచున్న) వస్త్రాంతము (మేలి ముసుగు) కలిదియు, స్పష్టముగ దృశ్యము లగు బాహుమూలములు కలదియు అగు ఈ వేషము, చాల కాలము ప్రకాశించుగాక" !

మూ. యదృచ్ఛయాపి యాదృఙ్నేపథ్యః స సారస్వతేయ ఆసీత్ తద్వేషాశ్చ పురుషా బభూవుః. సాపి సైవ ప్రవృత్తిః. యదపరం నృత్తవాద్యాదికమేషా చక్రే సా భారతీ వృత్తిః. తాం తే మునయ ఇతి సమానం పూర్వేణ.

వ్యా. ఆ సారస్వతేయుడు ఆ సమయమున యాదృచ్ఛికముగ ఏ వేషమును ధరించెనో, అచటి పురుషు లందరును ఆ వేషమునే ధరించిరి. మరియు ఆమె (సాహిత్యవిద్యావధువు) ఏ నృత్తవాద్యాదికమును చేసెనో అది భారతీవృత్తి. 'తాం తే మునయః' ఇత్యాదికము పూర్వము వలె సమానమే. (అనగా ఆ మునులు ఆ భారతీవృత్తిని స్తుతించిరి అని యర్థము).

మూ. తథావిధాకల్పయాపి తయా యదవశంవదీకృతః సమాసవత్, అనుప్రాసవత్, యోగవృత్తిపరమ్పరాగర్భం జగాద సా గౌడీయా రీతిః. తాం తే మునయ ఇతి సమానం పూర్వేణ. వృత్తిరీతిస్వరూపం యథావసరం వక్ష్యామః.

వ్యా. ఆమె అట్టి వేషమును ధరించినను ఆ కావ్యపురుషుడు ఆమెకు వశంవదుడు కాలేదు. అతడు సమాసభూయిష్ఠము, అనుప్రాసబహులము అగు యౌగికవృత్తిపరంపరతో కూడినది అగు (వాక్యమును) (లేదా "యౌగికవృత్తిపరంపరాగర్భముగ" అని క్రియావిశేషణము) పలికెను. అదియే గౌడీయరీతి. మునులు దానిని ఇత్యాదికము యథాపూర్వమే. భారత్యాదివృత్తుల స్వరూపమును గౌడీయాదిరీతిస్వరూపమును ముందు సమయము వచ్చినపుడు చెప్పగలము.

మూ. తతశ్చ స పాఞ్చాలాన్ ప్రత్యుచ్చచాల యత్ర పాఞ్చాల – శూరసేన – హస్తినాపుర – కాశ్మీర – వాహీక – బాహ్లీక – బాహ్లవేయాదయో జనపదాః తత్రాభియుఞ్జానా తమౌమేయీతి సమానం పూర్వేణ. సా పాఞ్చాలమధ్యమా ప్రవృత్తిః. తాం తే మునయోఽభితుష్టువుః.

వ్యా. అంతట అతడు, పాంచాల - శూరసేన - హస్తినాపుర - కాశ్మీర - వాహీక - బాహ్లీక - బాహ్లవేయాదిదేశములకు స్థానమైన పాంచాలప్రాంతమునకు వెళ్లెను. "తత్రా భియుజ్ఞానా తమౌమేయీ" ఇత్యాదికము వెనుకటి వలెనే. (అనగా అచట ఆతనిని వశము చేసికొనుటకై ఉమాపుత్రి ప్రయత్నపూర్వకముగ ఏ వేషమును ధరించెనో దానిని అచటి స్త్రీలు అనుకరించిరి అని యర్థము). అది పాంచాలమధ్యమప్రవృత్తి. మునులు దానిని స్తుతించిరి.

వి. పాంచాలదేశము: థానేశ్వరమునుండి (థనేసర్) ప్రయాగవరకు, హిమాలయ ప్రాంతమునుండి యమునవరకు వ్యాపించి యున్న దేశము పాంచాలదేశము. ఇది ఉత్తర పాంచాలము., దక్షిణపాంచాలము అని రెండు ప్రదేశములుగ విభక్తమైనది. అహిచ్ఛత్రము (నేటి అహిచ్ఛత్ర) దక్షిణ పాంచాలమునకును, కాంపిల్యము ఉత్తరపాంచాలమునకును రాజధానులు. పాంచాలమును రాజశేఖరుడు అంతర్వేదియని కూడ నిర్దేశించి యున్నాడు. అతని కాలమున దీని రాజధాని కాన్యకుబ్జము. శూరసేనదేశము : ఇది కూడ ఉత్తరమున నున్నది. దీనికి మధుర రాజధానిగ ఉండెడిది. హస్తినాపురము : ఇది కురుదేశరాజధాని. ఇది మేరఠ్‌కు వాయవ్యముగా 22 మైళ్ల దూరముననుు ఢిల్లీకి ఆగ్నేయముగ 56 మైళ్లదూరముననుు ఉన్నది. కాశ్మీరము : నేటి కాశ్మీరము.

**"శారదామఠమారభ్య కుంకుమాద్రితటాన్తకః,**
**తావత్కాశ్మీరదేశః స్యాత్ పంచాశద్యోజనాత్మకః"**

అను తంత్రశాస్త్రోక్తి ననుసరించి శారదాపీఠము మొదలు కుంకుమాద్రి వరకును గల 500 మైళ్ల ప్రమాణము గల దేశము. వాహీకము : దీనికి పంచనదము, అరట్టదేశము. టక్కదేశము అను నామాంతరములు కలవు, "**పంచానాం సిన్ధుషష్ఠానాం నదీనాం యత్ర సంగమః వాహీకా నామ తే దేశాః**" - అను ప్రసిద్ధోక్తి ననుసరించి సింధ్వాదినదులు ఆరు కలియు దేశము వాహీకదేశము. ఇచటివారు పూర్వము అనార్యులుగ భావింపబడెడివారు. ఈ దేశము పంజాబులో భాగము. బాహ్లీకము : ఇది వాహీకదేశసమీపవర్తిదేశము. ఇది నేటి 'బలఖ్' ప్రాంతము. బాహ్లవేయము : ఇది 'ములతాన్' సమీపమున నున్న నేటి 'బాటియా'. ఇది సింధునదీతీరమున నున్నది.

**శ్లో॥ తాటఙ్కవల్గనతరఙ్గితగణ్డలేఖ**
**మానాభిలమ్బిదరదోలితతారహారమ్,**
**ఆశ్రోణిగుల్ఫపరిమణ్డలితాన్తరీయం**
**వేషం నమస్యత మహోదయసున్దరీణామ్.** 6



వ్యా. తాటంకముల (కర్ణభూషణముల) కదలికచే తరంగములు కలిగినట్లు కనబడు చెక్కిళ్లు కలదియు, నాభీదేశమువరకును వ్రేలాడుచున్న, కొంచెము ఊగుచున్న పెద్ద ముత్యముల హారము కలదియు అగు కాన్యకుబ్జస్త్రీల వేషమును నమస్కరింపుడు. (నేటి 'కనౌజు' కు పూర్వము 'కాన్యకుబ్జము", 'గాధినగరము', 'మహోదయము' అను నామధేయము లుండెడివి).

**మూ.** కిఞ్చిదార్ద్రితమనా యన్నేపథ్యః స సారస్వతేయ ఆసీదితి సమానం పూర్వేణ. సాపి యదీషన్నృత్తగీతవాద్యవిలాసాదికం దర్శయామ్బభూవ సా సాత్త్వతీ వృత్తిః. ఆవిద్ధగతిమత్త్వాత్సా చారభటీ. తాం తే మునయ ఇతి సమానం పూర్వేణ. తథావిధాకల్పయాపి తయా యదీషద్వశంవదీకృత ఈషదసమాసం, ఈషదనుప్రాసము పచారగర్భం చ జగాద సా పాఞ్చాలీ రీతిః? తాం తే మునయ ఇతి సమానం పూర్వేణ.

వ్యా. (సాహిత్యవిద్యావధువు ధరించిన ఆ వేషమును చూచి) ఆ సారస్వతేయుడు కొంచెము ఆర్ద్రమైన మనస్సు కలవాడై ఏ వేషమును ధరించెనో (ఆ వేషమును అచటి పురుషులు ధరించిరి) ఇత్యాదికము యథాపూర్వమే. ఆమె కొంచెము, ఏ నృత్త - గీత - వాద్య - విలాసాదికమును చూపించెనో, అది సాత్త్వతీవృత్తి. కొంచెము గమనమును అడ్డుకొనుటచే ఆ వృత్తియే ఆరభటి కూడ. దానిని ఆ మునులు... ఇత్యాదికము వెనుకటి వలెనే (దానిని ఆ మునులు స్తుతించిరి). అట్టి వేషమును ధరించినను ఆమెచే కొంచెము మాత్రమే వశీకృతుడై (ఆ కావ్యపురుషుడు) చిన్న చిన్న సమాసములతోడను, అనుప్రాసము తక్కువగ ఉండునట్లును, ఉపచారగర్భము గను పలికెను. అదియే పాంచాలీరీతి. దానిని మునులు....ఇత్యాదికము వెనుకటి వలెనే. (మునులు ఆ రీతిని ప్రశంసించిరి).

**మూ.** తతః సోఽవన్తీన్ ప్రత్యుచ్చచాల యత్రావన్తీ - వైదిశ - సురాష్ట్ర - మాలవార్బుద - భృగుకచ్ఛాదయో జనపదాః. తత్రాభియుఞ్జానా తమౌమేయీతి సమానం పూర్వేణ. సా ప్రవృత్తిరావన్తీపాఞ్చాలీమధ్యమా - దాక్షిణాత్యయోరన్తర చారిణీ హి సా. అత ఏవ సాత్త్వికీకైశిక్యౌ తత్ర వృత్తీ. తాం తే మునయోఽభి తుష్టువుః-

**శ్లో॥ పాఞ్చాలనేపథ్యవిధిర్నరాణాం**
**స్త్రీణాం పునర్నన్దతు దాక్షిణాత్యః,**
**యజ్జల్పితం యచ్చరితాదికం త**
**దన్యోన్యసంభిన్నమవన్తిదేశే.** 7

వ్యా. అనంతరము అతడు అవన్తీ - వైదిశ - సురాష్ట్ర - మాలవ - అర్బుద - భృగుకచ్ఛదేశము లున్న అవంతీదేశము వైపు వెళ్ళెను. "తత్రాభియుజ్జానా తమౌమేయీ" ఇత్యాదికము పూర్వము వలెనే (అనగా ఆతనిని వశము చేసికొనుటకై ఉమాపుత్రి ఏ వేషమును ధరించెనో ఆ వేషమును అచటి స్త్రీలు కూడ ధరించిరి). ఆ ప్రవృత్తికి పాంచాలీప్రవృత్తి యని పేరు. అది పాంచాలమధ్యమవృత్తికిని, దాక్షిణాత్యవృత్తికిని నడుమ నుండునది. కావుననే ఆచట సాత్త్వతీ - కైశికీవృత్తు లున్నవి. ఆ వృత్తిని మునులు ఈ విధముగ స్తుతించిరి :-

"పురుషుల పాంచాలవేషవిధానము సుందర మైనది. స్త్రీలకు మాత్రము దాక్షిణాత్య వేషవిధానము మనోహర మైనది. సంభాషణ - చరితములు రెండును అవంతిదేశమున పరస్పరము కలిసియున్నవి."

వి. అవన్తిప్రదేశము :- నేటి మాలవాప్రాంతము. దీనికి ఉజ్జయిని రాజధానిగా ఉండెడిది. ఈ ప్రాంతమునకు వీతిహోత్ర మని కూడ నామాంతరమున్నది. వైదిశ :- విదిశానగరమునకు చుట్టుప్రక్కల నున్న దేశము. విదిశానగరము (నేటి భిలిసా). భోపాలకు 26 మైళ్ళ దూరమున వేత్రవతీనదీతీరమున నున్నది. ఇది దశార్ణదేశమునకు రాజధానిగా ఉండెడిది. సౌరాష్ట్రము :- కఠియావాడ్ ప్రాంతమునకును, గుజరాత్‌లోని కొంత భాగమునకును సౌరాష్ట్రమని పేరు ఉండెడిది. దీనికి ఆన్తరదేశ మని కూడ పేరు. ద్వారక దీని రాజధానిగా ఉండెడిది. కొంతకాలము వలభి కూడ రాజధానిగా ఉండెడిది. మాలవదేశము : నేటి మాలవా. అర్బుదము :- అరావలీపర్వత శ్రేణికి సంబంధించిన అబూపర్వతము రాజపుత్నాలో సిరోహీప్రాంతమున నున్నది. ఈ పర్వతము చుట్టుపక్కల నున్న భూభాగము అర్బుద దేశము. భృగుకచ్ఛము:- గుజరాతులోని 'బ్రోచ్' ప్రాంతము. దీనికే 'భడోచ్' అని కూడ పేరు.

మూ. తతశ్చ స దక్షిణాం దిశమాససాద యత్ర మలయ - మేకల - కున్తల - కేరల - పాలమఞ్జర - మహారాష్ట్ర - గఙ్గ - కలిఙ్గాదయో జనపదాః. తత్రాభి యుఞ్జానా తమౌమేయీతి సమానం పూర్వేణ. సా దాక్షిణాత్యా ప్రవృత్తిః. తాం తే మునయోఽభితుష్టువుః -

శ్లో॥ "ఆమూలతో వలితకున్తలచారుచూడ
శ్చూర్ణాలకప్రచయలాఞ్ఛితభాలభాగః,
కక్షానివేశనిబిడీకృతనీవిరేష
వేషశ్చిరం జయతి కేరలకామినీనామ్".



వ్యా. అచటినుండి అతడు, మలయ - మేకల - కున్తల - కేరల - పాల - మఞ్జర - మహారాష్ట్ర - గంగ - కలింగాదిదేశము లున్న దక్షిణదిశకు చేరెను. ఆతనిని వెన్నంటుచు వెళ్లిన ఆ ఉమాపుత్రి ఇత్యాదికము వెనుకటివలెనే. (ఆతనిని వశముచేసికొనుటకై వెన్నంటి వెళ్లిన ఆ ఉమాపుత్రి ఏ వేషమును ధరించెనో ఆ వేషమును అచటి స్త్రీలు కూడ ధరించిరి). అది దాక్షిణాత్యప్రవృత్తి. దానిని మునులు ఈ విధముగ స్తుతించిరి.

"కుదుళ్లనుంచి త్రిప్పి కట్టబడిన కుంతలములతో అందముగ నున్న శిరస్సు కలదియు, ముంగురుల సముదాయముచే అలంకృత మగు నుదురు కలదియు, బుజము క్రింద బిగించి వేసిన కోకముడి గలదియు అగు కేరళస్త్రీల వేషము చిరకాలము సర్వోత్కృష్టముగ నున్నది".

వి. మలయము :- మైసూరునుండి ట్రావన్‌కూరు వరకును వ్యాపించియున్న పర్వతశ్రేణి. మేకలము : వింధ్యపర్వతశ్రేణిలో ఒక భాగము. దీనికి అమరకంటక మని కూడ పేరు. నర్మదానది ఈ పర్వతప్రాంతమునుండియే జనించినది. కున్తలదేశము:- ఈ దేశము గోదావరీకృష్ణానదుల మధ్యభాగమున నున్నది. ఇది చోలదేశమునకు ఉత్తరముగ ఉండెడిది. దాని రాజధాని కల్యాణపురము. ఇది హైదరాబాదుకు వాయవ్యముగా నున్న దేశము. కర్ణాటదేశములోని కొంతభాగము, విదర్భప్రాంతము, కుంతలదేశముపాలనలో ఉండెడిది. కేరళదేశము :- నేటి మలబారు, కొచిన్, ట్రావన్‌కూర్ మండలములు కేరళదేశనామముతో ప్రసిద్ధములై యుండెడివి. ఇది కోంకణదేశములోని గోకర్ణక్షేత్రమునుండి కన్యాకుమారివరకు వ్యాపించి యుండెడిది. పాలదేశము : పాలమంజరదేశము అనునదీ ఒక్కదేశమా లేక పాలదేశము వేరు మంజరదేశము వేరా అనునది సంశయాస్పదము. మహోడ్ ప్రాంతదేశము పాలదేశ మని కొందరి అభిప్రాయము. మహారాష్ట్రము : నేటి మహారాష్ట్ర ప్రదేశము. రామాయణములో ఇది దండకారణ్యము. కలింగము : ఉత్తరమున ఒరిస్సా మొదలు దక్షిణమున గోదావరీ తీరము వరకును ఉన్న దేశము. 'దంతకూర్' దీని రాజధాని. దీనికే మహాభారతమున 'దంతపురము' అని పేరు. నేటి రాజమహేంద్రవరము దీని రాజధానిగా ఉండెడి దని కొందరు ఐతిహాసికుల అభిప్రాయము. గంగదేశము : కోయంబత్తూరు, సేలం జిల్లాలకు పూర్వము 'కొంగు' అను పేరు ఉండెడిదనియు, అదియే ఈ గంగదేశమనియు కొందరి అభిప్రాయము.

మూ. తామనురక్తమనాః స యన్నేపథ్యః సారస్వతేయ ఆసీదితి సమానం పూర్వేణ. సాపి యద్విచిత్రనృత్తగీతవాద్యవిలాసాదికమావిర్భావయామాస సా కైశికీ వృత్తిస్తాం తే మునయ ఇతి సమానం పూర్వేణ. యదత్యర్థం చ స తయా వశంవదీకృతః స్థానానుప్రాసవదసమాసం యోగవృత్తిఇచ్చ జగాద సా వైదర్భీ రీతిః. తాం తే మునయః ఇతి సమానం పూర్వేణ. తత్ర వేషవిన్యాసక్రమః ప్రవృత్తిః; విలాస - విన్యాసక్రమో వృత్తిః. వచనవిన్యాసక్రమో రీతిః.

వ్యా. ఆమెపై అనురాగముతో నిండిన మనస్సు గల ఆ సారస్వతేయుడు ఏ వేషమును ధరించెనో ఇత్యాదికము వెనుకటి వలెనే (ఆ వేషమునే అచటి పురుషులు ధరించిరి). ఆమె విచిత్రము లగు ఏ నృత్త - గీత - వాద్య - విలాసాదులను ఆవిష్కరించెనో అదియే కైశికీవృత్తి. దానిని మునులు ఇత్యాదికము పూర్వము వలెనే (దానిని మునులు స్తుతించిరి). పూర్తిగ ఆమెకు వశంవదు డైన ఆ సారస్వతేయుడు, నియతస్థానములందు అనుప్రాసము కలదియు, సమాసరహితమును, యోగవృత్తిగర్భమును (యౌగికపదభూయిష్ఠ మని యర్థము) అగు వాక్యమును పలికెను. అదియే వైదర్భీరీతి. 'మునులు దానిని' ఇత్యాదికము పూర్వమువలెనే (మునులు దానిని స్తుతించిరి). అందు వేషవిన్యాసపద్ధతికి ప్రవృత్తి యని పేరు. విలాసవిన్యాసక్రమమునకు వృత్తి యని పేరు. వచనవిన్యాసక్రమమునకు రీతి అని పేరు.

మూ. "చతుష్టయీ గతిర్వృత్తీనాం ప్రవృత్తీనాం చ : దేశానాం పునరానన్త్యమ్. తత్కథమివ కార్త్స్న్యేన పరిగ్రహః" ఇత్యాచార్యాః. "అనన్తానపి హి దేశాన్ చతుర్ధై వాకల్ప్య కల్పయన్తి. చక్రవర్తిక్షేత్రం సామాన్యేన. తదవాన్తరవిశేషైః పునరనన్తా ఏవ" ఇతి యాయావరీయః.

వ్యా. "వృత్తులును, ప్రవృత్తులును నాలుగేసి విధములు. దేశములో అనంతములు. అట్టి పరిస్థితులలో అన్ని దేశములకును సంబంధించిన వృత్త్యాదులను పూర్తిగ పరిగ్రహించుటకు ఎట్లు వీలగును?" అని ఆచార్యుల ఆక్షేపము. దేశము లనంతము లైనను వాటిని నాలుగు భాగములుగా విభజించి కల్పించుచుందురు. సామాన్యరూపమున చక్రవర్తిక్షేత్రము ఒక్కటే. అవాంతరవిశేషములను దృష్టిలో నుంచుకొని విభజించినచో (దేశము వలె వృత్త్యాదులు కూడ) అనంతములే"అని యాయావరీయుడు అనగా రాజశేఖరుడు (చెప్పుచున్నాడు).

మూ. దక్షిణాత్సముద్రాదుదీచీం దిశం ప్రతి యోజనసహస్రం చక్రవర్తిక్షేత్రమ్. తత్రైష నేపథ్యవిధిః. తతః పరం దివ్యాద్యా అపి యం దేశమధివసేయుస్తద్దేశ్యం వేషమాశ్రయన్తో నిబన్ధనీయాః. స్వభూమౌ తు కామచారః. ద్వీపాన్తరభవానాం తదనుసారేణ వృత్తిప్రవృత్తీ. రీతయస్తు తిస్రః; తాస్తు పురస్తాత్.

వ్యా. దక్షిణసముద్రమునుండి ఉత్తరపుదిక్కు వైపు వేయి యోజనముల భూభాగమునకు చక్రవర్తిక్షేత్ర మని పేరు. ఇంతవరకును చెప్పిన వేషవిధానము ఈ చక్రవర్తిక్షేత్రమునకు సంబంధించినది. దానిని దాటిన దేశమునకు సంబంధించిన, దివ్యపురుషాదులు కూడ ఏ దేశమును ఆశ్రయించి యుందురో ఆ దేశమునందలి వేషమును ధరించినట్లుగ వర్ణింపవలెను. (కాని ఆ దివ్యపురుషులు) తమ లోకములో నున్నపుడు మాత్రము (కవి వారి వేషభూషాదులను) తన ఇచ్ఛననుసరించి వర్ణింపవచ్చును. ద్వీపాంతరనివాసుల వృత్తిప్రవృత్తులను



ఆయా ద్వీపములలో నుండు విశేషముల ననుసరించి వర్ణింపవలెను. రీతులు మాత్రము మూడే. వాటిని గూర్చి ముమ్ముందు చెప్పగలము.

మూ. తత్రాస్తి మనోజన్మనో దేవస్య క్రీడావాసః విదర్భేషు, వత్సగుల్మం నామ నగరమ్. తత్ర సారస్వతస్తామౌమేయీం గన్ధర్వవత్ పరిణినాయ. తతస్తద్వధూవరం వినివృత్య తేషు ప్రదేశేషు విహరమాణం తుషారగిరిమేవాజగామ, యత్ర గౌరీ సరస్వతీ చ మిథః సమ్బన్ధిన్యౌ తస్థతుః. తౌ చ కృతవన్దనౌ దమ్పతీ దత్త్వాశిషం ప్రభావమయేన వపుషా కవిమానసనివాసినౌ చక్రతుః. తయోశ్చ కవిలోకస్వర్గసర్గం తమకల్ప (యే) తామ్; యత్ర కావ్యమయేన శరీరేణ మర్త్యమధివసన్తో దివ్యేన దేహేన కవయ ఆకల్పం మోదన్తే.

వ్యా. భగవంతు డగు మన్మథునికి క్రీడానివాస మైన వత్సగుల్మ మనెడు ఒక నగరము విదర్భదేశములో నున్నది. సారస్వతేయుడు ఆ నగరమున ఆ ఉమాపుత్రిని గాంధర్వవిధిచే వివాహ మాడెను. ఆ వధూవరులు అచటినుండి వెనుకకు మరలి, ఆ యా దేశములలో విహరించుచు హిమవత్పర్వతమును చేరిరి. వియ్యమందిన గౌరీసరస్వతులు అచటనే ఉండిరి. ఆ గౌరీసరస్వతులు, నమస్కరించిన దంపతులను ఆశీర్వదించి, వారు (ఆ దంపతులు) ప్రభావమయ మగు శరీరముతో కవిమానసమునందు నివసించు నట్లు చేసిరి. వారికొరకై ఒక కవిజనస్వర్గసృష్టి చేసిరి. కావ్యమయశరీరముతో భూలోకములో నివసించు కవులు దివ్యదేహముతో ఈ స్వర్గమునందు కల్పాంతమువరకును ఆనందించుచుందురు.

శ్లో।। ఇత్యేష కావ్యపురుషః పురా సృష్టః స్వయమ్భువా,
ఏవం విభజ్య జానానః ప్రేత్య చేహ చ నన్దతి. 9

**ఇతి రాజశేఖరకృతౌ కావ్యమీమాంసాయాం కవిరహస్యే ప్రథమేఽధికరణే తృతీయోఽధ్యాయః కావ్యపురుషోత్పత్తిః.**

వ్యా. ఈ విధముగ పూర్వము బ్రహ్మచే కావ్యపురుషుడు సృజింపబడెను. ఈ విధముగ వివేకపూర్వకముగ తెలిసికొనువాడు ఇహలోకమునందును, మరణానంతరము గూడ ఆనందించును.

వి. సారస్వతేయుని ఉత్పత్తిని గూర్చి వాయుపురాణ - మహాభారతములలో కూడ ఉన్నది; కాని అది కొంచెము భిన్నముగ నున్నది. దీనిని బాణభట్టు కూడ హర్షచరిత ప్రారంభమున చెప్పి యున్నాడు. రాజశేఖరు డా కథను కొంచెము స్వప్రయోజనానుకూలము లగు మార్పులతో ఇచట చేర్చినాడు. ఈ సారస్వతేయుడే కావ్యప్రవర్తకు డగు కావ్యపురుష డనియు తతడు ఉమాపుత్రి యగు సాహిత్యవిద్యావధువును వివాహ మాడె ననియు చెప్పుచు, ఇతడు, కావ్యములకును, తద్గుణదోషవిమర్శనాత్మక మగు అలంకారశాస్త్రమునకును గల

ఘనిష్ఠసంబంధమును సూచించినాడు. ఆయా ప్రాంతములలో ప్రచారములో నున్న వృత్తిరీత్యాదులభేదమును కూడ చక్కగ చిత్రించినాడు.

దృశ్యకావ్యములు, శ్రవ్యకావ్యములు అని కావ్యములు రెండు విధములు. దృశ్య కావ్యములలో నాట్యసంబంధ ముండును. నాట్యమునందే వేషవిన్యాసము, విలాసవిన్యాసము, వచనవిన్యాసము అను మూడు ప్రధానాంగము లుండును. వీటికి వరుసగ ప్రవృత్తి, వృత్తి, రీతి అని నామధేయములు. మూడవ దైన రీతి శ్రవ్యకావ్యములకు కూడ సాధారణము. ప్రాంతభేదము ననుసరించి ఈ వృత్తిరీత్యాదుల స్వరూప మెట్లుండునో, కావ్యపురుష - సాహిత్యవిద్యావధువుల వేష - భాషాదివర్ణన ద్వారా రాజశేఖరుడు ఈ ప్రకరణమున సూచించినాడు.

బాలానందినిలో తృతీయాధ్యాయము సమాప్తము.

# చతుర్థోఽధ్యాయః - పదవాక్యవివేకః

**మూ.** ద్వివిధం శిష్యమాచక్షతే యదుత బుద్ధిమానాహార్యబుద్ధిశ్చ. యస్య నిసర్గతః శాస్త్రమనుధావతి బుద్ధిః స బుద్ధిమాన్. యస్య చ శాస్త్రాభ్యాసః సంస్కురుతే బుద్ధిం అసావాహార్యబుద్ధిః.

**వ్యా.** బుద్ధిమంతు డనియు, ఆహార్యబుద్ధి యనియు శిష్యుడు రెండు విధములు. స్వభావముచేతనే (అప్రయత్నముగనే) శాస్త్రములలో ప్రవేశించు బుద్ధి గలవాడు బుద్ధిమంతుడు. శాస్త్రాభ్యాసముచే సుసంస్కారమును సంపాదించుకొనిన బుద్ధి కలవాడు ఆహార్యబుద్ధి.

**మూ.** త్రిధా చ సా - స్మృతిః, మతిః, ప్రజ్ఞేతి. అతిక్రాన్తార్థస్య స్మర్త్రీ స్మృతిః. వర్తమానస్య మన్త్రీ మతిః. అనాగతస్య ప్రజ్ఞాత్రీ ప్రజ్ఞా ఇతి. సా త్రిప్రకారాపి కవీనాముపకర్త్రీ.

**వ్యా.** స్మృతి, మతి, ప్రజ్ఞ అని ఆ బుద్ధి మూడు విధములు. గడచిపోయిన విషయములను స్మరించు బుద్ధి స్మృతి. జరుగుచున్న విషయమును తెలిసికొనగల్గు బుద్ధి మతి. రాబోవు విషయములను గ్రహింపగల్గునది ప్రజ్ఞ. ఈ మూడు విధముల బుద్ధియు కవులకు ఉపకరించును.

**మూ.** తయోర్బుద్ధిమాన్ శుశ్రూషతే, శృణోతి, గృహ్ణీతే, ధారయతి, విజానాతి, ఊహతే, అపోహతి, తత్త్వం చాభినివిశతే. ఆహార్యబుద్ధేరప్యేత ఏవ గుణాః; కిన్తు ప్రశాస్తారమపేక్షన్తే. ఆహరహః సుగురూపాసనా తయోః ప్రకృష్టో గుణః. సా హి బుద్ధివికాసకామధేనుః. తదాహుః :-



**వ్యా.** ఈ రెండు విధముల మనుష్యులలో బుద్ధిమంతుడు వినుటకు అభిలషించుచుండును; వినును, గ్రహించును; ధారణము చేయును, తెలిసికొనును, ఊహించును, ఆశంకలకు సమాధానము చెప్పును. యథార్థస్వరూపమునందు ఆస్థతో ఉండును. ఆహార్యబుద్ధికి గూడ ఈ గుణము లుండును. కాని ఆతనికి ఈ గుణములు అలవడుటకు ఉపదేష్ట యొక్క ఆవశ్యకత ఉండును. ప్రతిదినము సద్గురువును ఉపాసించుట వారిరువురికి ప్రకృష్టమగు గుణము. (గురూపాసన చేసినచో వారికి ఇంకను మంచి దని యర్థము). ఆ గురూపాసన బుద్ధివికాసము కలిగించుటలో కామధేనువు కదా? ఈ విషయమునే ఇట్లు చెప్పుదురు :-

**శ్లో॥ ప్రథయతి పురః ప్రజ్ఞాజ్యోతిర్యథార్థపరిగ్రహే**
**తదను జనయత్యూహాపోహక్రియావిశదం మనః,**
**అభినివిశతే తస్మాత్తత్త్వం తదేకముఖోదయం**
**సహ పరిచయో విద్యావృద్ధైః క్రమాదమృతాయతే.** 1

**వ్యా.** విద్యావృద్ధులతో పరిచయము, ముందుగా ప్రజ్ఞాజ్యోతిని వికసింపచేసి యథార్థగ్రహణశక్తిని కలిగించును. పిమ్మట మనస్సును, ఊహాపోహలు చేయుటచే (శంకాసమాధానములు చేయుటచే) పరిశుద్ధ మైనదానినిగ చేయును. ఇట్టి విశదత్వము లభించుటచే మనస్సు ఏకాగ్రమై తత్త్వమును గ్రహించును. ఈ విధముగ విద్యావృద్ధుల సహవాసము క్రమముగ అమృతమువంటి దగును.

వి. ఒక విషయమునకు సంబంధించిన మంచిచెడుగుల నన్నింటిని బాగుగ పరిశీలించుట ఊహాపోహము.

**మూ.** తాభ్యామన్యథా బుద్ధిర్దుర్బుద్ధిః. తత్ర బుద్ధిమతః ప్రతిపత్తిః. స ఖలు సకృదభిధానప్రతిపన్నార్థః కవిమార్గం మృగయితుం గురుకులముపాసీత. ఆహార్యబుద్ధేస్తు ద్వయమప్రతిపత్తిః సన్దేహశ్చ. స ఖల్వప్రతిపన్న మర్థం ప్రతిపత్తుం సన్దేహం చ నిరాకర్తుమాచార్యానుపతిష్ఠేత.

**వ్యా.** ఈ ఇరువురికంటెను భిన్నమైన బుద్ధి కలవాడు దుర్బుద్ధి. వీరిలో బుద్ధిమంతునకు విషయగ్రహణము బాగుగ నుండును. అతడు ఒక్కమారు చెప్పినంతనే విషయమును గ్రహించును. అతడు కవిమార్గమును అన్వేషించుటకై గురుకులమును సేవించవలెను. ఆహార్యబుద్ధికి విషయ అగ్రహణము, సందేహము రెండును ఉండును. తెలియని విషయమును గ్రహించుటకును, సందేహములను తొలగించుకొనుటకును ఆతడు ఆచార్యులను సేవించవలెను.

**మూ.** దుర్బుద్ధేస్తు సర్వత్ర మతివిపర్యాస ఏవ. స హి నీలమేచకితసిచయ కల్పః, అనాధేయగుణాన్తరత్వాత్. తం యది సారస్వతోఽనుభావః ప్రసాదయతి తమౌపనిషదికే వక్ష్యామః.

**వ్యా.** దుర్బుద్ధికి అంతటను మతివిపర్యాసమే. (అతని బుద్ధి ఎల్లప్పుడును విపరీతము గనే పనిచేయుచుండును). క్రొత్త గుణములను వేటిని అతనిలో కల్పించుటకు శక్యము కాదు. అందుచే అతడు నీలిమందుతో నల్లగా తయారుచేసిన వస్త్రము వంటివాడు. సరస్వతీ ప్రసాదవిశేషము ఆతనిలో కూడ కొంత మంచిని కలిగించునా అను విషయమును 'ఔపనిషదిక' ప్రకరణములో చెప్పగలము.

**వి.** రాజశేఖరుడు ఈ ఔపనిషద ప్రకరణమున, మంత్రజపదేవతానుగ్రహాదులచే కవిత్వశక్తిని సంపాదించు ఉపాయములను వివరించి యుండును. అది లభ్యము కాదు.

**మూ.** "కావ్యకర్మణి కవేః సమాధిః పరం వ్యాప్రియతే" ఇతి శ్యామదేవః. మనస ఏకాగ్రతా సమాధిః. సమాహితం చిత్తమర్థాన్ పశ్యతి. ఉక్తఞ్చ :-

శ్లో॥ "సారస్వతం కిమపి తత్సుమహారహస్యం
యద్గోచరే చ విదుషాం నిపుణైకసేవ్యమ్,
తత్సిద్ధయే పరమయం పరమోఽభ్యుపాయః
యచ్చేతసో విదితవేద్యవిధేః సమాధిః". 2

**వ్యా.** "కావ్యరచనావిషయమున కవికి సమాధియే అధికముగ ఉపయుక్తమగును" అని శ్యామదేవుని అభిప్రాయము. సమాధి యనగా మనస్సుయొక్క ఏకాగ్రత. ఏకాగ్ర మగు మనస్సు విషయములను బాగుగ గ్రహించును. కావుననే ఇట్లు చెప్పుదురు :-

"ఆ సారస్వతతత్త్వము వర్ణింప శక్యము కాని, మహారహస్యము. విద్వాంసులు మాత్రమే తెలియదగిన ఆ తత్త్వము కేవలము నిపుణులచేత మాత్రమే సేవింపదగినది. ఆ సారస్వతతత్త్వము సిద్ధింపవలె నన్నచో, విదితవేద్య మగు (తెలియదగిన విషయము లన్నియు తెలిసిన) మనస్సుయొక్క ఏకాగ్రత ఒక్కటియే పరమోపాయము."

**మూ.** 'అభ్యాస' ఇతి మంగలః. అవిచ్ఛేదేన శీలనమభ్యాసః. స హి సర్వత్ర నిరతిశయం కౌశలమాధత్తే. "సమాధిరాన్తరః ప్రయత్నో బాహ్యస్త్వభ్యాసః. తావుభావపి శక్తిముద్భాసయతః. సా కేవలం కావ్యే హేతుః" ఇతి యాయావరీయః.

**వ్యా.** (కవికి కావ్యనిర్మాణమున ఉపకరించునది) అభ్యాస మని మంగలుని అభిప్రాయము. నిరంతరము కావ్యపరిశీలనమునకు అభ్యాస మని పేరు. అది (అభ్యాసము) సర్వవ్యాప్తమై (అన్ని విషయములను ఆకలించు కొనునదై) అన్నిటియందు అత్యధిక మగు నేర్పును కలిగించును. "సమాధి మానసిక మగు ప్రయత్నము. అభ్యాస మనునది బాహ్య ప్రయత్నము. ఈ సమాధ్యభ్యాసములు రెండును శక్తిని వికసింప చేయును. కేవలము ఆ శక్తి మాత్రమే కావ్యమునకు హేతువు" అని యాయావరీయుడు చెప్పుచున్నాడు.



**మూ.** విప్రసృతిశ్చ సా ప్రతిభావ్యుత్పత్తిభ్యామ్. శక్తిహేతుకే హి ప్రతిభావ్యుత్పత్తికర్మణీ. శక్తస్య ప్రతిభాతి శక్తశ్చ వ్యుత్పద్యతే. యా శబ్దగ్రామమ్ అర్థసార్థమ్, అలఙ్కారతన్త్రమ్, అన్యదపి తథావిధ మధిహృదయం ప్రతిభాసయతి సా ప్రతిభా. అప్రతిభస్య పదార్థసార్థః పరోక్ష ఇవ. ప్రతిభావతః పునరపశ్యతోఽపి ప్రత్యక్ష ఇవ. యతో మేధావిరుద్రకుమారాదయో జాత్యన్ధాః కవయః శ్రూయన్తే.

**వ్యా.** అది (శక్తి) ప్రతిభావ్యుత్పత్తులచే విశిష్టమైన ప్రసారము కలది. (ప్రతిభావ్యుత్పత్తుల ద్వారా శక్తి బాగుగ ప్రసరించును; అనగా శక్తియే ప్రతిభావ్యుత్పత్తుల రూపమున ప్రసరించు నని అర్థము). ఏల నన ప్రతిభావ్యుత్పత్తి కర్మలు శక్తియే కర్తగా కలవి. (ప్రతిభా వ్యుత్పత్తుల కర్త శక్తియే). శక్తి కలవానికే ప్రతిభానము కలుగును. శక్తి కలవానికే వ్యుత్పత్తి కూడ కలుగును. శబ్దసముదాయమును, అర్థసంఘాతమును, అలంకారమర్యాదను, చెప్పెడు విధానమును, ఈ విధము లగు ఇతరవిషయములను హృదయమునందు భాసింపచేయునది ప్రతిభ. ప్రతిభ లేనివానికి పదార్థసముదాయ మంతయు పరోక్షము వలె నుండును. ప్రతిభావంతునకు మాత్రము, ఆతడు చూడకున్నను, ప్రత్యక్షమువలె నుండును. ఏల అన మేధావిరుద్ర - కుమారదాసాదికవులు జాత్యంధు లని వినవచ్చు చున్నది.

**మూ.** కిఞ్చ న మహాకవయోఽపి దేశద్వీపాన్తరకథాపురుషాదిదర్శనేన తత్రత్యాం వ్యవహృతిం నిబధ్నన్తి స్మ. తత్ర దేశాన్తరవ్యవహారః :-

**వ్యా.** మహాకవులు గూడ దేశాంతరములకును ద్వీపాంతరములకును సంబంధించిన కథలను, అచ్చట నున్న పురుషాదులను చూచి అచ్చటి వ్యవహారమును కూర్చలేదు. అనగా అచటి విషయములను వేటిని స్వయముగ చూడకున్నను కూర్చిరని అర్థము.

దేశాంతరవ్యవహారమునకు ఉదాహరణము :- (ఈ శ్లోకము అభిజ్ఞానశాకున్తలములో మేరుపర్వతముపై నున్న మారీచముని్యాశ్రమవర్ణనఘట్టములోనిది).

శ్లో॥ "ప్రాణానామనిలేన వృత్తిరుచితా సత్కల్పవృక్షే వనే
తోయే కాఞ్చనపద్మరేణుకపిశే పుణ్యాభిషేకక్రియా,

**ధ్యానం రత్నశిలాగృహేషు విబుధస్త్రీసన్నిధౌ సంయమః**
**యత్కాఙ్క్షన్తి తపోభిరన్యమునయస్తస్మింస్తపస్యన్త్యమీ."** 3

వ్యా. "ఉత్తమ మైన కల్పవృక్షములు కల వనమునందు గాలి మాత్రమును ఆహారముగా గ్రహించి ప్రాణధారణము చేయుట అలవాటుగా నున్నది. బంగారు పద్మముల పుప్పొడిచే కపిశవర్ణముతో నున్న ఉదకమునందు పుణ్యస్నానము. రత్నశిలాగృహములయందు ధ్యానము. దేవతాస్త్రీల (అప్సరస్త్రీల) సన్నిధిలో సంయమము. ఇతర మునులు తపస్సు చేసి ఏ స్థానమును పొందవలె నని అభిలషింతురో ఆ స్థానమునందు వీరు తపస్సు చేయుచున్నారు."

వి. ఇచట కవి తానెన్నడు చూడని దేవర్షుల తపస్సును ప్రత్యక్షముగ చూచినట్లుగ, చక్కగ వర్ణించినాడు.

మూ. ద్వీపాన్తరవ్యవహారః.

శ్లో॥ **"అనేన సార్ధం విహరామ్బురాశేస్తీరేషు తాలీవనమర్మరేషు**
**ద్వీపాన్తరానీతలవఙ్గపుష్పైరపాకృతస్వేదలవా మరుద్భిః".** 4

వ్యా. ద్వీపాంతరవ్యవహారవర్ణన మెట్లనగా -

(ఈ శ్లోకము రఘువంశమునందలి ఇందుమతీస్వయంవరఘట్టములోనిది. సునంద ఇందుమతిని దక్షిణదేశరాజు వద్దకు తీసికొనివెళ్ళి ఆతనిని వివాహమాడినచో ఎట్లు సుఖించ వచ్చునో చెప్పుచున్నది) :-

"ద్వీపాంతరమునుండి లవంగపుష్పములను తీసికొనివచ్చెడు చల్లగాలులచే తొలగింప బడిన చెమట బిందువులు కలదానవై తాలవృక్షవనము లుండుటచే మర్మరధ్వనిచేయుచున్న సముద్రతీరములందు ఈతనితో కూడ విహరింపుము."

వి. దక్షిణదేశమునకు అవతలి ద్వీపమైన లంకలో లవంగలతాదు లున్నట్లును, (ద్వీపాంతరమువలె) సుదూరమైన దక్షిణసముద్రతీరమున తాళీవనాదు లున్నట్లును వర్ణించుటచే ఇది కవికి గల ద్వీపాన్తరవ్యవహారజ్ఞానమును సూచించుచున్నది.

మూ. కథాపురుషవ్యవహారః :-

శ్లో॥ **"హరోऽపి తావత్పరివృత్తధైర్యః చన్ద్రోదయారమ్భ ఇవామ్బురాశిః,**
**ఉమాముఖే బిమ్బఫలాధరోష్ఠే వ్యాపారయామాస విలోచనాని".** 5

శ్లో॥ **"తథాగతాయాం పరిహాసపూర్వం సఖ్యాం సఖీ వేత్రభృదాబభాషే,**
**బాలే వ్రజామోऽన్యత ఇత్యథైనాం వధూరసూయాకుటిలం దదర్శ"** 6



వ్యా. కథాపురుషవ్యవహారము అనగా కథలో నున్న వ్యక్తులను కండ్లకు కట్టి నట్లు వర్ణింప గలిగిన ప్రతిభ. మొదటి శ్లోకము కుమారసంభవమున తృతీయసర్గలోనిది. తపస్సు చేయుచున్న శివునికి పార్వతియందు ప్రేమను కలిగించుటకై మన్మథుడు ప్రయత్నించుచు బాణప్రయోగమునకు అవకాశమునకై పొంచియుండును. అంతలో పార్వతి శివుని సమీపించి పుష్పములను సమర్పించును. ఇదే సమయ మని మన్మథుడు అస్త్రప్రయోగము చేయగా శివుని మనస్సు చలించును. "చంద్రోదయప్రారంభమున సముద్రము వలె, శివుడు కూడ కొంచెము చలించిన ధైర్యము కలవాడై, బింబఫలము వంటి అధరోష్ఠము గల ఉమాముఖము నందు నేత్రములను ప్రసరింపచేసెను."

రెండవ శ్లోకము రఘువంశమునందలి ఇందుమతీస్వయంవరవర్ణనఘట్టములోనిది. సునంద స్వయంవరమునకు వచ్చిన రాజుల నందరిని ఒక్కొక్కరుగ ఇందుమతికి పరిచయము చేయుచుండెను. ఆమె ఒక్కొక్కరినీ కాదని ముందుకు సాగుచుండెను. అజుని దగ్గరకు చేరిన పిమ్మట సునంద అతని పరిచయము చేసెను. ఆతనిని వరింపవలె ననెడు అభిప్రాయ ములో ఇందుమతి ముందుకు సాగకుండగా అచటనే నిలచి తటపటాయించుచుండెను. ఆమె భావమును గ్రహించినది సునంద. "ఇందుమతి అట్టి పరిస్థితిలో నుండగా "బాలా! ముందుకు సాగుదమా?" అని పరిహాసపూర్వకముగ సునంద పలికెను. అపుడు ఆ వధువు ఆమె వైపు కోపముతో వక్రముగ చూచెను."

పై రెండు శ్లోకములందును కవి ఆ యా వ్యక్తులను కంటికి కట్టి నట్లు అతిమనోహ రముగ చిత్రించె ననగా ఇందుకు ప్రతిభయే కారణము.

మూ. సా చ ద్విధా - కారయిత్రీ భావయిత్రీ చ. కవేరుపకుర్వాణా కారయిత్రీ. సాపి త్రివిధా సహజా, ఆహార్యా, ఔపదేశికీ చ. జన్మాన్తరసంస్కారాపేక్షిణీ సహజా. జన్మసంస్కారయోనిరాహార్యా. మన్త్రతన్త్రాద్యుపదేశప్రభవా ఔపదేశికీ. ఐహికేన కియతాపి సంస్కారేణ ప్రథమాం తాం సహజేతి వ్యపదిశన్తి. మహతా పునరాహార్యా. ఔపదేశిక్యాః పునరైహిక ఏవోపదేశకాలః; ఐహిక ఏవ సంస్కారకాలః.

వ్యా. కారయిత్రి, భావయిత్రి అని ఆ ప్రతిభ రెండు విధములు. కవికి ఉపకరించునది, అనగా కవిచేత కావ్యములు వ్రాయించునది, కారయిత్రి. ఆ కారయిత్రి ప్రతిభ కూడ సహజ, ఆహార్య, ఔపదేశికి అని మూడు విధములు. జన్మాంతరసంస్కారముచే లభించినది సహజ. జన్మతః వచ్చి శాస్త్రాభ్యాసాదిసంస్కారమువలన కూడ కలిగినది ఆహార్యప్రతిభ. మంత్రతంత్రాద్యుపదేశములవలన కలిగినది ఔపదేశికి. మొదటి దగు సహజప్రతిభకు ఐహిక మగు సంస్కారము చాల కొద్దిగ చేయవలసి యుండును. ఈ సంస్కారము అతి స్వల్పము గాన దీనిని సహజ యందురు. శాస్త్రాభ్యాసాదిసంస్కారము అత్యధికముగ

చేయవలసి యున్నచో అది ఆహార్యప్రతిభ, అనగా దానిలో జన్మతః లభించినది స్వల్పము సంస్కారమువల్ల లభించినది అధికము. మొదటిదానిలో జన్మతః లభించినది అధికము సంస్కారముచే లభించినది స్వల్పము. ఔపదేశికప్రతిభ ఇహలోకమున (ఈ జన్మలో) జరిగిన ఉపదేశాదులవలననే జనించును; సంస్కారము కూడ ఇహలోకమునందే చేయబడును.

మూ. త ఇమే త్రయోఽపి కవయః సారస్వతః, ఆభ్యాసికః, ఔపదేశికశ్చ. జన్మాన్తరసంస్కారప్రవృత్తసరస్వతీకో బుద్ధిమాన్ సారస్వతః. ఇహ జన్మాభ్యాసోద్భాసిత భారతీక ఆహార్యబుద్ధిరాభ్యాసికః. ఉపదేశదర్శితవాగ్విభవో దుర్బుద్ధిరౌపదేశికః. "తస్మాన్నే తరౌ తన్త్రశేషమనుతిష్ఠతామ్. న హి ప్రకృతిమధురా ద్రాక్షా ఫాణితసంస్కారమపేక్షతే" ఇత్యాచార్యాః. 'న' ఇతి యాయావరీయః; "ఏకార్థం హి క్రియాద్వయం ద్వైగుణ్యాయ సమ్పద్యతే".

వ్యా. సహజము, ఆహార్యము, ఔపదేశికము అను మూడు విధములగు కారయిత్రీ ప్రతిభను అనుసరించి, సారస్వతులు, ఆభ్యాసికులు, ఔపదేశికులు అని కవులు మూడు విధములుగ నుందురు. జన్మాంతరసంస్కారముచే ప్రవర్తించిన సరస్వతి గల బుద్ధిమంతు డగు కవి 'సారస్వతుడు'. ఈ జన్మలో చేసిన అభ్యాసముచే వికసించిన సరస్వతి కల ఆహార్యబుద్ధి (మెరుగు పెట్టవలసిన బుద్ధికలవాడు) అభ్యాసికుడు. (మంత్రతంత్రాదుల) ఉపదేశముచే వాగ్వైభవమును చూపగలిగిన దుర్బుద్ధి (మందబుద్ధి) ఔపదేశికుడు. "మొదటి రెండు తరగతులకును చెందినవారు తంత్రమంత్రాద్యనుష్ఠానము చేయవలసిన పని లేదు. స్వభావతః మధుర మగు ద్రాక్షకు మామూలు బెల్లముతో చేయు సంస్కారముయొక్క ఆవశ్యకత ఉండదు కదా?" అని ఆచార్యుల అభిప్రాయము. "ఇట్లు చెప్పుట యుక్తము కాదు. ఒకే ప్రయోజనమును ఉద్దేశించి రెండు క్రియలు చేసినచో ఫలము రెట్టింపు లభించును కదా?" అని యాయావరీయుని అభిప్రాయము.

మూ. "తేషాం పూర్వ పూర్వః శ్రేయాన్" ఇతి శ్యామదేవః. యతః :-

శ్లో॥ "సారస్వతః స్వతన్త్రః స్యాద్భవేదాభ్యాసికో మితః,
ఔపదేశకవిస్త్వత్ర వల్గు ఫల్గు చ జల్పతి". 7

వ్యా. వీరిలో పూర్వపూర్వుడు గొప్పవాడు. ఔపదేశికునికంటె ఆహార్యబుద్ధి, ఆహార్య బుద్ధికంటె సారస్వతుడు గొప్పవాడు, అని శ్యామదేవుని అభిప్రాయము. ఏలననగా -

"సారస్వతకవి స్వతంత్రుడై రచనలు చేయగలడు. ఆభ్యాసికకవి కొన్ని పరిధులలో సీమితుడై, సీమితమైన రచనలు మాత్రమే చేయగలుగును. ఔపదేశికకవి పలుకులు సుందరముగనే ఉండును గాని సారరహితముగ ఉండును"



మూ. "ఉత్కర్షః శ్రేయాన్" ఇతి యాయావరీయః. స చ అనేకగుణసంనిపాతే భవతి. కిఞ్చ :-

శ్లో॥ "బుద్ధిమత్త్వం చ కావ్యాఙ్గవిద్యాస్వభ్యాసకర్మ చ,
కవేశ్చోపనిషచ్ఛక్తిస్త్రయమేకత్ర దుర్లభమ్." 8

శ్లో॥ "కావ్యకావ్యాఙ్గవిద్యాసు కృతాభ్యాసస్య ధీమతః,
మన్త్రానుష్ఠాననిష్ఠస్య నేదిష్ఠా కవిరాజతా". 9

వ్యా. ఉత్కర్షము మంచిది అని యాయావరీయుని అభిప్రాయము. అది (ఉత్కర్ష), అనేక గుణముల కలయికవలన కలుగును. అనగా సారస్వతాదిభేదములను పట్టి కవుల తారతమ్యమును నిర్ణయించుట యుక్తము కాదు. అనేక సద్గుణములు ఎవనియందు కలిసి యుండునో ఆతడు ఉత్తముడు. ఆ గుణములు ఎట్లు వచ్చినవి అను విషయము అప్రధానము అని అభిప్రాయము.

"కవికి – సహజబుద్ధి, కావ్యాంగము లగు విద్యల అభ్యాసము, మంత్రతంత్రాదిజన్య మగు దైవశక్తి అనునవి ఆవశ్యకములు. ఈ మూడును ఒకనియందు లభించుట కష్టము."

"సహజబుద్ధి కలిగియుండి, కావ్యాంగవిద్యల అభ్యాసము చేయుచు, మంత్రానుష్ఠాన నిష్ఠ గూడ కల కవికి కవిరాజత్వము అతి సమీపమున నుండును. అనగా అట్టివాడు 'కవిరాజు' అగును."

మూ. కవీనాం తారతమ్యతశ్చైష ప్రాయోవాదః.

శ్లో॥ "ఏకస్య తిష్ఠతి కవేర్గృహ ఏవ కావ్య
మన్యస్య గచ్ఛతి సుహృద్భవనాని యావత్,
న్యస్యావిదగ్ధవదనేషు పదాని శశ్వత్
కస్యాపి సఞ్చరతి విశ్వకుతూహలీవ". 10

వ్యా. కవులలో నున్న తారతమ్యమును బట్టి సాధారణముగ ఈ విధముగ చెప్పుట కలదు :-

"ఒక కవి రచించిన కావ్యము అతని ఇంటిలోనే ఉండును. మరొక కవి వ్రాసిన కావ్యము మిత్రుల గృహముల వరకు పోవును. ఒక్కొక్కని కవిత్వము, ప్రపంచయాత్ర చేయుటకు కుతూహలము కలదా అన్నట్లు, అవిదగ్ధుల (కావ్యరచనాపాటవము లేనివారి) ముఖములందు పదములను ఉంచుచు, ఎల్లప్పుడును సంచరించుచుండును. (అనగా

ఈతని కవిత్వము ప్రచురప్రచారము కలదగుటచే కొంచమో, గొప్పగనో, సామాన్య విద్యావంతులు కూడ దీనిని చదువుచుందురు. అందుచే వారి ముఖముపై పదము లుంచి (పదములు అనగా అడుగులు అని కూడ అర్థము) ఇది విశ్వపరిభ్రమణము చేయును).

మూ. సేయం కారయిత్రీ. భావకస్యోపకుర్వాణా భావయిత్రీ. సా హి కవేః శ్రమమభిప్రాయం చ భావయతి. తయా ఖలు ఫలితః కవేర్వ్యాపారతరురన్యథా సోఽవకేశీ స్యాత్. "కః పునరనయోర్భేదో యత్కవిర్భావయతి భావకశ్చ కవిః" ఇత్యాచార్యాః. తదాహుః :-

శ్లో॥ ప్రతిభాతారతమ్యేన ప్రతిష్ఠా భువి భూరిధా,
భావకస్తు కవిః ప్రాయో న భజత్యధమాం దశామ్". 11

వ్యా. ఇంతవరకును చెప్పినది కారయిత్రి అను ప్రతిభ. భావకునికి ఉపకరించు ప్రతిభ భావయిత్రి. కవియొక్క వ్యాపార మనెడు వృక్షము ఈ భావయిత్రి ఉన్నపుడే ఫలించును. లేకున్నచో ఆ వృక్షము పుష్పఫలశూన్య మగును. "కవి యైనవాడు భావన చేయవచ్చును. భావకుడు కవి కావచ్చును. అట్టి పరిస్థితిలో కవి-భావకులకు గాని, భావయిత్రీ-కారయిత్రీ రూపప్రతిభలకు గాని భేద మేమి?" అని ఆచార్యుల మతము. కావుననే ఇట్లు చెప్పబడినది.

"ప్రతిభాతారతమ్యమును బట్టి భూమిపై అనేకవిధముల ప్రతిష్ఠ కలుగును. భావకుడైన కవి సాధారణముగ అధమదశను పొందడు."

మూ. 'న' ఇతి కాలిదాసః. 'పృథగేవ హి కవిత్వాద్భావకత్వమ్, భావకత్వాచ్చ కవిత్వమ్, స్వరూపభేదాద్విషయభేదాచ్చ. యదాహుః -

శ్లో॥ "కశ్చిద్వాచం రచయితుమలం శ్రోతుమేవాపరస్తాం
కల్యాణీ తే మతిరుభయథా విస్మయం న స్తనోతి,
న హ్యేకస్మిన్నతిశయవతాం సన్నిపాతో గుణానా -
మేకః సూతే కనకముపలస్తత్పరీక్షాక్షమోఽన్యః". 12

వ్యా. "ఇట్లు చెప్పుట యుక్తము కాదు,' అని కాళిదాసు అభిప్రాయము. ఏలనన - కవిత్వ - భావకత్వముల స్వరూపము వేరు, వాటి విషయము కూడ వేరు. అందుచే కవిత్వముకంటె భావకత్వము భిన్న మైనది. కావుననే ఈ విధముగ చెప్పుచున్నారు;

"ఒకడు వాక్కును (కవిత్వమును) రచించుటకు మాత్రమే సమర్థుడు; మరి యొకడు దానిని వినుటకు (విని అభినందించుటకు) మాత్రమే సమర్థుడు. ఉత్తమ మైన నీ బుద్ధి రెండు విధములుగను కూడ మాకు ఆశ్చర్యమును కలిగించుచున్నది. ఉత్తమగుణములకు



ఒకే స్థానమున కలయిక ఉండదు కదా? బంగారము ఉత్పత్తి చేసెడి శిల ఒకటి, దాని పరీక్షణము చేయు శిల మరి యొకటి."

మూ. "తే చ ద్విధా- అరోచకినః; సతృణాభ్యవహారిణశ్చ" ఇతి మఙ్గలః. 'కవయోఽపి భవన్తి' ఇతి వామనీయాః. 'చతుర్ధా' ఇతి యాయావరీయః; మత్సరిణః, తత్త్వాభినివేశినశ్చ. "తత్ర వివేకినః పూర్వే; తద్విపరీతాస్తు తతోఽనన్తరాః"ఇతి వామనీయాః.

వ్యా. "వారు (భావకులు) అరోచకులు, సతృణాభ్యవహారులు అని రెండు విధములు" అని మంగలుని అభిప్రాయము. కవులలో కూడ అరోచకులు, సతృణాభ్యవహారులు అను రెండు విధములవా రుందు రని వామనమతానుయాయులు అందురు. మత్సరవంతులు, తత్త్వాభినివేశము (బాగుగ విమర్శించి యథార్థము కనుగొనవలె నను ఆస్థ) కలవారు అను మరి రెండు విధములు కూడ చేర్చుటచే నాలుగు విధము లని యాయావరీయుని అభిప్రాయము. గుణదోషవివేకము కలవారు అరోచకులు, అట్టి వివేకము లేనివారు సతృణాభ్యవహారులు అని వామనమతానుయాయులు చెప్పుదురు. (ఎంతటి ఉత్తమరచన నైనను అరోచకులు అంత తేలికగా మెచ్చరు. సతృణాభ్యవహారులు అన్నింటిని మెచ్చుకొందురు).

మూ. "అరోచకితా హి తేషాం నైసర్గికీ, జ్ఞానయోనిర్వా. నై సర్గికీం హి సంస్కారశతేనాపి వఙ్గమివ కాలికాం తే న జహతి. జ్ఞానయోనౌ తు తస్యాం విశిష్టజ్ఞేయవతి వచసి రోచకితావృత్తిరేవ" ఇతి యాయావరీయః.

వ్యా. వారి అరోచకిత్వము (ఏ రచనను మెచ్చకుండుట) స్వభావసిద్ధముగ నుండవచ్చును లేదా జ్ఞానమువలన కలగవచ్చును. (అనగా అనేకగ్రంథపఠనవంతు లగువారు అత్యుత్తమరచనలనే మెచ్చుకొందురు కాని అన్నింటిని మెచ్చుకొనరు). మొదటి తరగతికి చెందినవారు సహజసిద్ధ మగు అరోచకితను వంగము (సీసము) నలుపునువలె, ఎన్ని సంస్కారములు చేసినను విడువరు. కాని ఈ అరోచకిత జ్ఞానమువలన ప్రాప్తించిన దైనచో అట్టివారు విశిష్ట మగు జ్ఞేయము గల వాక్కునందు, అనగా ఉత్తమవిషయము గల రచనయందు, రోచకితనే కలిగి యుందురు; (దానిని మెచ్చుకొందురు) అని యాయావరీయుని అభిప్రాయము.

మూ. కించ సతృణాభ్యవహారితా సర్వసాధారణీ. తథా హి : వ్యుత్పిత్సోః కౌతుకినః సర్వస్య సర్వత్ర ప్రథమం సా. ప్రతిభావివేకవికలతా హి న గుణాగుణయోర్విభాగసూత్రం పాతయతి. తతో బహు త్యజతి; బహు చ గృహ్ణాతి. వివేకానుసారేణ హి

బుద్ధయో మధు నిష్యన్దన్తి. పరిణామే తు యథార్థదర్శీ స్యాత్. విభ్రమభ్రంశశ్చ నిః శ్రేయసం సన్నిధత్తే.

వ్యా. మరియు సతృణాభ్యవహారిత అనునది (మొదట) అందరికిని సమముగ నుండును. ఏలనన వ్యుత్పత్తి సంపాదించుకొనవలె నని అభిలషించు కుతూహలవంతునకు ప్రతివానికిని ప్రారంభమున అన్ని విషయములందును అది, అనగా సతృణాభ్యవహారిత, ఉండును. అనగా ప్రారంభదశలో అతడు ఒక్కటైన మిగల్చకుండ అన్ని విషయములను స్వీకరించును. ప్రతిభావివేకములు లేకున్నచో ఇది గుణము, ఇది కాదు అనెడు విభాగము స్పష్టముగ తెలియదు. అటు పిమ్మట (కొంతకాలము ఈ విధముగ సతృణాభ్యవహారిగ నున్న పిమ్మట) చాల విషయములను (నిస్సార మైనవాటిని) విడచి, (సారవంతము లగు) చాలవిషయములను గ్రహించును. బుద్ధులు వివేకానుసారముగా తేనె లొలుకును కదా? ఈ విధముగ, బుద్ధిపరిణామము లభించిన తరువాత (బుద్ధి పరిపక్వమైన తరువాత) యథార్థమును గ్రహించును. భ్రాంతి తొలగిపోయినచో శ్రేయస్సు లభించును.

మూ. మత్సరిణస్తు ప్రతిభాతమపి న ప్రతిభాతమ్; పరగుణేషు వాచంయమత్వాత్. స పునరమత్సరీ జ్ఞాతా చ విరలః. తదుక్తమ్ :-

శ్లో॥ కస్త్వం భోః ! కవిరస్మి కావ్యభినవా సూక్తిః సఖే పఠ్యతామ్
త్యక్తా కావ్యకథైవ సమ్ప్రతి మయా కస్మాదిదం శ్రూయతామ్,
యః సమ్యగ్వివినక్తి దోషగుణయోః సారం స్వయం సత్కవిః
సో౽స్మిన్ భావక ఏవ నాస్త్యథ భవేద్దైవాన్న నిర్మత్సరః". 13

వ్యా. మత్సరవంతుడు విషయమును గ్రహించినను గ్రహించనట్లే. ఏలనన అతడు పరగుణముల విషయమున వాక్సంయమముతో నుండును. (పరగుణములను ప్రశంసింప జాలడు). గుణగ్రహణశక్తి యుండి మాత్సర్యము లేనివాడు చాల విరలముగ లభించును. కావుననే ఇట్లు చెప్పబడినది :-

"ఓయీ ! నీవెవరవు?" "కవిని", "మిత్రమా ! ఏదైన ఒక క్రొత్త రచన చదువుము." "నేనీ మధ్య కావ్యము మాటయే విడిచిపెట్టినాను". "అ దెందువలన?" "ఇదిగో చెప్పుచున్నాను; వినుము. తాను సత్కవియై యుండి గుణ-దోషముల సారమును బాగుగ వివేచించి గ్రహింపగల భావకుడే ఈ నాడు లేడు. అథవా దైవవశముచే ఎవడైన ఒకడున్నను, ఆతడు మాత్సర్యహీనుడుగ ఉండడు."

మూ. తత్త్వాభివేశీ తు మధ్యేసహస్రం యద్యేకః. తదుక్తమ్ :-



శ్లో॥ "శబ్దానాం వివినక్తి గుమ్భనవిధీనామోదతే సూక్తిభిః
సాన్ద్రం లేఢి రసామృతం విచినుతే తాత్పర్యముద్రాం చ యః,
పుణ్యైః సంఘటతే వివేక్తృవిరహాదన్తర్ముఖం తామ్యతాం
కేషామేవ కదాచిదేవ సుధియాం కావ్యశ్రమజ్ఞో జనః". 14

వ్యా. కాని తత్త్వాభినివేశి (తత్త్వమును తెలుసుకొనవలె నని పట్టుదల కలవాడు) వేయిమందిలో ఒక డుండునేమో; కావుననే ఇట్లు చెప్పబడినది :-

"ఎవడు శబ్దముల గుంఫనవిధానమును బాగుగ వివేచింపగలడో, సూక్తులను విని ఆనందించునో, దట్టమైన రసామృతమును ఆస్వాదించునో, తాత్పర్యముద్రను అన్వేషించి గ్రహించునో, కావ్యరచనలో నున్న శ్రమను గుర్తింపగలిగిన అట్టి జనుడు, మంచి వివేచకుడు లభింపకపోవుటచే లోలోననే కుములుచున్న బుద్ధిమంతులలో (కవులలో) ఏ కొలదిమందికో, ఎప్పుడో, పుణ్యములచే లభించును."

శ్లో॥ స్వామీ మిత్రం చ మన్త్రీ చ శిష్యశ్చాచార్య ఏవ చ,
కవేర్భవతి హీ చిత్రం కిం హి తద్యన్న భావకః. 15

వ్యా. కవికి భావకుడే స్వామి; మిత్రుడు; మంత్రి; శిష్యుడు; మరియు ఆచార్యుడు. కవికి భావకుడు ఏమి కాడు? ఏమి ఆశ్చర్యము? (కవికి సర్వవిధముల సహాయము చేయువాడు భావకుడే అని అర్థము).

శ్లో॥ కావ్యేన కిం కవే స్తస్య తన్మనోమాత్రవృత్తినా,
నీయన్తే భావకైర్యస్య న నిబన్ధా దిశో దశ. 16

వ్యా. "ఏ కవియొక్క రచనలను భావకులు పది దిక్కులందును వ్యాపింపచేయరో అట్టి కవియొక్క మనస్సులో మాత్రమే ఉండెడు కావ్యముచే ఏమి ప్రయోజనము"?

శ్లో॥ సన్తి పుస్తకవిన్యస్తాః కావ్యబన్ధా గృహే గృహే,
ద్విత్రాస్తు భావకమనఃశిలాపట్టనికుట్టితాః. 17

వ్యా. పుస్తకలిఖితము లగు కావ్యబంధములు ఇంటింటను ఉన్నవి (ఉండవచ్చును). భావకుల మనస్సు లనెడు శిలాఫలకములపై చెక్కినవి మాత్రము రెండు - మూడే ఉండును.

శ్లో॥ సత్కావ్యే విక్రియాః కాశ్చిద్భావకస్యోల్లసన్తి తాః,
సర్వాభినయనిర్ణీతా దృష్టా నాట్యసృజా న యాః. 18

వ్యా. సత్కావ్యమునందు (సత్కావ్యపఠనసమయమునందు), భావకునకు ఒకానొక విధమైన, అనగా వర్ణింపశక్యము కాని, మానసవికారములు కలుగును. అనేకవిధము

లగు అభినయములను నిర్ణయించినపుడు, నాట్యశాస్త్రనిర్మాత యగు భరతుడు కూడ, వాటిని గూర్చి ఊహించి యుండలేదు.

శ్లో॥ వాగ్భావకో భవేత్కశ్చిత్కశ్చిద్ధృదయభావకః,
సాత్త్వికైరాఙ్గికైః కైశ్చిదనుభావైశ్చ భావకః. 19

వ్యా. భావకులలో కొందరు (ఆహా ! ఓహో! మొదలైన) మాటలద్వారా భావప్రకటన చేయుదురు. కొందరు హృదయమునందే భావన చేయుదురు. మరికొందరు, సాత్త్విక భావముల ద్వారా, ఆంగికచేష్టల ద్వారా, అనుభావముల ద్వారా భావావిష్కరణము చేయుదురు.

శ్లో॥ గుణాదానపరః కశ్చిద్దోషాదానపరోఽపరః,
గుణదోషాహృతిత్యాగపరః కశ్చన భావకః. 20.

వ్యా. ఒకడు గుణములను స్వీకరించుటయందు ఆసక్తి కలవాడు. మరియొకడు దోషములను గ్రహించుటయందు ఆసక్తుడు. మూడవరకమైన భావకుడు గుణగ్రహణ దోషపరిత్యాగములందు ఆసక్తి కలవాడు.

శ్లో॥ అభియోగే సమానేఽపి విచిత్రో యదయం క్రమః,
తేన విద్మః ప్రసాదోఽత్ర నృణాం హేతురమానుషః. 21

వ్యా. భావకు లందరును కావ్యార్థభావన చేయుటకై ప్రయత్నము చేయుచుండుట సమానమే యైనను వారిలో, పైన చెప్పినవిధమున, విచిత్రపద్ధతులు కానవచ్చుచున్నవి. దీనిని బట్టి, ఆయా వ్యక్తులు సంపాదించుకొనిన ఒకానొక దివ్య ప్రసాదమే దీని కంతకును హేతు వని తెలుసుకొను చున్నాము.

శ్లో॥ న నిసర్గకవిః శాస్త్రే న క్షుణ్ణః కవతే చ యః,
విడమ్బయతి సాత్మానమాగ్రహగ్రహిలః కిల. 22

వ్యా. ఎవడు సహజకవి కాడో, ఎవడు శాస్త్రమునందు పరినిష్ఠితజ్ఞానవంతుడు కాడో, అట్లయినను కవితారచన చేయుచుండునో, అట్టివాడు కేవలము మొండి పట్టుదలతో తనను తాను పరిహాసపాత్రమునుగా చేసికొనుచున్నాడు. (సః + ఆత్మానమ్ "సోఽచి లోపేచేత్పాదపూరణమ్" అను సూత్రముచే సులోపము).

శ్లో॥ కవిత్వం న స్థితం యస్య కావ్యే చ కృతకౌతుకః,
తస్య సిద్ధిః సరస్వత్యాస్తన్త్రమన్త్రప్రయోగతః. 22



వ్యా. సహజకవితాశక్తి లేకపోయినను కావ్యము రచింపవలె నని ఆసక్తి కలవానికి సరస్వతీతంత్రమంత్రముల ప్రయోగమువలన సిద్ధి లభించును.

శ్లో॥ పదాన్తరం వేత్తి సుధీః స్వవాక్యపరవాక్యయోః,
తదా స సిద్ధో మన్తవ్యః కుకవిః కవిరేవ వా. 23

వ్యా. కుకవి యైనను కవియైనను ఒక కవి ఎపుడు తన వాక్యమునందును, పరుల వాక్యమునందును ప్రయోగించిన పదముల తారతమ్యమును గ్రహింపగలుగునో, అపుడు ఆతడు సిద్ధుడు (కవితాసిద్ధి కలవాడు) అని గ్రహింపవలెను.

వి. యదాన్తరం అను పాఠ మున్నచో యుక్తము "ఎపుడు స్వపరరచనలలోని తారతమ్యమును గ్రహించునో" అని యర్థము.

శ్లో॥ కారయిత్రీభావయిత్ర్యావితీమే ప్రతిభాభిదే,
అథాతః కథయిష్యామో వ్యుత్పత్తిం కావ్యమాతరమ్. 24

ఇతి రాజశేఖరకృతౌ కావ్యమీమాంసాయాం కవిరహస్యే ప్రథమేఽధికరణే చతుర్థోఽధ్యాయః పదవాక్యవివేకః కావ్యవిశేషేషు కారయిత్రీ భావయిత్రీ నామసమీక్షా.

వ్యా. ఇవి (ఇంతవరకును నిరూపిత మైనవి) కారయిత్రి భావయిత్రి అను ప్రతిభాభేదములు. ఇక ఇటుపైన కావ్యమాత యైన వ్యుత్పత్తిని గూర్చి చెప్పెదము.

బాలనందినిలో చతుర్థాధ్యాయము సమాప్తము.

## పఞ్చమోధ్యాయః - వ్యుత్పత్తిః కావ్యపాకశ్చ.

మూ. "బహుజ్ఞతా వ్యుత్పత్తిః" ఇత్యాచార్యాః. సర్వతోదిక్కా హి కవివాచః. తదుక్తమ్ :-

శ్లో॥ ప్రసరతి కిమపి కథఞ్చన నాభ్యస్తే గోచరే వచః కస్య,
ఇదమేవ తత్కవిత్వం యద్వాచః సర్వతోదిక్కాః. 1

వ్యా. అనేక విషయములు తెలిసి యుండుటకు వ్యుత్పత్తి యని పేరు అని ఆచార్యుల అభిప్రాయము. కవుల వాక్కులు సర్వతోముఖములుగ (అన్ని విషయములకు సంబంధించినవిగ) ఉండును కదా? కావుననే ఇట్లు చెప్పబడియున్నది :-

"అలవాటైన విషయమున, ఏదియో విధముగ, ఏ కొంచెముగనో, ఎవనివాక్కు ప్రసరించకుండ ఎట్లుండును. (అలవాటుగా తెలిసిన విషయమును గూర్చి ప్రతి యొక్కడును

ఏ కొంచెమో వ్రాయ గలిగియే యుండును. అందులో విశేష మేమియు లేదు). వాక్కులు సర్వతోముఖములుగ నుండుటయే, అనగా అనేకవిషయములకు సంబంధించి యుండుటయే, సత్కవిత్వమునకు లక్షణము".

మూ. 'ఉచితానుచితవివేకో వ్యుత్పత్తిః" ఇతి యాయావరీయః. ప్రతిభావ్యుత్పత్త్యోః ప్రతిభా శ్రేయసీ ఇత్యానన్దః. సా హి కవేరవ్యుత్పత్తికృతం దోషమశేషమాచ్ఛాదయతి, తదాహ :-

శ్లో॥ "అవ్యుత్పత్తికృతో దోషః శక్త్యా సంవ్రియతే కవేః,
యస్త్వశక్తికృతస్తస్య ఝగిత్యేవావభాసతే". 2

శక్తిశబ్దశ్చాయముపచరితః ప్రతిభానే వర్తతే.

శ్లో॥ "ఏతత్కిం శిరసి స్థితం మమ పితుః? ఖణ్డం సుధాజన్మనో
లాలాటం కిమిదం? విలోచనమిదం, హస్తేఽస్య కిం? పన్నగః,
ఇత్థం క్రౌఞ్చరిపోః క్రమాదుపగతే దిగ్వాససః శూలినః
ప్రశ్నే వామకరోపరోధసుభగం దేవ్యాః స్మితం పాతు వః. 3

వ్యా. వ్యుత్పత్తి యనగా ఉచితానుచితవివేక మని యాయావరీయుని అభిప్రాయము. ప్రతిభావ్యుత్పత్తులలో ప్రతిభ ఉత్తమమైనది అని ఆనందవర్ధనుడు చెప్పినాడు. అది అవ్యుత్పత్తిచేత కవికి కలిగిన లోపమును పూర్తిగా ఆచ్ఛాదించును. ఆ విషయమునే చెప్పి యున్నాడు :- "కవికి వ్యుత్పత్తి లేని లోపము శక్తిచేత కప్పబడును. కాని శక్తి లేకపోవుటచే కలిగిన దోషము మాత్రము వెంటనే కనబడిపోవును." (ఈ శ్లోకము ధ్వన్యాలోకములోనిది).

ఇచట 'శక్తి' శబ్దము ఉపచారముచే (గౌణప్రయోగముచే) ప్రతిభ అనునర్థమున ప్రయుక్త మైనది. (ప్రతిభకు ఉదాహరణము) :-

"నా తండ్రి శిరస్సుపై నున్నది ఏమి?" "చంద్రకళ". "లలాటముపై నున్నది ఏమి?" "ఇది నేత్రము". "ఈయన హస్తమున ఇది ఏమి?" "అది సర్పము". "ఈవిధముగ దిగంబరుడైన ఈశ్వరుని విషయమున (బాలుడైన) కుమారస్వామియొక్క ప్రశ్న క్రమముగ వచ్చుచుండగా, ఎడమచేతితో నతని నోరు మూయుట ద్వారా ఆ ప్రశ్నను అడ్డుకొనుటచే సుందరముగనున్న, పార్వతియొక్క చిరునవ్వు మిమ్ములను రక్షించుగాక."

వి. ఇచట కుమారస్వామి - పార్వతుల నడుమ జరిగిన ప్రశ్నోత్తరముల వర్ణనము అనుచితముగ నున్నది గాన ఇందు కొంతవరకు కవియొక్క వ్యుత్పత్తి (యాయావరీయమత ప్రకారము) కొరతవడినది. కాని ప్రతిభచే ఆ ప్రశ్నోత్తరముల కొక క్రొత్త మళుపు ఏర్పరచి కవి ఇచట కావ్యసౌందర్య మంతగ చెడకుండ చేసినాడు.



మూ. "వ్యుత్పత్తిః శ్రేయసీ" ఇతి మంగళః. సా హి కవేరశక్తికృతం దోషమశేషమాచ్ఛాదయతి. తథాహి :-

శ్లో॥ "కవేః సంవ్రియతేఽశక్తిర్వ్యుత్పత్త్యా కావ్యవర్త్మని,
వైదగ్ధీచిత్త (త్ర) చిత్తానాం హేయా శబ్దార్థగుమ్ఫనా." 4

వ్యా. "(ప్రతిభావ్యుత్పత్తులలో) వ్యుత్పత్తి గొప్పది" అని మంగళుని అభిప్రాయము. అది కవికి శక్తి లేని లోపము నంతను పూర్తిగ కప్పివేయును. ఈ విషయమే ఇట్లు చెప్పబడినది.

"కావ్యమార్గమున, కవి యొక్క అశక్తి వ్యుత్పత్తిచేత కప్పివేయబడును. వైదగ్ధిచే (వ్యుత్పత్తిచే) చిత్రిత మగు మనస్సు కల పాఠకులకు (ప్రతిభాకృత మగు) శబ్దార్థగుంఫన హేయమైనది." అనగా కవియొక్క వ్యుత్పత్తిచే ఆకృష్టచిత్తు లగు పాఠకులు. ప్రతిభాకృత మగు శబ్దార్థగుంఫన విషయమున అంతగా ఆదరము చూపరు.

మూ. వ్యుత్పత్తిర్యథా :-

శ్లో॥ కృతః కణ్ఠే నిష్కో న హి కిముత తన్వీ మణిలతా
కృశం లీలాపత్రం శ్రవసి నిహితం కుణ్డలముచి,
న కౌశేయం చిత్రం వసనమవదాతం తు వసితం
సమాసన్నీభూతే నిధువనవిలాసే వనితయా. 5

వ్యా. వ్యుత్పత్తికి ఉదాహరణ మెట్లనగా -

"సురతవిలాససమయము ఆసన్న మైనపుడు, వనిత, కంఠమున సువర్ణాభరణమును ధరింపక సన్నని మణిలతను ధరించెను. కుండలములు తీసివేసిన శ్రవణములందు సన్నని విలాసార్థ మైన పత్రము ఉంచెను. పట్టువస్త్రమును ధరింపక తెల్లని వస్త్రమును ధరించెను."

వి. ఇచట శబ్దార్థగుంభనలో అంతగా సౌందర్యము లేకున్నను, సురతానుకూల వేషధారణవర్ణనము ఔచిత్యజ్ఞానసమంచిత మగుటచే కవికి గల వ్యుత్పత్తిని సూచించుచున్నది.

మూ. "ప్రతిభావ్యుత్పత్తీ మిథః సమవేతే శ్రేయస్యౌ" ఇతి యాయావరీయః. న ఖలు లావణ్యలాభాదృతే రూపసమ్పత్, ఋతే రూపసమ్పదో వా లావణ్యలబ్ధిర్మహతే సౌందర్యాయ.

వ్యా. ప్రతిభావ్యుత్పత్తులు రెండును ఒకదానితో ఒకటి కలిసి యున్నచో మంచిది. అని యాయావరీయుని అభిప్రాయము. లావణ్యము లేనిచో రూపసంపదగాని, రూపసంపద లేనిచో లావణ్యము గాని సౌందర్యజనకము కాజాలదు కదా?

వి. ముత్యములలోని కాంతి వలె, శరీరము నందంతటను కనబడు ఒక విధమగు నిగారింపు లావణ్యము. వివిధము లగు అవయవముల సంఘటనము నిర్దుష్టముగ నుండుట రూపము. ఈ రెండింటి కలయికవలన లభించునది సౌందర్యము.

**మూ.** ఉభయయోగో యథా :-

**శ్లో॥** **జఙ్ఘాకాణ్డోరునాలో నఖకిరణలసత్కేసరాలీకరాలః**
**ప్రత్యగ్రాలక్తకాభాప్రసరకిసలయో మఞ్జుమఞ్జీరభృఙ్గః,**
**భర్తుర్నృత్యానుకారే జయతి నిజతనుస్వచ్ఛలావణ్యవాపీ**
**సమ్భూతామ్భోజశోభాం విదధదభినయాద్దణ్డపాదో భవాన్యాః.** 6

**వ్యా.** ప్రతిభావ్యుత్పత్తుల సమ్మేళనమునకు ఉదాహరణ మెట్లనగా :-

"భర్తయొక్క (శివునియొక్క) నృత్యమును అనుకరించుచు (పార్వతి) అభినయము చేయుటవలన (చేయునపుడు), కాలు అనెడు పెద్దదైన కాడకలదియు, నఖకిరణము లనెడు ప్రకాశించుచున్న కింజల్కములచే వ్యాప్తమైనదియు, అప్పుడే పెట్టిన లత్తుకయొక్క కాంతి ప్రసారమనెడు చిగుళ్లు కలదియు, మృదువైన (మధురధ్వని చేయుచున్న) అందెలే తుమ్మెదగా కలదియు, (ఈ విధముగ) తనశరీరము యొక్క స్వచ్ఛమైన లావణ్యమనెడు దిగుడు బావియందు పుట్టిన పద్మముయొక్క శోభను కల్పించుచున్న పార్వతీదేవియొక్క దండపాదము సర్వోత్కృష్టముగ నున్నది".

వి. నూపురముతో కూడిన పాదమును దండమును చాచినట్లు శీఘ్రముగ చాచినచో అది దండపాదము. **"నూపురం చరణే కృత్వా దణ్డపాదం ప్రసారయేత్. క్షిప్రావిద్ధకరం చైవ దణ్డపాదం తదుచ్యతే"** అని నాట్యశాస్త్రము (4.143). ఈ విధముగ శాస్త్రవ్యుత్పత్తియు, ఉచితపదాదిప్రయోగముచే దేవీనృత్యమును వర్ణించుట ద్వారా ప్రతిభయు ఇచట చూపబడినవి. ఇది చండీశతకములోని పద్య మని కావ్యప్రకాశాదులలో నాగేశాదులు చెప్పినారు కాని కావ్యమాలాప్రచురిత మగు చండీశతకములో ఈ శ్లోకము లేదు.

**మూ.** ప్రతిభావ్యుత్పత్తిమాంశ్చ కవిః కవిరిత్యుచ్యతే. స చ త్రిధా-శాస్త్రకవిః, కావ్యకవిః, ఉభయకవిశ్చ. "తేషాముత్తరోత్తరో గరీయాన్" ఇతి శ్యామదేవః. 'న' ఇతి యాయావరీయః; యథా స్వవిషయే సర్వో గరీయాన్. న హి రాజహంసశ్చన్ద్రికాపానాయ ప్రభవతి; నాపి చకోరోఽద్భ్యః క్షీరోద్ధరణాయ, యచ్ఛాస్త్రకవిః కావ్యే రససమ్పదం విచ్ఛినత్తి, యత్కావ్యకవిః శాస్త్రే తర్కకర్కశమప్యర్థముక్తివైచిత్ర్యేణ శ్లథయతి. ఉభయకవిస్తూభయోరపి వరీయాన్ యద్యుభయత్ర పరం ప్రవీణః స్యాత్. తస్మాత్తుల్య ప్రభావావేవ శాస్త్రకావ్యకవీ.



**వ్యా.** ప్రతిభావ్యుత్పత్తులు రెండును ఉన్న కవియే కవియని చెప్పబడును. అట్టి కవి - శాస్త్రకవి, కావ్యకవి ఉభయకవి అని మూడు విధములు, "వీరిలో ఉత్తరోత్తరుడు (మొదటి వానికంటె రెండవవాడు, రెండవవానికంటె మూడవవాడు) గొప్పవాడు" అని శ్యామదేవుని అభిప్రాయము. అది అట్లు కాదని యాయావరుని అభిప్రాయం. అది యెట్లనగా - తన తన విషయమున ప్రతి ఒక్కరు గొప్పవారే. రాజహంస చంద్రికాపానము చేయజాలదు; చకోరము నీటినుండి పాలను వేరుచేయజాలదు. శాస్త్రకవి (యథాశాస్త్రముగ రచన చేయుటచే) కావ్యమునందు రససంపదను శోభాయుక్తము చేయును. కావ్యకవి, శాస్త్రమునందు తర్కకర్కశ మగు విషయమును గూడ ఉక్తివైచిత్ర్యముచే శిథిలముగ (కాఠిన్య రహితముగ) చేయును. అటు శాస్త్రమునందును, ఇటు కావ్యమునందును మంచి ప్రావీణ్యము సంపాదించిన యెడలనే ఉభయకవి శాస్త్రకావ్యములు రెండిటియందును గొప్ప వాడగును. కావున శాస్త్రకవియు కావ్యకవియు గూడ సమాన మైన ప్రభావము కలవారే. (వారిలో తారతమ్యము ఎంచవలసిన పని లేదు).

